సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
బుధవారం, 25.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 153
పేజీలు: 12 వెల: రూ. 5

# మతం మారితే ఎస్సీ హోదా రద్దు

## అట్రాసిటీ కేసులో సుప్రీం కోర్టు సంచలన తీర్పు

- క్రైస్తవం లేదా ఇస్లాంలోకి మారితే ఎస్సీ రిజర్వేషన్లు, చట్టపరమైన రక్షణ వర్తించవు
- ఏపీ హైకోర్టు తీర్పును సమర్థిస్తూ మత మార్పిడిపై కీలక తీర్పు
- మత మార్పిడి తర్వాత అట్రాసిటీ రక్షణ పొందలేరని సూచించిన అత్యున్నత ధర్మాసనం
- రాజ్యాంగం 341 ప్రకారం ఎస్సీ హోదా పరిమితులు మరోసారి పునరుద్ఘాటన

09



మత మార్పిడి చేసుకున్న వారికి రిజర్వేషన్లు, కులపరమైన రక్షణలు వర్తించవని దేశ అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. క్రైస్తవ మతంలోకి మారిన వ్యక్తి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద రక్షణ పొందలేరని పేర్కొంటూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది.

---

### 2028 నాటికి ప్రతీ ఇంటికీ
## సురక్షిత తాగునీరు
### జేజేఎం 2.0కు కేంద్రరాష్ట్ర ఒప్పందం



09

- 2028 లక్ష్యంగా జల్ జీవన్ మిషన్ 2.0 వేగవంతం
- గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థకు పంచాయతీలే భరోసా
- కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యంతో 'హర్ ఘర్ జల్' అమలు
- నీటి నాణ్యత పరీక్షల్లో డ్వాక్రా మహిళలకు కీలక బాధ్యత

### అర్హులైన జర్నలిస్టులకు
## కార్డుల మంజూరు
### మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం



- సమగ్ర పరిశీలన అనంతరం దరఖాస్తులకు ఆమోదం
- మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా కార్డుల జారీ
- ఏప్రిల్ మొదటివారంలో మళ్లీ సమావేశం నిర్వహణ
- జిల్లాల ప్రతిపాదనలకు ఆమోదం.. వేగవంతానికి సూచనలు

03

### ఆ భయంతోనే నాపై
## కార్ రేస్ చార్జిషీట్
### ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం

- ఆరు గ్యారంటీలపై అసెంబ్లీలో బిల్లు పెడుతున్నాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)




03

---




- 26కు పెరుగనున్న పార్లమెంట్ స్థానాలు
- మహిళలకు ఎక్కువ సీట్లు
- లోక్ సభ సెషన్‌లో మహిళా బిల్లు
- జనగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన




**తెలంగాణలో 60 మేరకు అసెంబ్లీ స్థానాలు అదనం**

# డీలిమిటేషన్

### 50 శాతం పార్లమెంట్, అసెంబ్లీ సీట్ల పెంపు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50 శాతం మేర పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బిల్లు అమలైతే లోక్‌సభ స్థానాలు 816కి, అసెంబ్లీ స్థానాలు 6,185కి పెరుగుతాయి. దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాలతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ సీట్లను 50 శాతం మేర పెంచాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టేందుకు మోదీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ ప్రతిపాదన కనుక అమలైతే, లోక్‌సభ స్థానాల సంఖ్య 543 నుండి 816కి పెరుగుతుంది. దేశంలోని మొత్తం అసెంబ్లీ స్థానాలు 4,123 నుండి 6,185కి పెరుగుతాయి. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేసేందుకు వీలుగా సంబంధిత చట్టాలకు సవరణలు తీసుకురావాలని కేంద్రం భావిస్తోంది. ఆ దిశగా కసరత్తు చేసి, కేంద్రం అడుగులు వేస్తోంది.

**ఏపీ, తెలంగాణలో ఎన్ని స్థానాలు..**

కేంద్ర నిర్ణయంతో తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రాతినిధ్యం భారీగా పెరగనుంది. ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి, తెలంగాణలో 17 స్థానాలు 26కి పెరుగుతాయి. ఏపీలో అసెంబ్లీ స్థానాలు మిగతా 02లో

---

### ఇద్దరు అవుట్..
## నలుగురు ఇన్!?
### క్యాబినెట్ విస్తరణపై కసరత్తు




- ఒకరిద్దరు మంత్రులపై ఆగ్రహం
- కేబినెట్‌లోకి కొత్త నేతలు
- సీఎం నిర్ణయం ఏమిటీ?
- అజారుద్దీన్ పోస్ట్ పదిలమేనా?
- హస్తినలో జోరు ప్రచారం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** మంత్రివర్గంలో మార్పులపై లీకులు మొదలయ్యాయి. తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ సిద్ధమైంది. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో ఒకరిద్దరిరికి కేబినెట్ నుంచి ఉద్వాసన పలకనున్నారని ఢిల్లీ సర్కిళ్లలో జోరుగా చర్చ నడుస్తోంది. వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. అయితే సామాజిక వర్గ సమీకరణాలను పరిగణలోకి తీసుకుని.. ఎవరిని తొలగిస్తున్నారో వారిని అదే సామాజిక వర్గ నేతతో భర్తీ చేయనున్నారు. ఇప్పటికే కొంత మంది మంత్రులకు, సీఎంకు మధ్య దూరం పెరిగిందని అర్థమవుతూనే ఉంది. ఈ నేపథ్యంలోనే ఎవరెవరు మారుతారు అనే టాక్ హీటెక్కింది.

**తొలి గండం అజారుద్దీన్ కే**

రాష్ట్ర మంత్రివర్గంలో కొనసాగుతున్న అజహరుద్దీన్ భవిష్యత్తు ఇప్పుడు సందిగ్ధంలో పడింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం, ఏ సభలోనూ (అసెంబ్లీ లేదా కౌన్సిల్) సభ్యుడు కాకుండా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వ్యక్తి, ఆరు నెలలలోపు తప్పనిసరిగా ఏదో ఒక సభకు ఎన్నిక కావాల్సి మిగతా 02లో

---

• మూడు నెలల్లో 28 మంది

## ఊరు మొత్తం ఖాళీ

### పచ్చని ఊరిలో మరణ మృదంగం
### మృత్యువు నీడలో గంద్రపల్లి

03



*ఒక చావు జరిగితేనే ఆ వీధి మూగబోతుంది.. ఒక పాడె కదిలితేనే ఆ ఊరు కన్నీరు పెడుతుంది. కానీ, ఆ గ్రామంలో గత మూడు నెలలుగా శ్మశాన వాటికల దగర చితి మంటలు ఆరడం లేదు. తలకొరివి పెట్టే చేతులు వణుకుతున్నాయి.. కన్నీరు కార్చే కళ్లు ఇంకిపోతున్నాయి. కేవలం 90 రోజుల్లో 28 ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే, ఆ ఊరి గుండె ఎంతలా తల్లడిల్లిపోతుందో వర్ణించడానికి మాటలు చాలవు. కంటికి కనిపించని ఏదో అదృశ్య శక్తి ఆ గ్రామాన్ని వెంటాడుతున్నట్లు, మృత్యువు ప్రతి ఇంటి తలుపు తడుతున్నట్లు.. గంద్రపల్లి ఇప్పుడు ఒక భీతిల్లిన పల్లెటూరు. తెల్లవారితే ఎవరి ఇంటి ముందు చావు డప్పు వినిపిస్తుందో అని వణికిపోతున్న గ్రామసులు, చివరి ప్రయత్నంగా తమ ఇళ్లకు తాళాలు వేసి, ఆత్మీయుల ప్రాణాలను కాపాడుకోవడానికి ఊరు విడిచి పొలాల బాట పట్టారు. ఆ ఇళ్ల తాళాల వెనుక ఉన్నది కేవలం భయం మాత్రమే కాదు.. "మా ఊరు మాకు కావాలి, మా మనుషులు మాకు దక్కాలి" అన్న ఆవేదనతో కూడిన ఒక ఆర్తనాదం.*

**-ముద్ర, కరీంనగర్ :**

---

### బీసీసీఐ ఉచ్చు..
## ఫ్రాంచైజీల్లో వణుకు!
### ఐపీఎల్ 2026కి ముందు బీసీసీఐ కొత్త కఠిన నిబంధనలు

- ప్రాక్టీస్, ట్రావెల్, మ్యాచ్‌డే నియమాల్లో భారీ మార్పులు
- పిచ్ నాణ్యత, క్రమశిక్షణపై బోర్డు ఫోకస్
- కుటుంబ సభ్యులపై ఆంక్షలు – ఆటగాళ్లకు కొత్త మార్గదర్శకాలు
- ఉల్లంఘనలకు హెచ్చరికలు, జరిమానాలు తప్పవు

11




*ఐపీఎల్ 2026 సీజన్ సమరానికి కౌంట్‌డౌన్ మొదలైన వేళ భారత క్రికెట్ నియంత్రణ మండలి సంచలన నిర్ణయాలతో ఫ్రాంచైజీలకు షాక్ ఇచ్చింది. కేవలం మైదానంలో ఆటకే పరిమితం కాకుండా ఆటగాళ్ల ప్రాక్టీస్ సెషన్లు, ప్రయాణ ఏర్పాట్లు, చివరకు డ్రెస్ కోడ్ వరకు కఠినతరమైన కొత్త నిబంధనలను అమల్లోకి తెస్తూ బోర్డు కొరడా ఝుళిపించింది. మార్చి 28న బెంగళూరు వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరగనున్న ఆరంభ పోరుకు ముందే పిచ్ సంరక్షణ, క్రమశిక్షణే పరమావధిగా బోర్డు జారీ చేసిన ఈ విధివిధానాలు ఇప్పుడు లీగ్‌లో పెను చర్చకు దారితీస్తున్నాయి.*



## కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి గుడ్ బై

- ఫలించని ఏఐసీసీ బుజ్జగింపులు
- నేడో రేపో పార్టీ సభ్యత్వానికి రాజీనామా
- జీవన్ రెడ్డి నివాసానికి పార్టీ రాష్ట్ర చీఫ్, మంత్రులు
- కాంగ్రెస్ కండువ కప్పుకునేందుకూనిరాకరణ
- ఇంట్లో, బయట ఇందిరమ్మ ఫ్లెక్సీలు తొలగింపు

09

### ముద్ర మది మాట

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వింత వ్యాఖ్యలు చేశారు. 'పదవుల కోసం ఆశపడే వ్యక్తిని కాదు.. కానీ మంత్రి పదవి ఇస్తే పార్టీతో పాటు ప్రభుత్వానికే మంచి జరుగుతుంది' అన్నారు.




---

### త్వరలో 'సాదాబైనామా'
## పరిష్కారం

03

**కొనుగోలుదారు అఫిడవిట్ ఇస్తే సరిపోతుంది**



- దరఖాస్తుదారులకు మేలు జరిగేలా జీ.ఓ. 76
- శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




## అక్కడ పెట్రోల్ ఉందా?

### బంకుల దగ్గర గుమికూడిన జనం

09

- పెట్రోల్ కు క్యూ కడుతోన్న ప్రజలు
- నో స్టాక్ బోర్డులు..

### గద్దర్ అవార్డుల్లో
## గోల్‌మాల్
### ఫంక్షన్ పేరుతో మాయ

- రెండు కోట్లు నొక్కేశారా?
- బీఆర్ఎస్ నేత దాసోజు సంచలన ట్వీట్

09




### మొరాయించిన సర్వర్..
## రిజిస్ట్రేషన్లకు బ్రేక్
### సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందని సేవలు

- రిజిస్ట్రేషన్ల కోసం గంటల తరబడి పడిగాపులు
- మధ్యాహ్నం తర్వాత సేవలు పునఃప్రారంభం

02

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 25.03.2026
www.mudranews.in | @mudranews



## శ్రీ వేంకటేశ్వర స్వామి వైభవం



తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించబడతారు. భక్తులు కోరికలు నెరవేర్చే దేవుడిగా అత్యంత విశ్వాసంతో దర్శనం చేస్తారు.

# డీలిమిటేషన్

(మొదటి పేజీ తరువాయి)


175 నుంచి 263, తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 119 నుండి 179కి చేరే అవకాశం ఉంది. ఈ అంశంపై ఇప్పటికే ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో పాటు విపక్షాలతోనూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో ప్రాథమిక చర్చలు జరిగాయి. 2027 మార్చి నాటికి జనగణన పూర్తి చేసి, ఆ లెక్కల ఆధారంగానే 2029 ఎన్నికల నాటికి ఈ కొత్త సీట్ల పెంపును అమలు చేయాలని మోదీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు చేపడితే ఉత్తరాది, దక్షిణ రాష్ట్రాల మధ్య రాజకీయ ప్రాతినిధ్యంలో వ్యత్యాసం వస్తుందన్న ఆందోళన కొనసాగుతోంది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్రం, అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్లు మేర పెంచాలని కొత్త వ్యూహాన్ని తెరపైకి తెచ్చింది. ఈ ప్రతిపాదనపై స్పందించేందుకు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో విపక్షాలు మంగళవారం నాడు భేటీ కానున్నాయి.

### లోక్‌సభ స్థానాలు ఏ రాష్ట్రంలో ఎన్ని..

50 శాతం మేర లోక్‌సభ సీట్లు పెంపు జరిగితే కనుక ఎక్కువ ప్రయోజనం ఉత్తరప్రదేశ్‌కు కలుగుతుంది. యూపీలో 80 ఉన్న లోక్‌సభ సీట్లు 120 అవుతాయి. ఇందులో 40 సీట్లు మహిళలకు రిజర్వ్ చేయనున్నారు. మహారాష్ట్ర సీట్లు 48 నుండి 72కి పెరుగుతాయి. పశ్చిమ బెంగాల్ 42 నుండి 63కి, బీహార్ 40 నుండి 60కి, ఏపీలో లోక్‌సభ సీట్లు 25 నుంచి 38, తెలంగాణలో 17 నుంచి 26కి చేరతాయి. తమిళనాడులో లోక్‌సభ సీట్ల సంఖ్య 39 నుండి 59కి, మధ్యప్రదేశ్ లోక్‌సభ సీట్లు 29 నుండి 44కి పెరుగుతాయి. చిన్న రాష్ట్రాలలో, అరుణాచల్ ప్రదేశ్, గోవా, మణిపూర్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల లోక్‌సభ సీట్లు 2 నుండి 3కి పెరగవచ్చు. ప్రస్తుతం ఒక్కో సీటు ఉన్న మిజోరం, నాగాలాండ్, సిక్కిం రాష్ట్రాలకు 2 సీట్లు చొప్పున వచ్చే అవకాశం ఉంది. కేంద్రపాలిత ప్రాంతాలలో ఢిల్లీలో లోక్‌సభ సీట్లు 7 నుండి 11కి, జమ్మూ కాశ్మీర్ సీట్లు 5 నుండి 8కి పెరుగుతాయి. లడఖ్, పుదుచ్చేరి వంటి ఒకే సీటు ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలలో సీట్ల సంఖ్య పెరుగుతుందా లేదా అనే దానిపై ఇంకా స్పష్టత లేదు.

### 2029 ఎన్నికల నుంచే మార్పులు చేర్పులు..

2023 సెప్టెంబరులో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రకారం, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు 2034 నుండి అమల్లోకి రావాలి. రాజ్యాంగంలోని అధికరణలు 170(3), 81(3) నిబంధనల మేరకు, 2026 తర్వాత వెలువడే జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. అయితే, తాజా పరిణామాల ప్రకారం 2027 మార్చి 1 నాటికి జనగణన ప్రక్రియ పూర్తి కానుంది. వెంటనే నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టే అవకాశం ఉంది. తద్వారా రిజర్వేషన్ల అమలును అనుకున్నదానికంటే ముందే పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలను ప్రారంభించింది.




# మొరాయించిన సర్వర్ రిజిస్ట్రేషన్లకు బ్రేక్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
మొరాయించిన సర్వర్లతో రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడింది. సుమారు 4 గంటల పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనులు సాగ లేదు. దీంతో స్లాట్ బుకింగ్ చేసుకుని.. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు.. గంటల తరబడి ఆఫీసుల ముందు పడిగాపులు కాశారు. మంగళవారం ఉదయం నుంచే సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సర్వర్లు పనిచేయకుండా పోయాయి. ఫలితంగా తెలంగాణలో భూములు, ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. స్లాట్ బుకింగ్‌లు, చలాన్ల చెల్లింపులు కూడా ఆగిపోయాయి. ఈ క్రమంలోనే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల వద్ద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూమి బదిలీ చేసేందుకు కార్యాలయాలకు వచ్చిన కొందరు నిరాశతో వెనుదిరిగి ఇంటికి వెళ్లారు. మరికొందరు సేవలు ప్రారంభమయ్యే వరకు అక్కడే వేచి చూశారు. కొన్ని చోట్ల రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను జనం నిలదీశారు. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లోని సర్వర్లలో సాంకేతిక లోపాలు తలెత్తడంతోనే ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయినట్లు సంబంధిత అధికారులు చెప్పినా వినకుండా వారితో వాగ్వాదానికి దిగారు. ఉదయం ఆఫీసులు ప్రారంభం అయినప్పటి నుంచే సర్వర్లు మొరాయించడంతో భూముల క్రయ, విక్రయాలు నిలిచిపోయి.. వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో రిజిస్ట్రేషన్లకు సంబంధించిన స్లాట్ బుకింగ్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఈ కేవైసీ సహా రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఏ పనీ సాగలేదు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్లు బుక్ చేసుకుని.. కొనుగోలుదారులు, అమ్మకందారులు సాక్షులతో సహా రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చి ఉదయం నుంచి పడిగాపులు కాశారు. మరోవైపు.. దూర ప్రాంతాల నుంచి ఆఫీసులకు వచ్చిన వారు సర్వర్లు ఎప్పుడు పని చేస్తాయి.. తమ పని ఎప్పుడు అవుతుందో తెలియక తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రిజిస్ట్రేషన్ల శాఖ మెయిన్ సర్వర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయినట్లు గుర్తించిన అధికారులు.. టెక్నికల్ టీమ్‌లను రంగంలోకి దించారు. సర్వర్ మొరాయింపులను సరి చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో తిరిగి సేవలను తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.




# ఇద్దరు అవుట్.. నలుగురు ఇన్!?

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుంది. అజహరుద్దీన్ మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏప్రిల్ ఆఖరుకు ఆరు నెలల గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం ఆయనను ఎమ్మెల్సీగా నామినేట్ చేస్తూ పంపిన సిఫార్సును గవర్నర్ ఇంకా ఆమోదించకపోవడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. గడువులోగా సభ్యత్వం రాకపోతే, ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ వ్యవహారం ఇప్పుడు న్యాయస్థానాల చుట్టూ తిరుగుతోంది. గవర్నర్ నిర్ణయంలో జరుగుతున్న జాప్యాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఇటీవల సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వివాదాన్ని హైకోర్టులోనే తేల్చుకోవాలని అత్యున్నత న్యాయస్థానం సూచించడంతో, ఇప్పుడు అందరి దృష్టి హైకోర్టు తీర్పుపైనే నిలిచింది. గవర్నర్ కోటా కింద నామినేట్ చేసే అభ్యర్థుల అర్హతలపై గతంలో కూడా పలు వివాదాలు తలెత్తిన నేపథ్యంలో, న్యాయస్థానం ఇచ్చే తీర్పు అజహరుద్దీన్ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనుంది. ఒకవేళ కోర్టు నుండి సానుకూల నిర్ణయం రాకపోతే, ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సి ఉంటుంది. మరోవైపు, ఈ పరిణామాలపై అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న గవర్నర్ నిర్ణయాలను గౌరవించాలని కొందరు అంటుంటే, కావాలనే ప్రభుత్వం పంపిన ఫైళ్లను ఆపుతున్నారని అధికార పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఏప్రిల్ నెలాఖరుకు సమయం తక్కువగా ఉండటంతో, ఈ ఉత్కంఠకు తెరపడాలంటే హైకోర్టు త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అజహరుద్దీన్ తన పదవిని కాపాడుకుంటారా లేదా గడువు ముగిసి పదవిని వదులుకోవాల్సి వస్తుందా అనేది రాబోయే కొద్ది రోజుల్లో తేలనుంది.

**ఏఐసీసీలో సర్దుబాటు**
ఇక మంత్రివర్గం నుంచి తీసేసిన వారిని వారి సీనియారిటీని ఆధారం చేసుకుని సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనికి సంబంధించి ఆయా మంత్రులకు ఇప్పటికే పార్టీ హైకమాండ్ సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. అందుకు ఆ నేతలు కూడా సానుకూలంగానే అంగీకరించినట్లు హస్తం పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత మంత్రులను తప్పించడంతోపాటు.. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న మరో 2 మంత్రి పదవులను కూడా భర్తీ చేసేందుకు ముహూర్తం ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది.

**జిల్లాలలో బలం చూద్దామా..?**
అయితే మంత్రి వర్గంలో మార్పులు, చేర్పులు చేసేందుకు ఆయా జిల్లాల ప్రాతినిధ్యం, సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకుని చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. కేబినెట్ విస్తరణపై పార్టీలో అంతర్గత వివాదాలు రాకుండా ఉండేందుకు పక్కాగా ప్రణాళికలు చేస్తోంది. తప్పించిన మంత్రుల స్థానాలను అదే వర్గానికి చెందిన ఎమ్మెల్యేలతోనే భర్తీ చేయాలనే నిర్ణయించినట్లు సమాచారం. ఇక మంత్రి పదవుల నుంచి తప్పించిన వారు.. అవమానంగా భావించకుండా ఉండేందుకు.. వారికి ఉన్నత పదవులు ఇచ్చి హైకమాండ్ భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. అలాంటి వారికి పార్టీలో కీలకమైన, గౌరవప్రదమైన సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక మంత్రివర్గ విస్తరణలో బీసీ, ఎస్టీ వర్గాలకు ప్రాధాన్యం కల్పించాలని అధిష్ఠానం భావిస్తోంది.

**బీసీ మంత్రం పాడేనా..?**
ఇందులో భాగంగానే బీసీల్లో సంఖ్యాబలం ఎక్కువ ఉన్న మున్నూరు కాపులు, ఎస్టీల్లో ఎక్కువ జనాభా ఉన్న లంబాడీలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ నేతల్లో తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఈసారి శాసనమండలి నుంచి బీసీ సామాజికవర్గానికి చెందిన ఓ నేతకు కూడా మంత్రి పదవి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఆ నేతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చే సమయంలోనే మంత్రి పదవి ఇస్తామని స్వయంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్లు సమాచారం. కేబినెట్‌లో మార్పుల సందర్భంగానే చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులను కూడా భర్తీ చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. ఇందులో భాగంగానే అసెంబ్లీ, మండలి విప్‌ల నియామకాలు ఇటీవలె చేపట్టినా.. చీఫ్ విప్ నియామకాలను మాత్రం వాయిదా వేసినట్లు చర్చ జరుగుతోంది. మంత్రి పదవి రాని సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు కేబినెట్ హోదా ఉండే చీఫ్ విప్ పదవి ఇవ్వాలని భావిస్తున్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవిని ఇస్తున్నట్లు గతేడాది జూన్‌లో ప్రకటించగా.. తనకు ఆ పదవి ఇష్టం లేదని.. మంత్రి పదవి కావాలని ఆయన కాంగ్రెస్ పెద్దలకు తేల్చి చెప్పేశారు. దీంతో ఇంత వరకు కూడా డిప్యూటీ స్పీకర్ నియామకం జరగలేదు. చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులకు కేబినెట్ హోదా ఉండటంతో మంత్రివర్గ విస్తరణ సందర్భంగా వీటిని కూడా భర్తీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

**కేబినెట్ లో మార్పులు**
తెలంగాణ రాష్ట్ర కేబినెట్‌లో మార్పులు జరగనున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన విషయంలో కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం కేబినెట్‌లో కొనసాగుతున్న మంత్రుల్లో ఒకరు, లేదా ఇద్దరిని తప్పించి.. వారి స్థానంలో కొత్త వారిని తీసుకురావాలని యోచిస్తున్నట్లు సమాచారం. మంత్రి పదవుల నుంచి తప్పించిన వారికి ప్రమోషన్లు ఇచ్చి పార్టీలో ఉన్నత పదవులు కట్టబెట్టాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఏ సామాజిక వర్గ మంత్రిని తొలగిస్తున్నారో.. కొత్తగా అవకాశం కల్పించే వారిని కూడా అదే సామాజిక వర్గం నుంచి తీసుకురావాలని తెలుస్తోంది.

# సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయమే లక్ష్యం

- ప్రజల సమస్యలు పరిష్కారం బీఆర్ఎస్ కు ఇష్టం లేదు
- ప్రభుత్వ ఉద్యోగులకు రూ. 1.20 కోట్ల ప్రమాద బీమా దేశంలోనే సంచలనం
- 7.50 లక్షల కుటుంబాలకు వర్తింపు
- పదేండ్లు సభలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే తమ ప్రభుత్వ పరిపాలన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. వాటి చుట్టే తమ ప్రభుత్వ ఆలోచనలు తిరుగుతాయని చెప్పారు. బాబా సాహెబ్‌అంబేద్కర్ చెప్పిన అడుగుజాడల్లోనే నడుస్తూ రాష్ట్రంలో పాలన సాగిస్తున్నామన్న ఆయన తాము పాలకులం కాదు, ప్రజలకు సేవకులం అన్నారు. ప్రజలు తమకు అప్పగించిన ఈ అధికారాన్ని ఒక బాధ్యతగా భావిస్తూ ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకుపోతున్నామని వెల్లడించారు. మభ్యపెట్టే మాయమాటలు చెప్పడం.. ప్రశ్నించే వారిని దూషించడం తమ నైజం కాదని స్పష్టం చేశారు. బాధ్యతతో ఎవరు ప్రశ్నించినా.. బాధ్యతతోనే వారికి సమాధానం చెబుతామని వ్యాఖ్యానించారు. అది ప్రజల పట్ల,ప్రజాస్వామ్యం పట్ల తమకున్న చిత్తశుద్ధి అని అభివర్ణించారు. మంగళవారం రాత్రి అసెంబ్లీలో మాట్లాడిన భట్టి... విపక్ష సభ్యుల తీరుపై మండిపడ్డారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి బీఆర్ఎస్ నేతలకు ఇష్టం ఉండదన్నారు. ఇది తరతరాలుగా వస్తున్న సమస్య అన్న ఆయన ప్రతిపక్ష నేతలు ఇంకా ఆ సమస్య నుంచి బయటపడటం లేదని చురకలంటించారు. ప్రభుత్వ ఉద్యోగ కుటుంబ పెద్ద మరణిస్తే.. ఆ కుటుంబం ఉగాదంలోకి వెళ్లొదని తమ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వం చేసే ప్రతి నిర్ణయాన్ని గ్రామస్థాయికి తీసుకువెళ్లే ఉద్యోగస్తుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా వారికి రూ. 1.20 కోట్ల ప్రమాద బీమాను ప్రవేశపెట్టామని చెప్పారు. మొత్తం 7.50 లక్షల కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు వివరించారు. పదేండ్లు ప్రతిపక్షంగా కూర్చున్న తనకు జరిగిన అవమానాలు ఏంటో రికార్డులు చూస్తే స్పష్టంగా తెలుస్తుందన్నారు. ప్రజల సమస్యలపై అరిచి పెట్టిన తనకు బీఆర్ఎస్ సర్కార్ కనీసం మైక్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యంపై వారికున్న గౌరవం నమ్మకం అని సెటైర్లు వేశారు.

ప్రతి ప్రశ్నకు సమాధానం, ప్రతి అంశానికి వివరణ ఇస్తాం అన్నవారికి వినే ఓపిక లేకుండా వెళ్ళిపోయారని విమర్శించారు. పదేండ్లలో తమను సభ్యులుగా గౌరవించలేదనీ అయినా తాము అర్ధరాత్రి రెండు గంటల వరకు ఓపికగా ఉన్నామే తప్ప ఏనాడూ వాకౌట్ చేయలేదన్నారు. అవకాశం ఇవ్వలేదని వెల్లోకి వెళ్లలేదు ఓపికగా సభలో ఉన్నామని చెప్పారు. కోట్లాది ప్రజల జీవనస్థితిగతులను మార్చాలన్న ఆలోచనతో ఇక్కడికి వచ్చామన్న భట్టి.. ఎన్నికల తర్వాత మీరు అటు మేము ఇటు కూర్చుంటామని చెప్పాము అలాగే జరిగిందన్నారు. లక్షలాది మంది పేద విద్యార్థుల ఆకలిని అర్థం చేసుకున్న వ్యక్తులుగా ఈ బిడ్డ ఖాళీ కడుపుతో బడికి పోవద్దన్న ఆలోచనతో అల్పాహారం ప్రవేశపెట్టినట్లు డిప్యూటీ సీఎం వివరించారు. బడి నడిచిన ఆరు రోజుల్లో మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి జావా ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇంటర్ పిల్లలకు మొట్టమొదటిసారి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయబోతున్నామన్న భట్టి.. వాళ్లు భోజనం చేయాలో వద్దో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలన్నారు. ఇలా మత ప్రాంత భేదం లేకుండా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు 5 లక్షల ప్రమాద బీమా కల్పించినట్లు చెప్పారు.



వివరణ వినే ఓపికా ప్రతిపక్ష సభ్యులకు లేదు తాము ఎన్ని కార్యక్రమాలు చేపడుతూ ఉంటే వినే ఓపిక ప్రతిపక్ష సభ్యులకు లేకపోవడం తమకు ఆవేదన కలిగించిందన్నారు. బీఆర్ఎస్ నేతలు మాట్లాడిన అన్ని విషయాలను నమోదు చేసుకున్నామన్న డిప్యూటీ సీఎం.. సమాధానం ఇవ్వడానికి ముందుకు వచ్చామన్నారు. అయినా బడ్జెట్ కాగితాలను చించి చెవిలో పెట్టుకుని వెళ్లిపోవడం దారుణమన్నారు. బీఆర్ఎస్ సభ నాయకుడు ఎలాగు సభకు రారనీ ఆయనకు సభపై ఎలాగూ గౌరవం లేదన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్ టీఆర్ఎస్ నేతలకు కంటగింపుగా ఉందా? అని నిలదీశారు. తాము బడ్జెట్ పై వివరణ ఇస్తే వారు వినకూడదా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు కోసమే ఈ సభ ఉందన్నారు. అయితే అధికార పక్షాన్ని విమర్శించేందుకు ప్రతిపక్ష నేతల వద్ద ఏమీ లేకపోవడంతోనే మధ్యలోనే సభ నుంచి వెళ్లిపోయారని ఆరోపించారు. ప్రజల కోసం ప్రజా అవసరాల కోసం ఈ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. ప్రజల జీవితాల్లో మార్పు కోసం పని చేస్తామన్న భట్టి... తమను చులకన భావంతో చూడొద్దన్నారు. బీఆర్ఎస్ నేతల అహంకారాన్ని జీర్ణించుకునే పరిస్థితుల్లో ప్రజలు లేరని స్పష్టం చేశారు. అలవి కానీ హామీలు ఇచ్చామని హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. వాళ్లలాగా అలవి కానీ హామీలు ఇచ్చుకుంటూ పోతే బడ్జెట్ రూ. ఐదు లక్షల కోట్లకు పైగా పెట్టాల్సి వచ్చేదని చెప్పారు. ఈ సారి బడ్జెట్ లో రైతు భరోసా చేయూత ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సన్నధాన్యానికి బోనస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ గృహజ్యోతి, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇల్లు, కళ్యాణ లక్ష్మి పథకాల కోసం రూ. 50 వేల కోట్లు కేటాయించామని చెప్పారు. రైతు భరోసా కోసం రూ. 18 వేల కోట్లు ఖర్చు చేశామన్నాయన తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేసిన ఘనత కాంగ్రెస్ సర్కార్ దే అన్నారు. హైదరాబాద్కు మణిహారంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డును బీఆర్ఎస్ నేతలు ఎన్నికల ముందు కుదువబెట్టి వచ్చిన డబ్బులను ఎన్నికల ముందు రైతుబంధు పేరిట రైతుల ఖాతాల్లో జమ చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో 46శాతం మంది వ్యవసాయంపై ఆధారపడ్డారన్న భట్టి... రైతుల సంక్షేమం తమ ప్రభుత్వ ఆలోచన సన్న ధాన్యం సాగు చేసే రైతులకు 500 బోనస్ ఇస్తామని చెప్పామన్నారు. మిగిలిన పంటలు ఎవరైనా సాగు చేస్తే వారిని ప్రోత్సహించాలని ఆలోచనలో తమ ప్రభుత్వం ఉందని చెప్పారు. వ్యవసాయాన్ని పండుగ చేశామన్నారు. ఉచిత కరెంటు కాంగ్రెస్ పేటెంట్ ఉచిత కరెంటు పథకం దేశానికి దిశా నిర్దేశం చేశామన్న భట్టి విక్రమార్క... రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు ఉచిత విద్యుత్ కు 14 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు.

# మరో ఎనిమిదేళ్లు తెలంగాణలోనే ఉంటా!

## ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

- రాజకీయాల విషయంలో హైకమాండ్ దే తుది నిర్ణయం, బీఆర్ఎస్ నేతలే నన్ను హీరో చేశారు
- ఇప్పటికీ, ఎప్పటికీ తమ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుంది

**ముద్ర, న్యూఢిల్లీ :**
తాను మరో ఎనిమిదేళ్ల పాటు తెలంగాణలో రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ తర్వాత దేశ రాజకీయాల అరంగేట్రం గురించి ఆలోచిస్తానని చెప్పారు. ఒకవేళ భవిష్యత్తులో దేశ రాజకీయాలకు తాను అవసరమని పార్టీ భావిస్తే, ఆ నిర్ణయాన్ని హైకమాండ్‌కే వదిలేస్తున్నానని చెప్పారు. దేశంలోనే తెలంగాణ డీఎన్ఏ భిన్నమైందన్న ఆయన ఇదొక వైబ్రెంట్ ప్లేస్ అని కొనియాడారు. తెలంగాణకు, గాంధీ కుటుంబానికి ఉన్న ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తుచేశారు. తాను ఒక నాయకుడిలా కాకుండా, కార్యకర్తగానే భావిస్తానని, వారి కష్టనష్టాలు తనకు తెలుసని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో ఓ మీడియా ఛానెల్ డిబెట్ లో సీఎం మాట్లాడారు. రాష్ట్రంలోని 'విలన్ల'తోనే ప్రజలు తనను 'హీరో'ను చేశారని సీఎం.. బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రామాయణంలో రావణుడు ఉన్నాడు కాబట్టే రాముడికి అంత పేరు వచ్చిందన్న ఆయన తెలంగాణలో గత పాలకుల తీరుతోనే కాంగ్రెస్‌కు, తనకు ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు. ఇప్పటికీ, ఎప్పటికీ తమ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. అదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై సీఎం మండిపడ్డారు. ప్రధాని మోడీ అనుసరిస్తున్న 'త్రీడీ పాలసీ'కి వ్యతిరేకంగా దక్షిణ భారతదేశం మొత్తం ఏకం కావాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్రంలో దక్షిణాది రాష్ట్రాలకు తగిన ప్రాతినిధ్యం లభించడం లేదని ఆయన ఆరోపించారు. వెంకయ్య నాయుడుని రాష్ట్రపతిని చేయకుండా, కేవలం ఉపరాష్ట్రపతి పదవితో ఎందుకు సరిపెట్టారు?' అని ప్రశ్నించారు. కేంద్రంలో హోంశాఖ వంటి కీలక బాధ్యతలను దక్షిణాది నేతలకు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ హయాంలో దక్షిణాదికి చెందిన వారు రాష్ట్రపతులుగా ఎదిగారని, రాజకీయ వివక్ష కేవలం బీజేపీలోనే కనిపిస్తోందని విమర్శించారు.






సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
25.03.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ప్రపంచ ప్రసిద్ధ ఆలయం**

తిరుమల దేవస్థానం ప్రపంచంలోనే అత్యధికంగా సందర్శించే ఆలయాల్లో ఒకటి. ప్రతిరోజూ లక్షలాది భక్తులు దర్శనానికి తరలి వస్తారు.



# త్వరలో సాదాబైనామా

- **కొనుగోలుదారు అఫిడవిట్ ఇస్తే చాలు**
- **దరఖాస్తుదారులకు మేలు జరిగేలా జీ.ఓ. 76**
- **శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్ లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను వీలైనంత త్వరితగతిన పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. మంగళవారం శాసనమండలిలో సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వం సాదబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిందని, కానీ 2020 ఆర్.ఓ.ఆర్. చట్టంలో పరిష్కారం మార్గం చూపించలేదన్నారు.

భూ భారతి చట్టంలో ఈ సమస్యకు పరిష్కారం చూపించామన్నారు. అయితే కొనుగోలుదారు అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధనను పొందుపరచడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. వీటిని దృష్టిలో పెట్టుకొని కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామన్న మంత్రి..ఈ మేరకు జీ.ఓ. 76 ను విడుదల చేశామన్నారు. రాష్ట్రంలో 9 లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. వీటన్నింటికీ పరిష్కారం లభించబోతుందని తెలిపారు.

**ఆధార్ మాదిరిగానే భూధార్**

నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాల్లో ప్రయోగాత్మకంగా రీ సర్వే నిర్వహించామన్నారు. ఇందులో ప్రతీ సర్వే నెంబర్ కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ కేటాయించామని చెప్పారు. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో ప్రతీ జిల్లాలో 70 గ్రామాల్లో భూ సర్వే నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. దశల వారిగా భూ సర్వే నిర్వహించి భూధార్ ను ఇస్తామని, రాష్ట్రం లోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు.

**అవినీతికి పాల్పడితే ఎవరిని ఉపేక్షించబోము**

ధరణి పోర్టల్ లోని లోసగులను ఆసరాగా చేసుకొని కొంత మంది మీసేవ నిర్వాహకులతో కలిసి రూ. 3.99 కోట్ల ప్రభుత్వ సొమ్మును కాజేశారన్నారు. దీనిపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించామని తెలిపారు. తప్పుచేసిన వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేస్తామని ప్రకటించారు. ఇందులో అధికారుల పాత్ర ఉంటే ఏ స్థాయిలో ఉన్నా కూడా ఉపేక్షించబోమని తెలిపారు. శాసన మండలిలో సభ్యులు తాతా మధుసుదన్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఆనాడు ధరణి పోర్టల్ ను నాలుగు గోడల మధ్య ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి తీసుకొచ్చారని, దీని వల్లే కొత్తగా భూ సమస్యలు పుట్టుకొచ్చాయని విమర్శించారు. ధరణి పోర్టల్ లో 40, 41 మాడ్యుల్స్ ఉంటే భూ భారతి పోర్టల్ లో 6 కు కుదించామని, ధరణి పోర్టల్ ను అర్ధరాత్రి ఒక్కరోజు మార్చేది కాదని, దశలవారీగా మార్పులు చేసుకుంటూ వస్తున్నామని, ఈ ఏప్రిల్ చివరి నాటికి పూర్తి స్థాయిలో భూ భారతి పోర్టల్ ను తెస్తామని తెలిపారు.



# ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం

- **ఆరు గ్యారంటీలపై అసెంబ్లీలో బిల్లు పెడుతున్నాం**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై తాము బిల్లు పెడుతుండటంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకే హడావుడిగా తనపై ఫార్ములా ఈ రేస్ కేసులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ అక్రమ కేసు అని ఆయన ధ్వజమెత్తారు. మంగళవారం అసెంబ్లీలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన 'చిట్ చాట్'లో ఆయన ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ కేసు కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని, ఇందులో అంగుళం కూడా నిజం లేదని స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ,దీనిపై తాము అసెంబ్లీలో 'ప్రైవేట్ మెంబర్ బిల్లు' ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఈ కేసులో అధికారులను ఇబ్బంది పెట్టడం సరికాదని ఆయన హితవు పలికారు. "మీకు నాపై కక్ష ఉంటే నేరుగా నాపై తీర్చుకోండి. నిర్ణయం తీసుకున్నది నేను, కాబట్టి ఏ చర్యలైనా నాపైనే ఉండాలి. అనవసరంగా అధికారులను బలి చేయడం కరెక్ట్ కాదు," అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు ఫార్ములా ఈ నిధుల దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలను కేటీఆర్ కొట్టి పారేశారు. "ప్రభుత్వం అందాల పోటీల కోసం రూ. 200 కోట్లు ఖర్చు చేసింది. దీని వల్ల రాష్ట్రానికి ఏం ప్రయోజనం చేకూరింది? ఒక మహిళా ప్రతినిధి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసినా ఎందుకు స్పందించడం లేదు?" అని ప్రశ్నించారు. న్యాయ పరంగా దీనిని ఎదుర్కొంటాం," అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# సిలిండర్లేవి?




- **గ్యాస్ కొరతపై బీఆర్ ఎస్ నిరసన**
- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అస్పష్ట వైఖరిపై కేటీఆర్ మండిపాటు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికా మధ్య అంతర్జాతీయంగా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ప్రజలు గ్యాస్ సిలిండర్ల కోసం అల్లాడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ అవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొరత లేదని నమ్మబలుకుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం సామాన్యులకు సిలిండర్లు దొరకడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల కొరతను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ మంగళవారం అసెంబ్లీ సమీపంలోని గన్‌పార్క్ వద్ద భారీ నిరసన చేపట్టింది. కేటీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ఎల్‌పీజీ కొరత లేదంటుందనీ రాష్ట్ర ప్రభుత్వం పెట్రోలియం శాఖ తమ చేతుల్లో లేదని తప్పించుకుంటుందని అన్నారు. వీరిద్దరి తీరు చూస్తుంటే ఆబోతుల కొట్లాటలో లేగ దూడలు బలైనట్లుగా సామాన్య ప్రజల పరిస్థితి తయారైందని విమర్శించారు. భవిష్యత్తులో గ్యాస్ సిలిండర్ పరిమాణాన్ని 14 కిలోల నుంచి 10 కిలోలకు తగ్గించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ఇది ప్రజలను మరింత ఇబ్బంది పెట్టడమేనని అన్నారు. గ్యాస్ సరఫరాపై ఉన్న అయోమయాన్ని తొలగించేలా ప్రభుత్వం తక్షణమే ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని గ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.



## డంపింగ్ యార్డ్‌తో నరకం

- **అక్కడి ఎమ్మెల్యేగా ఉన్నందుకు బాధపడుతున్న**
- **మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో**

మేడ్చల్ నియోజకవర్గంలోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డు పరిస్థితి ప్రస్తుతం అత్యంత అధ్వానంగా తయారైందని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నగరం నలుమూలల నుంచి వచ్చే చెత్త అంతా అక్కడికే చేరుతోందన్న ఆయన.. ఆ వాసన భరించలేక తాను అక్కడ ఉండలేకపోతున్నానని వ్యాఖ్యానించారు. మంగళవారం అసెంబ్లీలో ప్రజా సమస్యలపై జరిగిన చర్చలో మల్లారెడ్డి తనదైన శైలిలో ప్రసంగించి సభను ఆకట్టుకున్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ దుస్థితిని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. 'నేను ఎందుకు మేడ్చల్ ఎమ్మెల్యేగా ఉన్నానా అని బాధపడుతున్నాను' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. జవహర్‌నగర్ డంపింగ్ యార్డును 'స్పెషల్ కేటగిరి' కింద అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

**నియోజకవర్గం ముక్కలు ముక్కలు..**

దేశంలోనే నెంబర్ వన్ నియోజకవర్గమైన మేడ్చల్‌ను ముక్కలు ముక్కలు చేశారని మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 61 గ్రామాలు, 3 కార్పొరేషన్లు, 7 మున్సిపాలిటీలు ఉండేవని, వాటన్నింటినీ జీహెచ్ఎంసీలో కలిపేసి కేవలం 16 వార్డులుగా మార్చారని తెలిపారు. దీంతో నియోజకవర్గంలో డ్రైనేజీలు, రోడ్లు, కరెంట్ పోల్స్ వంటి కనీస సౌకర్యాలు కరువయ్యాయని, కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ పెంకుటిళ్లే ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబును ఉద్దేశించి మాట్లాడుతూ.. 'శ్రీధరన్న.. జర నన్ను పగబట్టకే.. మా జిల్లా ఇంచార్జ్ మంత్రివి నువ్వే' అని విన్నవించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని, మేడ్చల్ నియోజకవర్గానికి జీహెచ్ఎంసీ నుంచి ప్రత్యేక నిధులు కేటాయించాలని మల్లారెడ్డి విజ్ఞప్తి చేశారు.



# దివ్యాంగులకు అండగా బీజేపీ పోరుబాట

- **ఛలో అసెంబ్లీని అడ్డుకున్న పోలీసులు**
- **బషీర్‌బాగ్ వద్ద ఉద్రిక్తత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో ;**

రాష్ట్రంలో దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోరుతూ మంగళవారం బీజేపీ హైదరాబాద్ లో చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ఈ క్రమంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన బీజేపీ నాయకులు... పార్టీ శ్రేణులు దివ్యాంగులతో కలిసి బయలుదేరారు. ఈ క్రమంలో బషీర్ బాగ్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో దివ్యాంగులు ఈ నిరసనలో పాల్గొన్నారు. బషీర్‌బాగ్ ఫ్లైఓవర్ నుంచి అసెంబ్లీ వైపు కాలినడకన బయలుదేరారు. ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన పెన్షన్ పెంపు, ఇతర సంక్షేమ పథకాల హామీలను ప్రభుత్వం విస్మరించిందని పాయల్ శంకర్ ధ్వజమెత్తారు. తక్షణమే అర్హులైన వారందరికీ పెంచిన పెన్షన్లు అందజేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ పరిసరాల్లో భారీగా మోహరించిన పోలీసులు నిరసన కారులను బషీర్‌బాగ్ వద్దే అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. నిరసన కారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు. దివ్యాంగుల హక్కుల కోసం తమ పోరాటం ఆగదని, ప్రభుత్వం దిగివచ్చే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని పాయల్ శంకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# అర్హులైన జర్నలిస్టులకు కార్డులు

- **సమగ్ర పరిశీలన తర్వాతే దరఖాస్తుల ఆమోదం**
- **మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా కార్డుల జారీ**
- **ఏప్రిల్ మొదటి వారంలో మళ్లీ సమావేశం**
- **జిల్లాల ప్రతిపాదనలకు ఆమోదం..**
- **ప్రక్రియ వేగవంతానికి సూచనలు**
- **హైదరాబాద్‌లో రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో ప్రెస్ అకాడమీ, ఎస్ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి**



**ముద్ర, హైదరాబాద్ :**

అర్హులైన ప్రతీ జర్నలిస్టులకు కార్డులు అందజేస్తామని ప్రెస్ అకాడమీ, ఎస్ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ బోర్డు రూమ్‌లో మంగళవారం రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఏసీ - స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ) సమావేశం జరిగింది. ప్రెస్ అకాడమీ, ఎస్ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార-పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఎస్ఎంఏసీ కోచైర్‌పర్సన్ సీహెచ్ ప్రియాంకతో కలిసి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. జర్నలిస్టుల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు కార్డు మంజూరులో ఎలాంటి లోపం ఉండదని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని వచ్చే నెల మొదటివారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు పంపే 'జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)' ప్రతిపాదనలను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతుందని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. సమావేశంలో సమాచార-పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ పాటు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# ఊరు మొత్తం ఖాళీ

- **మూడు నెలల్లో 28 మంది**
- **మృత్యువు నీడలో ఒక గ్రామం గంద్రపల్లి**

**ముద్ర, కరీంనగర్ :**

ఒక్క మరణం సంభవిస్తేనే ఆ వీధి అంతా మూగబోతుంది.. అలాంటిది, కేవలం 90 రోజుల్లో 28 మంది చనిపోతే.. ఆ ఊరి గుండె ఎంతలా తల్లడిల్లిపోతుందో ఊహించడం కూడా కష్టమే. జమ్మికుంట మండలంలోని గంద్రపల్లి ఇప్పుడు సరిగ్గా ఇలాంటి వేదననే అనుభవిస్తోంది. సినిమాలో చూసే 'విరూపాక్ష' భయం నిజ జీవితంలో ఆ ఊరిని చుట్టుముట్టింది. వరుసగా పాడెలు కదుతుంటే, తలకొరివి పెట్టే చేతులు వణుకుతుంటే.. ఆ గ్రామస్తుల కళ్లలో భయం కంటే ఎక్కువగా 'మా ఊరికి ఏమైంది?' అన్న ఆర్తి కనిపిస్తోంది. కొందరు నిన్నటి వరకు ఆరోగ్యంగా ఉండి, తెల్లవారేసరికి విగతజీవులయ్యారు. మరికొందరు రోడ్డు ప్రమాదాల రూపంలో బలైపోయారు. మనసు విరిగి మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కారణం ఏదైనా, చితి మంటలు మాత్రం ఆ గ్రామంలో ఆరడం లేదు.

**నమ్మకానికి, భయానికి మధ్య..**

దైవ ప్రార్థనలు చేసినా, జంతు బలులు ఇచ్చినా మృత్యువు శాంతించకపోవడంతో.. ఆ ఊరి జనం ఒకే నిర్ణయానికి వచ్చారు. ఊరంతా ఒక్కటై, కన్నీళ్లతో తమ గడప దాటారు. "మా ఇళ్లు మాకు ప్రాణం.. కానీ మా మనుషులు మాకు అంతకంటే ముఖ్యం." అనే ఆవేదనతో ఆ గ్రామం మొత్తం ఒక్కరోజు నిర్జనమైపోయింది. తెల్లవారుజామునే ఇళ్లకు తాళాలు వేసి, మూటముల్లె సర్దుకుని అడవి బాట పట్టారు. ఊరంతా పొలాల్లోకి చేరి 'కీడు వంటలు' చేసుకున్నారు. పితృదేవతలను వేడుకుంటూ, తమ గ్రామాన్ని కాపాడమని ఆకాశం వైపు చూస్తూ మొరపెట్టుకున్నారు. ఈ 'కీడు వంటలు' పూర్తయ్యాకైనా తమ గ్రామంలో మళ్ళీ నవ్వులు పూస్తాయని ఆశగా ఎదురు చూస్తున్నారు.

# కన్నవారు భారం కాదు.. బాధ్యత

- **'తల్లిదండ్రుల మద్దతు బిల్లు'పై హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ హర్షం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన చారిత్రక తల్లిదండ్రుల మద్దతు బిల్లుపై హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ హర్షం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక చట్టం మాత్రమే కాదు.. బిడ్డల బాధ్యతను గుర్తు చేసే ఒక గొప్ప పాఠమని మంగళవారం ఎక్స్ వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు. అందులో సమాజంలో మృగ్యమవుతున్న మానవీయ విలువలు, వృద్ధాప్యంలో కన్నవారిని భారంగా భావిస్తున్న నేటి తరం పోకడలను గుర్తు చేశారు. తమ కడుపు కట్టుకొని పిల్లల ఎదుగుదలే శ్వాసగా బతికే తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని సజ్జనార్ పేర్కొన్నారు. చిన్నప్పుడు అడుగు తడబడితే చేయి అందించి నడిపించిన ఆ చేతులే, వయసు మళ్ళిన తర్వాత రోడ్డు పాలు కావడం సమాజానికి తీరని వేదన అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కన్నవారిని కళ్లల్లో పెట్టుకుని చూసుకోవాల్సిన బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన 'తల్లిదండ్రుల మద్దతు బిల్లు' చట్టం గుర్తుచేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**జీతంలో కోత.. బాధ్యతకు హెచ్చరిక!**

వృద్ధ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల జీతంలో కొంత భాగాన్ని నేరుగా తల్లిదండ్రులకు చెందేలా చట్టం తీసుకురావడం విప్లవాత్మకమైన నిర్ణయమని సజ్జనార్ ప్రశంసించారు. ఇది బాధ్యతను విస్మరిస్తున్న బిడ్డలకు ఒక గట్టి హెచ్చరిక అని, తల్లిదండ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడే భరోసా అని తన ట్వీట్‌లో పేర్కొన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు కోరుకునేది విలాసాలు కాదని, కేవలం బిడ్డల తోడు, ప్రేమ మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. ఆ తోడుని చట్టబద్ధం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ మానవీయ నిర్ణయం యావత్ దేశానికి స్ఫూర్తిదాయకమని, ప్రపంచానికే దిక్సూచి అని కొనియాడారు. "తల్లిదండ్రులను గౌరవిద్దాం.. వారి ఆశీస్సులే మనకు శ్రీరామరక్ష" అంటూ హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ తన సందేశాన్ని ముగించారు.




సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
25.03.2026 బుధవారం, హైదరాబాద్
4 వేదిక Peoples Voice

మీ 'ముద్ర' వేయండి
నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com


## ఇటుక బట్టీల్లో మగ్గిపోతున్న బాల్యం

(25 మార్చి "అంతర్జాతీయ ట్రాన్స్-అట్లాంటిక్ బానిస వ్యాపార బాధితుల జ్ఞాపకార్థ దినం" సందర్భంగా)

ప్రపంచ చరిత్రలో 16 18వ శతాబ్ద కాలంలో ఆఫ్రికా నుంచి సెంట్రల్/మిడిల్ అమెరికాకు బలవంతంగా అమాయక ఆఫ్రికన్లను తరలించి బానిసలుగా సంకెళ్లు వేసి, వెట్టి చాకిరీ చేయించిన దుర్మార్గపు ఉదంతాలు అనేకం ఉన్నాయి. ఈ దుర్ఘటన "ట్రాన్స్‌అట్లాంటిక్ బానిసత్వ వ్యాపారం"గా చరిత్ర పుటల్లోకి చేరింది. ఈ విషాదకర ఘటన ప్రభావం నేటికీ ఆఫ్రికన్ల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. యూఎస్‌లో 01 ఫిబ్రవరి 1865న బానిసత్వాన్ని నిషేధించడం జరిగినప్పటికీ జాతి వివక్ష, బానిస బతుకుల ప్రభావం నేటికీ ఆఫ్రికన్ సమాజంపై పడుతూనే ఉంది. 2007లో ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 25 మార్చిన "అంతర్జాతీయ ట్రాన్స్‌అట్లాంటిక్ బానిస వ్యాపార బాధితుల జ్ఞాపకార్థ దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. అమానవీయ బానిసత్వం నేరమని, మానవ హక్కుల ఉల్లంఘనలు ఆక్షేపణీయం అని, జాతి వర్ణ వర్గ వివక్ష దురాచారమని, మనిషిని మనిషిగా చూడడం మన కనీస బాధ్యత అని అవగాహన కల్పించడం జరుగుతోంది. అగ్రదేశాల హోటల్స్, రెస్టారెంట్లు, సెలూన్లు, వ్యవసాయ పనులు, సంగీత కార్యక్రమాల్లో బానిసత్వ దురాచారం నేటికీ కొనసాగుతున్నది.



**భారతంలో బానిసత్వ దురాచారం:** ప్రపంచంలోనే అత్యధికంగా 39 శాతం ఆధునిక బానిసలు భారత్‌లోనే ఉన్నారని తెలుస్తోంది. ముస్లిమ్ పాలనలో బానిసత్వం పెరగడం, నేటి డిజిటల్ వెలుగుల్లో కూడా బానిసత్వ చీకట్లు కమ్ముడం సోచనీయం. 1843లో భారత్ బానిసత్వ చట్టం అమలులోకి రావడం జరిగినా దాని ప్రభావం అంతగా పౌర సమాజంపై పడకపోవడం దురదృష్టకరం. 2018 నివేదిక వివరాల ఆధారంగా ప్రపంచంలో 46 మిలియన్ల బానిసలు ఉండగా, అందులో 8 మిలియన్లు భారత్‌లోనే ఉండడం విచారకరం. వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణా, బలవంతపు భిక్షాటన, బాల్య వివాహాలు, బలవంతపు పడుపు వృత్తి, బాల కార్మిక వ్యవస్థ లాంటివి నేటికీ మన సమాజంలో కనిపించడం బాధాకరం. ఇండియాలో ప్రతి వెయ్యి మందిలో ఆరుగురు బానిస చీకటి బతుకులు బతుకుతున్నట్లు తేలింది. ఇటుక బట్టీలు, చిరు పరి శ్రమలు, వ్యవసాయం, అసంఘటిత రంగాలు, గృహ సంబంధిత పనులు, బాల్య బానిసత్వ దురాచారాల్లో ఆధునిక బానిసత్వ కదలికలు కనిపిస్తున్నాయి. ఆధునిక బానిసత్వానికి అడ్డుకట్ట వేయడానికి కఠినంగా చట్టాల అమలు, ప్రజల్లో చైతన్యం, బడాబాబుల ఆలోచనల్లో మార్పు రావలసి ఉన్నది. ప్రజల ఆకలిని ఆసరాగా తీసుకొని అమానవీయ బానిసత్వ బంధీఖానాలో కట్టిపడేయడం మూర్ఖత్వం, నేర సమానం. అందరం చేయి చేయి కలిపి మానవ హారం పట్టి బానిసత్వ కోరల్లో చిక్కి విలవిల్లాడుతున్న అమాయక జీవులకు స్వేచ్ఛను కల్పించి బానిసలు కానరాని ప్రపంచాన్ని నిర్మించుకుందాం, అందరి ముఖాల్లో ఆనంద హరివిల్లులు వికసింపజేద్దాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

9949700037

## ఇరాన్ సైనిక వ్యూహాన్ని అమెరికా తక్కువ అంచనా వేసిందా?



ఇరాన్‌పై అమెరికా తీసుకున్న తాజా సైనికరాజకీయ చర్యలు, వాటి తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు ప్రపంచ రాజకీయాల్లో ఒక కీలక మలుపును సూచిస్తున్నాయి. ప్రారంభ దశలో ఈ ఘర్షణను "త్వరగా ముగిసే పరిమిత యుద్ధం"గా భావించిన అమెరికా వ్యూహకర్తలు, ఇప్పుడు దీర్ఘకాలిక సంఘర్షణ, గ్లోబల్ ఆర్థిక ప్రభావాలు, మిత్ర దేశాలపై ఒత్తిడి వంటి అనేక సంక్లిష్టతలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో "అమెరికా ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిందా?" అనే ప్రశ్నకు సమాధానం కోసం పూర్వాపరాలు, వ్యూహపరమైన అంచనాలు, ప్రస్తుత పరిస్థితులు అన్నీ విశ్లేషణకు వస్తాయి.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన విధానం "శక్తి ప్రదర్శన ద్వారా వేగవంతమైన ఫలితం" అనే సిద్ధాంతంపై ఆధారపడి ఉంది. 2025లో ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు, 2026లో వ్యూహాత్మక మౌలిక వసతులపై లక్ష్యబద్ధ దాడులు, మరియు "మ్యాక్సిమమ్ ప్రెషర్" విధానం— కలిసి ఇరాన్‌ను బలహీన పరచి త్వరగా వెనక్కి తగ్గిస్తుందని అమెరికా భావించింది. ట్రంప్ పలు సందర్భాల్లో ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని "తగ్గించాం, దాదాపు నిర్వీర్యం చేశాం" అని ప్రకటించడం కూడా ఈ అంచనాలకే సంకేతం.

కానీ వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ఇరాన్ ప్రత్యక్ష యుద్ధానికి మాత్రమే కాకుండా అసమాన యుద్ధ వ్యూహాలకు ప్రసిద్ధి. హోర్ముజ్ జలసంధిని మూసివేయడం, గల్ఫ్ దేశాలపై పరోక్ష దాడులు, మిత్ర దేశాల ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకోవడం వంటి చర్యల ద్వారా అది ప్రతిస్పందించింది. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు 20% ఈ మార్గం ద్వారా జరుగుతుండటంతో, ఈ మార్గం మూసివేత ప్రపంచ మార్కెట్లను కుదిపేసింది

అమెరికా మొదట భావించిన కీలక అంచనా— ఇరాన్ నాయకత్వంపై దాడి చేస్తే దేశం వెనక్కి తగ్గుతుందన్నది. కానీ ఇరాన్ రాజకీయ వ్యవస్థ వ్యక్తి ఆధారితమైనది కాదు; అది సిద్ధాంత ఆధారిత వ్యవస్థ. ఖమేని వంటి నాయకుడిని లేదా సైనిక నాయకులను లక్ష్యంగా చేసుకున్నా, వ్యవస్థ కొనసాగుతుంది. అంతేకాక, ఇరాన్‌లో "బాహ్య శత్రువు" భావన ప్రజలను ఒకే జెండా కింద చేర్చే సామర్థ్యం కలిగి ఉంది. అందువల్ల నాయకత్వంపై దాడులు దేశాన్ని బలహీన పరచడంలో కంటే ప్రతిఘటనను పెంచే అవకాశమే ఎక్కువ.

అమెరికా మరో పెద్ద పొరపాటు—ఈ ఘర్షణ కాల వ్యవధిపై చేసిన అంచనా. ప్రారంభంలో ఇది కొన్ని రోజులు లేదా వారాల్లో ముగిసే ఘర్షణగా భావించ బడింది. కానీ ఇది నాలుగు వారాలకు పైగా కొనసాగుతూ, మరింత తీవ్రతరమవుతోంది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, "త్వరగా ముగుస్తుంది" అన్న భావన ఇప్పుడు పూర్తిగా చెదిరిపోయింది. దీర్ఘకాలిక యుద్ధం వైపు పరిస్థితి మళ్లింది.

చమురు ధరల విషయంలో కూడా అమెరికా అంచనాలు తప్పి పోయాయి. యుద్ధం ప్రారంభానికి ముందు బ్యారెల్‌కు సుమారు \$70 ఉన్న చమురు ధరలు, ఇప్పుడు \$100-\$113 స్థాయికి చేరుకున్నాయి. ఇది కేవలం ఇంధన రంగానికే పరిమితం కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం, ఉత్పత్తి ఖర్చులు, రవాణా ఖర్చులు పెరగడానికి దారితీసింది. ఈ సంక్షోభం 1970ల ఎనర్జీ షాక్‌లను తలపించే స్థాయికి చేరే ప్రమాదం ఉంది.

అమెరికా వ్యూహకర్తలు దీర్ఘకాలంలో చమురు ధరలు తగ్గుతాయని కూడా భావించారు. ఇరాన్ ప్రభావాన్ని తగ్గిస్తే "టెరర్ ప్రీమియం" తగ్గి ధరలు పడిపోతాయని వాదనలు వినిపించాయి. కానీ తక్షణ ప్రభావం పూర్తిగా వ్యతిరేకంగా వచ్చింది—మార్కెట్లలో అనిశ్చితి పెరిగి ధరలు మరింత పెరిగాయి.

మిత్ర దేశాల అంశంలో కూడా అమెరికా వ్యూహం చిక్కుల్లో పడింది. యూరప్ వంటి దేశాలు ఇంధన దిగుమతులపై ఎక్కువగా ఆధార పడటంతో, ఈ సంక్షోభం వారికి తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని తెచ్చింది. గ్యాస్ ధరలు రెట్టింపు కావడం, పరిశ్రమలపై ప్రభావం, వ్యవసాయ రంగంలో ఇన్‌పుట్ ఖర్చుల పెరుగుదల—కలిసి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి.

అమెరికా మిత్ర దేశాలకు మరో సమస్య భద్రతా పరమైనది. ఇరాన్ స్పష్టంగా హెచ్చరించింది—అమెరికా మద్దతు ఇచ్చే దేశాలపై కూడా దాడులు చేస్తామని. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు, ఆయిల్ సదుపాయాలు లక్ష్యంగా మారే అవకాశం ఉంది. దీని వల్ల మిత్ర దేశాలు "అమెరికా నిర్ణయాల భారం" మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇక ఆర్థికంగా కూడా అమెరికా తానే ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పెట్రోల్ ధరలు పెరగడం, స్టాక్ మార్కెట్లలో అనిశ్చితి, వడ్డీ రేట్లపై ఒత్తిడి— కలిసి దేశీయ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. అంతేకాక, దీర్ఘకాల యుద్ధం జరిగితే అమెరికా సైనిక ఖర్చులు కూడా పెరిగే అవకాశం ఉంది.

ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిన అంశం ఇక్కడ స్పష్టమవుతుంది. ఇరాన్ కేవలం ఒక దేశం మాత్రమే కాదు; అది ఒక ప్రాంతీయ ప్రభావ వ్యవస్థ. హిజ్బుల్లా, హూతీలు, షియా మిలీషియాలు వంటి మిత్ర బలగాల ద్వారా పరోక్ష యుద్ధాన్ని కొనసాగించే సామర్థ్యం ఉంది. ఈ "మల్టీలేయర్డ్ వార్ స్ట్రాటజీ"ను అమెరికా పూర్తిగా అంచనా వేయలేక పోయింది.

ట్రంప్ ప్రభుత్వం మూడు ప్రధాన అంచనాల్లో పొరపాటు చేసింది. మొదటిది—త్వరగా ముగిసే యుద్ధం అనే అంచనా. రెండవది—నాయకత్వంపై దాడి చేస్తే ఇరాన్ వెనక్కి తగ్గుతుందనే భావన. మూడవది—చమురు ధరలు మరియు గ్లోబల్ మార్కెట్లపై ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయడం.

ప్రస్తుత పరిస్థితి చూస్తే, ఇది పరిమిత యుద్ధం నుండి విస్తృత ప్రాంతీయ ఘర్షణగా మారే ప్రమాదం కనిపిస్తోంది. హోర్ముజ్ జలసంధి సమస్య పరిష్కారం కాకపోతే, చమురు సరఫరా మరింత క్షీణించి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశముంది.

అందువల్ల "అమెరికా ఇరాన్‌ను తక్కువ అంచనా వేసిందా?" అనే ప్రశ్నకు సమాధానం—అవును, వ్యూహాత్మకంగా కొన్ని కీలక అంశాల్లో తక్కువ అంచనా వేసింది అని చెప్పాలి. అయితే ఈ ఘర్షణ ఇంకా ముగియలేదు; తదుపరి పరిణామాలు అమెరికా వ్యూహం ఎంతవరకు మారుతుందో, ప్రపంచ శక్తి సమీకరణాలు ఎలా మారుతాయో నిర్ణయిస్తాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

## కాంగ్రెస్‌లో అంతర్గత సంక్షోభానికి సంకేతం





తెలంగాణ రాజకీయాల్లో కరీంనగర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాడిపర్తి జీవన్ రెడ్డి పార్టీని వీడే అవకాశాలపై చర్చలు ఊపందుకున్నాయి. నాలుగు దశాబ్దాలుగా పార్టీతో ఉన్న ఆయన ఈ నిర్ణయం వెనుక అంతర్గత రాజకీయాలు, వర్గపోరాటాలు, కొత్త నాయకత్వ ప్రాధాన్యం కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగిన జీవన్ రెడ్డి, కష్టకాలంలో కూడా కాంగ్రెస్‌కు అండగా నిలిచారు. కానీ ఇటీవలి కాలంలో తనకు తగిన గుర్తింపు లభించలేదని, స్థానిక నిర్ణయాల్లో తనను పక్కన పెట్టారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఈ నేపథ్యంలో మంత్రులు శ్రీధర్ బాబు, లక్ష్మణ్ కుమార్ తదితరులు ఆయనతో చర్చలు జరిపినా ఫలితం రాలేదని తెలుస్తోంది. సీనియర్ నేతలను నిర్లక్ష్యం చేయడం పార్టీకి ప్రతికూల ప్రభావం చూపొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

ఇప్పుడాయన భవిష్యత్ అడుగుపై ఉత్కంఠ నెలకొంది. భారాస లేదా భాజపాలో చేరే అవకాశాలు ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఆయన నిర్ణయం కేవలం వ్యక్తిగతం కాకుండా, కాంగ్రెస్ అంతర్గత పరిస్థితుల ప్రతిబింబంగా భావిస్తున్నారు.

మొత్తం మీద ఈ పరిణామం పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యం, సమతుల్యతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. జీవన్ రెడ్డి నిర్ణయం తెలంగాణ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశముంది.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

## సురవరం సేవలు చిరస్మరణీయం....

*నేడు మార్చి 25 న వారి 84 వ జయంతి సందర్భంగా బషీర్బాగ ప్రెస్ క్లబ్ లో "ప్రజలతో తోనా ప్రయాణం'సురవరం పుస్తకవిష్కర్ణ సందర్భంగా..



సిపిఐ జాతీయ నాయకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి గారు మన నుండి దూరమై నేటికీ సంవత్సరం కావస్తుంది.నేడు మార్చి 25 న వారి 84 వ జయంతి సందర్భంగా వరికి ఘనంగా శ్రాంద్ధాంజలి ఘటిద్దాం. ఈ సందర్భంగా సురవరం గారు చెసిన ప్రజా సమాజిక సేవలను స్మరించుకుందాం.. వారు చేపట్టిన ఉద్యమాల కార్యాచరణ, నిర్వహించిన పోరాటాలు నేటి యువతకు స్పూర్తిదాయకం.

సుధాకర్ రెడ్డి గొప్ప స్వాతంత్ర సమరయోధుల కుటుంబంలో జన్మించినారు. వారి తండ్రి సురవరం వెంకటరామిరెడ్డి గారు దేశ స్వాతంత్ర పోరాటంలోనూ నైజాం రాచరిక వ్యవస్థకు వ్యతిరేక సాయిధ పోరాటంలోనూ పాలుగోన్నారు.వారి తండ్రి ఉద్యమ వారసత్వంతో విద్యార్థి దశలోనే వామపక్ష ఉద్యమాలకు ఆకర్షితులై.. మన దేశ వామ పక్ష ఉద్యమంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. జాతీయస్థాయిలో 197280 మధ్యకాలంలో ఎఐఎస్ఎఫ్ కు, ఎఐవైఎఫ్ కు జాతీయ స్థాయిలో అధ్యక్షులుగా బాధ్యతలలో ఉంటూ 40 దేశాలలో పర్యటించారు. దేశవ్యాపితంగా అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. అందులో 1973 లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరుతు 'తిండైనా పెట్టండి.. జైల్లోనైనా ఉంచండి' కార్యక్రమంలో వేలాది మందిని యువకులను సమీకరించి పార్లమెంటుకు యాత్ర నిర్వహించారు.197475 లో యువజనులకు 18 సంవత్సరాలకే ఓటింగ్ రైట్ కల్పించాలని 'వోటింగ్ రైట్ ఏట్ ఏజ్ అఫ్ ఎయిటీన్', దేశవ్యాపిత ఉద్యమానికి ఆనాటి వై ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సి కే చంద్రప్పన్ తో కలిసి దేశవ్యాపీతంగా ఉద్యమించారు. అనేక ఉద్యమాలలో వివిధ రాష్ట్రలలో పాల్గొని అరెస్ట్ కావటమే కాకుండా వివిధ రాష్ట్రాల జైల్లాలో జైలు జీవితాన్ని కూడా అనుభవించారు.అనేక అంశాలపై 'సామ్రాజ్యవాదముయుద్ధోన్మాదం',' పెట్టుబడిదారీ విధానం పెరుగుతున్న నిరుద్యోగిత అసమానతలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై అనేక వ్యాసాలతో పాటు అనేక అంశాలపై ప్రసంగించారు.

వారికీ నల్గొండ జిల్లా ఉద్యమాలతో అనేక అనుబంధం ఉన్నది.

1998,2004 లో రెండు దఫాలు నల్లగొండ పార్లమెంట్ నుండి ఎన్నికై పార్లమెంటులోనూ.. దేశంలో పలు ప్రాంతాలలోవివిధ అంశాలపై ప్రసంగించారు. చివరగా 2005లో ఇండియన్ పార్లమెంట్ సభ్యుల డెలిగేషన్కు నాయకత్వం వహించి ఐక్యరాజ్యసమితి వేదికపై ప్రసంగించారు.

* ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కొల్లాపూర్ ప్రాంతంలోని కొండ్రామ పల్లిలో1942, మార్చి 25 తేదీన జన్మించిన సురవరం బాల్యం నుంచే ఉద్యమ భావాలను అందిపుచ్చుకున్నారు. తండ్రి వారసత్వంతో హై స్కూల్ విద్యార్థి దశ నుండే ప్రారంభించిన ఉద్యమ ప్రస్థానం చివరి శ్వాస వరకు కొనసాగింది. ఇది వారి ఉద్యమ జీవితానికి లభించిన అరుదైన గౌరవం.

* విద్యార్థి దశనుండే ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రజా ఉద్యమాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వామి అయ్యారు. తెలంగాణ సాయుధ పోరాటం సమయములో పసివాడుగా ఉన్నప్పటికీ ఆ ఛాయలు ఆయన మనసులో ముద్ర వేసుకున్నాయి. హైస్కూలు కాలేజీ విద్యార్థిగా కాలేజీలలో డొనేషన్స్ పై, అధిక ఫీజులపై, పేద విద్యార్థులకు సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ వసతి కొరకు,వారికి స్కాలర్షిప్స్ కొరకు విద్యార్థులను సమీకరించి ఉద్యమాలము నడిపించాడు. ఉస్మానియాలో న్యాయ శాస్త్ర విద్యను నభ్యసిస్తూనే ఆనాటి విద్యార్థి యువజన సమస్యల పైన వాటి పరిష్కారం కొరకు వెనుకడుగు వేయకుండా, పెదారిలోకి వెళ్లకుండా ఒక ఆదర్శవంతమైన కమ్యూనిస్టుగా ఆనాటి రాజకీయ, ఆర్థిక, సామాజిక విషయాల్లో ఎప్పటికప్పుడు తన అభిప్రాయాలు చాలా శక్తివంతంగా వెల్లడిస్తూ.. ముఖ్యంగా రాజకీయ పార్టీల స్వభావాన్ని నిర్మొహటంగా విమర్శించే వారు. కాలేజీ విద్యార్థుల డిబేట్లో ఒకవైపు భారతీయ జనతా పార్టీ సైద్ధాంతిక తిరోగమన విధానాలను ఎండగడుతూనే, రెండోవైపు కాంగ్రెస్ చేసిన, చేస్తున్న తప్పులను కూడా అదే స్థాయిలో విమర్శిస్తూ కమ్యూనిస్టు సోషలిస్టు శాస్త్రీయ దృక్పథం గురించి వివరించేవారు.

సిపిఐ లో 1962 లో క్రియాశీల కార్యకర్తగా చేరిన సురవరం పార్టీలో అంచెలంచలుగా ఎదిగారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో విద్యార్థి యువజనోద్యమాలలో ప్రధాన బాధ్యతలో ఉంటూ సిపిఐ జాతీయ సమితి సభ్యులుగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, కార్యదర్శివర్గ సభ్యులుగా పనిచేస్తూ 1997 లో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగాను, 1999 నుండి 2005 వరకు కార్యదర్శిగా,ఆ తరువాత జాతీయ కార్యదర్శిగాను, 2009 లో జాతీయ సహాయ కార్యదర్శిగా, 2013 నుండి 2019 వరకు ప్రధాన కార్యదర్శిగా ఏన్నికై బాధ్యతలు నిర్వహించుతు.. తన అనారోగ్యముతో ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుండి స్వచ్ఛందంగా తగ్గారు.

జాతీయ అంతర్జాతీయ రాజకీయ పరిణామాల పైన విశ్లేషిస్తూ.. పార్టీ నిర్మాణాన్ని పటిష్టపరుచుకుంటూ.. ప్రజా సమస్యల పైన ఉద్యమాలకు పదునుపెట్టాలని నిర్దేశించేవారు ..

*ఉజ్జిని రత్నాకర్ రావు
-949095264

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 25.03.2026
www.mudranews.in | @mudranews



## ఏడుకొండల మహత్యం



తిరుమల "ఏడు కొండల వాడు"గా ప్రసిద్ధి చెందింది. ఈ కొండలు ఆధ్యాత్మికంగా ఆదిశేషుని ఏడు తలలను సూచిస్తాయని నమ్మకం.

# సాగునీటి ప్రాజెక్టులను సందర్శించిన కలెక్టర్

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**

జిల్లాలోని పలు సాగునీటి ప్రాజెక్టులను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. మొదట ధరూర్ మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద కుడి, ఎడమ కాలువలను అలాగే సమాంతర కాలువను పరిశీలించారు. కృష్ణ బేసిన్ లో ఉన్న పలు ప్రాజెక్టులను గురించి మొదలుకొని జిల్లాలోని పలు రిజర్వాయర్ల నీటి సామర్థ్యం, ఎత్తిపోతల పథకాల కింద సాగు చేసే ఆయకట్టు వివరాలను కలెక్టర్ కు, అధికారులు వివరించారు. జూరాల ప్రాజెక్టుకు వర్షాకాలంలో వరద వచ్చినప్పుడు తీసుకునే జాగ్రత్తలు, జల విద్యుత్తు ఉత్పత్తి తదితర విషయాల గురించి తెలిపారు. దీని పరిధిలో చేపట్టిన ఎత్తిపోతల పథకాల గురించి, స్కాడో రూంలో ప్రాజెక్టు



గురించి మ్యాప్ ద్వారా వివరించారు. డ్యామ్ గేట్లు, ఇతర నిర్మాణాలను కలెక్టర్ సీసీ కెమెరాల ఫుటేజీలో పరిశీలించారు. అనంతరం గుడ్డెందొడ్డి పంపు హౌస్ కు వెళ్లే గ్రావిటీ కాలువను కలెక్టర్ పరిశీలించారు. అక్కడి నుంచి గుడ్డెందొడ్డి లిఫ్ట్ వన్ పంప్ హౌస్ దగ్గరికి వెళ్ళిన కలెక్టర్ ప్రాజెక్ట్ మోడల్ దయాగ్రమ్స్ ను, ఆపరేటింగ్ గదులను పరిశీలించారు. అక్కడ నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా తెలియజేశారు. అలాగే ర్యాలంపాడు రిజర్వాయర్ వద్దకు చేరుకున్న కలెక్టర్ కు 4 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించారని, సుమారు 1.33 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా నిర్మాణం చేపట్టడం జరిగిందని అధికారులు వివరించారు. రిజర్వాయర్ కింద భూములు కోల్పోయిన రైతులు, గ్రామస్తులకు కల్పించిన సౌకర్యాల గురించి కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. ఈ పర్యటనలో పీజేపీ ఎస్ఈ రహీముద్దీన్, ఈఈలు జుబేర్ అహ్మద్, శ్రీనివాసులు, పలువురు డీఈలు, ఇతర ఇరిగేషన్ అధికారులు, తదితరులున్నారు.

## జ్యోతిర్లింగ దర్శనం



**ముద్ర, తాండూర్:**

వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో ఆధ్యాత్మిక ఉత్సవం నెలకొంది. ది ఆర్ట్ ఆఫ్ లివింగ్' తాండూర్ పట్టణ టీం ఆధ్వర్యంలో 1000 సంవత్సరాల సోమనాథ్ జ్యోతిర్లింగాల దర్శనం పూజ సత్సంగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వినాయక కన్వెన్షన్ లో జరిగిన కార్యక్రమంలో తాండూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, ఆర్బిఎల్ ఎండి బు య్యని సరళ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సునీత సంపత్, విట్టల్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు, పట్టణ పుర ప్రముఖులు, తదితరులు హాజరై సోమనాథ్ జ్యోతిర్లింగాలను దర్శించుకున్నారు.

## ఆకట్టుకున్న మాక్ అసెంబ్లీ



**ముద్ర, గద్వాల:**

అసెంబ్లీలో మంత్రులు, ప్రతిపక్ష నేతల మధ్య ప్రజా సమస్యలపై వాదోపవాదాలు జోరుగా సాగుతుంటాయి. శాసనసభ కార్యకలాపాలను విద్యార్థులకు మరింత అవగతం చేసేందుకు గద్వాలలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో విద్యార్థినీలకు మాక్ అసెంబ్లీ సెషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీలు అసెంబ్లీ సెషన్ లో రూలింగ్ పార్టీ, అపోజిషన్ పార్టీ సభ్యులుగా పాల్గొని సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం, ప్రభుత్వ సమాధానాలు చెప్పడం వంటి వంటి వాటిని అనుసరించడం జరిగింది. ప్రజా సమస్యలపై చర్చలు, సంక్షేమ బిల్లుల ప్రవేశపెట్టడం వంటి అంశాలను సమర్థంగా ప్రదర్శించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.మీనాక్షి మాట్లాడుతూభవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించే స్థాయికి ఎదగాలని విద్యార్థులను ఆశీర్వదించారు. చదువుతో పాటు రాజకీయాలపై.. అసెంబ్లీ సమావేశాలపై కూడా అవగాహన కల్పించిన మాక్ అసెంబ్లీ నిర్వహణను ఆమె ప్రశంసించారు.

## ఇంటి పన్ను చెల్లించండి



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:**

ఇంటి పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 31తో ఆర్థికసంవత్సరం ముగియనున్న నేప థ్యంలో ఇంకా ఇంటి పన్ను చెల్లించని వారు వెంటనే చెల్లించాలని సూచిం చారు. నాగర్ కర్నూల్ మున్సిపల్ పరిధిలో మొత్తం 11 వేల నివాస గృహాలు ఉండగా, ఇప్పటివరకు 57 శాతం ఇంటి పన్ను వసూలు చేసినట్లు తెలిపారు. మొత్తం రూ.7 కోట్ల లక్ష్యానికి గాను రూ.4 కోట్ల వరకు వసూలు చేయగా, ఇంకా రూ.3 కోట్ల బకాయిలు ఉన్నా యని వెల్లడించారు.గతంలో 66 శాతం వసూళ్లు సాధించినట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 24 వార్డుల్లో చెత్త సేకరణ, డ్రైనేజీ సమస్యలు సహా ఏ సమస్యలైనా ఉంటే వెంటనే స్పందించి పరిష్కరిస్తామని తెలిపారు సమావేశం లో మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, కమిషనర్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా స్కూల్ పనులు పూర్తిచేయాలి

**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**
**ముద్ర, నాగర్ కర్నూల్:**



జిల్లా పరిధిలోని తూడుకుర్తి గ్రామంలో నిర్మాణంలో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం జూన్ నాటికి అకాడమిక్ కార్యక్రమాలు ప్రారంభమయ్యేలా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణంలో సైతం నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

**అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తి గ్రామ అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న గుడ్లు, బాలామృతం, ఇతర పౌష్టికాహార సామగ్రిని పరిశీలించారు. కాలం చెల్లిన వస్తువుల తేదీలను స్వయంగా చెక్ చేసి, గడువు ముగిసేలోపు వినియోగించుకోవాలని సిబ్బందికి సూచించారు. గుడ్లను స్వయంగా తూకం వేసి, తూకం తక్కువగా ఉన్న గుడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించవద్దని స్పష్టంగా ఆదేశించారు. పిల్లల కోసం ఉన్న ఆట వస్తువులను కూడా పరిశీలించారు. చిన్నారులు చదివి వినిపించిన పద్యాలు, పాటలను కలెక్టర్ ఆసక్తిగా విన్నారు.

**టీపీఎస్ ఏర్పాటు చేయాలని వినతి**

జిల్లా కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని వీవీ – రీసెర్చ్ ఎడ్యుకేషన్ రూపకర్త బసవోజు దేవేంద్రాచారి, కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. బస్టాండ్‌కు సమీపంలో చౌరస్తాలో గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని అనుకూలంగా సూచించారు. ఒకే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, ఇంటర్ కళాశాల, హాస్టల్ వసతులు ఉండటం వల్ల అన్ని అవసరాలను ఒకేచోట ఏర్పాటు చేసేందుకు ఇది సరైన ప్రదేశమని తెలిపారు. అలాగే మూడు దిక్కుల రహదారులతో మెయిన్ రోడ్ పక్కన ఉన్న గవర్నమెంట్ ఉన్నత పాఠశాల, అదే ప్రాంగణంలోని ఇంటర్ కళాశాల ప్రదేశాన్ని కూడా పరిశీలించాలని కోరారు.

## సీజ్ చేసిన భవనంలో కొనసాగుతున్న పనులు

**పనిముట్లను స్వాధీనం**
**ముద్ర, శేరిలింగంపల్లి:**

మాదాపూర్ ఇజ్జత్ నగర్ లో సీజ్ చేసిన భవన అక్రమ నిర్మాణంలో మరల పనులు కొనసాగుతుండగా మున్సిపల్ అధికారులు మంగళవారం సమాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కూకట్ పల్లి ఏసీపీ సురేందర్ రెడ్డి తన బృందంతో పనులు కొనసాగుతున్న భవనంపై దాడి చేసి కార్మికుల వద్ద నుండి పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. పనులను వెంటనే నిలిపివేయించారు. కూలీలు చేసే పనులకు సంబంధించిన సమాగ్రితో పాటు మోటార్లను స్వాధీనం చేసుకుని మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. తక్షణమే మరో నోటీసు జారీ చేస్తామని, ఇలాగే పనులు కొనసాగిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. భవన యజమానిపై కఠిన చర్యలకు సిఫారసు చేస్తామని ఏసీపీ 'ముద్ర' కు తెలిపారు. 20 రోజుల క్రితం సీజ్ చేశారు. ఆక్రమణ దారులు భవనం చుట్టూ గ్రీన్ కలర్ పరదా చుట్టి లోపల పనులు కొనసాగిస్తున్నారు. విషయాన్ని గమనించిన స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తక్షణమే



స్పందించిన అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. నెల రోజుల క్రితం ఈ అక్రమ కట్టడంపై 'ముద్ర' వరుస కథనాలు ప్రచురించింది 'హైటెక్ సిటీలో హైటెక్ ఆక్రమణ', 'అసలు వదిలి కొసరు కొట్టారు', 'ఏడంతస్థుల భవనం సీజ్' అని ప్రధానంగా ప్రచురిమయ్యాయి. స్థానికులు ఇప్పటికే హైడ్రాకు సైతం ఫిర్యాదు చేశారు. ఆక్రమణ దారులు కొన్ని రోజులుగా వచ్చిన వరుస సెలవుల దృష్ట్యా ప్రభుత్వ అధికారులను ఏమార్చి మరల పనులు ప్రారంభించారు. సీజ్ చేసిన భవనంలో మరల పనులు ప్రారంభించినట్టు తెలిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

## లోక్ అదాలత్ గొప్పఅవకాశం

**జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు**
**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:**



28న నిర్వహించనున్న ఈ లోక్ అదాలత్ ప్రజలకు ఒక గొప్ప అవకాశం అని ఎస్పీ టి. శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, కోర్టుల్లో పెండింగ్ లో ఉన్న వివిధ కేసులను పరస్పర రాజీ ద్వారా తక్కువ సమయంలో పరిష్కరించుకునే వీలు ఈ వేదిక ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు.లోక్ అదాలత్ ద్వారా చిన్న చిన్న వివాదాలు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు, కుటుంబ సమస్యలు వంటి అనేక అంశాలను సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కోర్టు చుట్టూ తిరిగే ఇబ్బందులు తగ్గి, సమ యం మరియు వ్యయం రెండూ ఆదా అవుతాయని వివరించారు. అదేవిధం గా శాంతియుత, రాజీ విధానంలో జరిగే పరిష్కార ప్రక్రియ కావడంతో ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలను స్నేహపూర్వకంగా పరిష్క రించుకునే అవకాశం ఉంటుం దని తెలిపారు. ఈ విధానం ద్వారా కోర్టు కేసులు త్వరగా ముగిసి, ప్రజల్లో పరస్పర సౌహార్ద వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. కోర్టుల్లో పెండింగ్ లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించుకునేం దుకు ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేస్తూ, జిల్లా ప్రజలు జాతీయ లోక్ అదాలత్ లో పాల్గొని తమ సమస్యలకు శాంతియుత పరిష్కారం పొందాలని పిలుపునిచ్చారు.

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై ప్రత్యేక దృష్టి

**కలెక్టర్ నారాయణరెడ్డి**
**ముద్ర, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా చేపట్టాలని అధికారుల ను కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 10 ఎజెండాలతో చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులపై ప్రత్యేక దృష్టి సారిం చాలని, మున్సిపాలిటీల, గ్రామ పంచాయ తీల వారీగా పారిశుధ్యం పనులు, విద్యుత్ భవనాల మరమ్మతులు, పెయింటింగ్ వంటి పనులు పూర్తి చేయాలని సూచించారు. మంజూరైన పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల తోపాటు వాటి పరిసరాలు కూడా పరిశుభ్రం గా ఉండేలా చూడాలని తెలిపారు. నిర్లక్ష్యం గా పని చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవ డం జరుగుతుందని హెచ్చరించారు. ప్రస్తుతం వేసవి కాలం అయినందున జిల్లాలో ఏ ఒక్క చోట కూడా త్రాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె.శ్రీనివాస్, డీఆర్ఓ సంగీతం, జడ్పీ సి ఈ ఓ కృష్ణారెడ్డి, డిపిఒ సురేశ్ మోహన్, సిపిఒ సౌమ్య, పిడి డీఆర్డీఏ శ్రీలత, ఏవో ఉషా, పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత, పౌరసరఫరాల శాఖ మేనేజర్ హరీష్, మిషన్ భగీరథ, ఆర్ అండ్ బి, సంక్షేమ శాఖ అధికారులు ఆర్డీఓలు, అధికారులు తత పాల్గొన్నారు.

## అవగాహనతోనే క్షయ వ్యాధి నిర్మూలన

**ముద్ర, గద్వాల:**



క్షయ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే పూర్తిస్థాయిలో నిర్మూలించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం డీఎంహెచ్ఓ డాక్టర్ జె.సంధ్య కిరణ్మయి ఆధ్వర్యంలో టీబీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి.రాజు సమక్షంలో టీబీ ముక్త్ భారత్ అభియామ్ సెకండ్ ఫేస్ 2.0 కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు గద్వాలలోని ఎంసీహెచ్ సెంటర్లో ప్రారంభించారు. ముందుగా పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ జె.సంధ్య కిరణ్మయి డాక్టర్ అభినేష్, డాక్టర్ శరత్ , డాక్టర్ హర్ష, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, వైద్య సిబ్బంది కే.మధుసూదన్ రెడ్డి,వరలక్ష్మి,శ్యాంసుందర్, శివన్న ,అర్బన్ సూపర్వైజర్లు, టిబి ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాదిక్, గురు బసయ్య, విజయి, కిరన్, అనిల్, వెంకటేష్, ఏ.ఎన్.ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

### డిగ్రీ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్ :**

ప్రభుత్వ డిగ్రీ, పీజీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ వ్యాపార దిగ్గజం అజీమ్ ప్రేమ్జీ సంస్థ తరఫున అజీమ్ ప్రేమ్జీ యూనివర్సిటీ నిపుణులు బాదామి కుమార్ తతతవిద్యార్థులకు వివిధ కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. గీతాంజలి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, అధ్యాపకులు ధర్మ సతీష్, మల్లికార్జున్, ప్లేస్మెంట్ అధికారి దీపిక, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

### కస్తూర్బాలో "షీ" టీమ్ అవగాహన

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్ :**

కోడేరు పోలీస్ స్టేసన్ పరిధిలోని కస్తూర్బా విద్యాలయంలో "షీ" టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "షీ" టీమ్ ఏఎస్ఐ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలు, వాటి నివారణపై సమగ్ర అవగాహన కల్పించారు. డయల్ 100, "షీ" టీమ్ హెల్ప్‌లైన్ 181, సైబర్ క్రైమ్ నెంబర్ 1930 వంటి అత్యవసర సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో భరోసా సభ్యులు గాయత్రి, స్కూల్ స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మి, అధ్యాపక బృందం, "షీ" టీమ్ సభ్యులు వెంకట్రాములు, వెంకట్ నాయక్ పాల్గొన్నారు. విద్యార్థులు చురుకుగా పాల్గొని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

### యువత మత్తుకు దూరంగా ఉండాలి

**ముద్ర కూకట్‌పల్లి :**




మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జగద్గిరిగుట్ట సీఐ వెంకటేష్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక రాజీవ్ గృహకల్పలోని సంస్కృతి పాఠశాలలో నిర్వహించిన డ్రగ్స్ అవగాహన శిబిరంలో ఆయన మాట్లాడారు. బాలికలు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వేధింపులు ఎదురైతే షీ టీమ్స్ లేదా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. సోషల్ మీడియా మాయలో పడకుండా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో క్రమశిక్షణతో మెలగాలని హితవు పలికారు. ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**ముద్ర, కూకట్‌పల్లి:**

రైతు భరోసా నిధులు విడుదల చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ గుడ్ విల్ హోటల్ చౌరస్తా వద్ద కృతజ్ఞత సభ నిర్వహించారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు , స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్ :**




బిజినపల్లి మండల కేంద్రంలో నాగర్ కర్నూల్ వైద్య కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో క్షయ (టిబి) వ్యాధిపై అవగాహన ర్యాలీ ని వైద్యాధికారి డాక్టర్ పి. సృజన ప్రారంభించారు. వైద్యాధికారులు డాక్టర్ నరేష్, మెడికో సోషల్ వర్కర్ డి. బాలమ్మ, హెల్త్ సూపర్వైజర్లు అశోక్ కుమార్, చంద్రశేఖర్, క్షయ వ్యాధి సూపర్వైజర్ శ్రీనివాసులు, ఆరిఫ్, శ్రావణ్, మహిళా ఆరోగ్య కార్యకర్తలు కే. మంగ, శ్వేత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం

**ముద్ర, తాండూర్:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో తాండూర్ గ్రంథాలయ శాఖ ఆవరణలో చెట్లను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మానవ హక్కుల కమిషన్ తెలంగాణ రాష్ట్ర జోనల్ అధ్యక్షులు వడ్డే సాయిలు రాజన్న, జిల్లా అధ్యక్షులు పకీరప్ప, జనరల్ సెక్రెటరీ కిష్టప్ప పాల్గొన్నారు.

### జర్నలిస్ట్‌ను యూనియన్ నాయకుల పరామర్శ

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్ :**

ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకుంటున్న టీయూడబ్ల్యూజె (ఐజెయూ) యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు, కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన జర్నలిస్ట్ కొండూరు కృష్ణయ్య శెట్టిని మంగళవారం యూనియన్ నాయకులు పరామర్శించారు. జిల్లా అధ్యక్షులు విజయ గౌడ్, జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా ప్రచార కార్యదర్శి చీకిరాల పట్టాభి, ఈసీ సభ్యులు జయప్రసాద్, రమణ కుమార్, కల్వకుర్తి సీనియర్ నాయకులు శ్రీనివాస్ ఉన్నారు.

### ఆత్మీయ సమ్మేళనం

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:**

జిల్లా ప్రాథమిక విద్యా పథకం (డీపెప్) క్రింద విజయవంతంగా పనిచేసి విద్యా లక్ష్యాల సాధనలో విశేష కృషి చేసిన రిసోర్స్ పర్సన్స్ గ్రూప్ 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా వట్టెంలో రజితోత్సవ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన సుమారు 100 మంది మిత్రులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా అప్పటి అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సందడి ప్రతాపరెడ్డి, గాడి సురేందర్, బి. వేణుగోపాల్, శివకుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, చంద్రశేఖర్, పెద్దమందడికి చెందిన వరప్రసాద్, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
25.03.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**లడ్డూ ప్రసాదం ప్రత్యేకత**

తిరుమల లడ్డూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రసాదం. దీనికి ప్రత్యేకమైన రుచి, GI ట్యాగ్ ఉండటం విశేషం.

# మధ్యాహ్నం.. నిర్వహణ భయం

- మరో ప్రధానోపాధ్యాయుడిపై వేటు
- వేధిస్తున్న సిబ్బంది కొరత..
- నిధులు సక్రమంగా రాకపోవడంతో ఆసక్తి చూపని ఏజెన్సీలు
- సస్పెన్షన్ ఎత్తివేయాలని టీయుటీఎఫ్ డిమాండ్

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**




ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వహణ సరిగా లేదనే కారణంతో మరో ప్రధానోపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు వేశారు. సోన్ మండలం కడ్తాల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె వెంకటేశ్వర్ ను సస్పెండ్ చేస్తూ డీఈఓ దర్శనం భోజన్న ఉత్తర్వులు జారీ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వహణ ఒక సమస్యగా మారుతూ వస్తున్న తరుణంలో ప్రధానోపాధ్యాయుని బాధ్యత చేపట్టడం కత్తి మీద సాములా మారింది. ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తున్నట్లు ప్రకటించినా అందులో చిన్న చిన్న రాళ్లు, పురుగులు వస్తుండడంతో అటు మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు, ఇటు ప్రధానోపాధ్యాయులకు సమస్యగా మారింది. ఒక పక్క విధులు నిర్వహిస్తూనే మరో పక్క మధ్యాహ్న భోజన నిర్వహణ ఒక సవాలుగా మారింది. తాజాగా జరిగిన ఈ ఉదంతంలో మధ్యాహ్న భోజనంలో రాళ్లు, పురుగులు వచ్చాయని ఆరోపణలున్నాయి. అయితే పర్యవేక్షణ బాధ్యతలు ఒక్క ప్రధానోపాధ్యాయుడే నిర్వహించటం సమస్య కాగా, సరిపడా సిబ్బంది లేకపోవటం మరో సమస్య. ఈ ఉదంతంలో మొత్తం 9 మంది సిబ్బందికి గాను ఒకరిని నిర్మల్ బాలికల ఉన్నత పాఠశాలకు డిప్యూట్ చేశారు. ఇద్దరు రిటైర్ అయ్యారు. ఉన్న ఆరుగురిలో నలుగురు పదో తరగతి విధులకు వెళ్లారు. ఉన్న ప్రధానోపాధ్యాయుడు, మరో ఉపాధ్యాయుడు నాలుగు తరగతులు పర్యవేక్షిస్తూ మధ్యాహ్న భోజనం కూడా చూసుకోవాలంటే సాధ్యం అవుతుందా అన్నది అధికారులకే తెలియాలి. సన్న బియ్యం సరఫరా చేస్తున్నట్లు చెబుతున్న జిల్లా అధికారులు వాటి పరిస్థితి గురించి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. ఇదిలా ఉంటే మధ్యాహ్న భోజన నిధులు కూడా సక్రమంగా రాని ఫలితంగా ఏజెన్సీలు కూడా వంట చేసేందుకు ఆసక్తి కనబరచటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో నిర్వహణా వైఫల్యం పేరిట చర్యలకు ఉపక్రమించటం ఎంత వరకు సమంజసమని ఉపాధ్యాయ లోకం వాపోతోంది. బియ్యం సరఫరా సమయంలోనే శుభ్ర పరచిన బియ్యం పంపిస్తే ఈ సమస్య ఉండదని విద్యార్థులు పేర్కొంటున్నారు.

**సస్పెన్షన్ ఎత్తివేయాలి: టి యు టి ఎఫ్**

సోన్ మండలం కడ్తాల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పరిశుభ్రత లోపించిదన్న ప్రధానోపాధ్యాయుడు కే.వెంకటేశ్వర్ పై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేయడం సరికాదని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియుటిఎఫ్) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి రవికాంత్, వహీద్ ఖాన్ పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీన జరిగిన సంఘటన పూర్తి విచారణ కాకుండానే మరుసటి రోజే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. వారిని వెంటనే పునర్నియామకం చేపట్టాలని కోరారు. కూరగాయల పరిశుభ్రత లోపించినప్పుడు మొదటగా మధ్యాహ్న భోజన ఏజెన్సీపై చర్యలు తీసుకుంటూ సదరు ప్రధానోపాధ్యాయునికి షోకాజ్ నోటీసు జారీ చేయాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పర్యవేక్షణ బాధ్యత నుండి ప్రధానోపాధ్యాయులను మినహాయించాలని అన్నారు.




## ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి

- కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలి
- కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**ముద్ర, కరీంనగర్:**

యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సన్నద్ధం కావాలని, కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. ఈ ఏడాది యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రణాళికపై జిల్లా ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది యాసంగి సీజన్ లో 2 లక్షల 73 వేల 550 ఎకరాల్లో వరి ధాన్యం సాగైందని తెలిపారు. 6 లక్షల 46వేల 320 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేస్తున్నామని, 3 లక్షల 67 వేలా 776 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అన్నారు. జిల్లాలో ఐకెపి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డిసిఎంఎస్, హాకా ద్వారా 322 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా పౌరసరఫరాలు, కోఆపరేటివ్, డి ఆర్ డి ఓ, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు ఇందుకు సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తార్పాలిన్, తేమయంత్రాలు, బరువుతూచే యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, డ్రైయర్లు, కాలిపర్స్ వంటి సదుపాయాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని అన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, లోతట్టు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగారావు, పౌరసరఫరాల సంస్థ డిఎం రజనీకాంత్, డి.ఆర్.డి.ఓ శ్రీధర్, డి.సి.ఓ రామానుజాచార్య, డిఎమ్ఓ షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

**ముద్ర, మంథని**

మంథనిలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్స్ & హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వనజ రాణి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 18 వేలు అమలు చేసి పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఐసిడిఎస్ కు సరిపడా నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్ఈపి చట్టాన్ని వ్యతిరేకిస్తూ ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ప్రీ ప్రైమరీ విద్యను అంగన్వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని 2026 ఎడ్యుకేషన్ పాలసీని సవరించాలని కోరారు. అంగన్వాడీలకు క్రమం తప్పకుండా వేతనాలు ఇవ్వాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకురాలు కే. కుమారి, స్వరూప, సుగుణ, శోభ, సులోచన, భాగ్య, సుజాత తదితర అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**బోథ్, ముద్ర:**




ఆదిలాబాద్ జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కలవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన "టీబీ ముక్త్ భారత్ అభియాన్" 100 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని, స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపును ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 24 గ్రామాలను ఇప్పటికే టీబీ రహిత గ్రామాలుగా ప్రకటించామని, ఇందులో రెండు ఏళ్లుగా టీబీ కేసులు లేని టక్కుగూడ గ్రామానికి సిల్వర్ మెడల్ లభించిందని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారు ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీ నుండి పూర్తిగా కోలుకోవచ్చని భరోసా ఇచ్చారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం అధునాతన 'హ్యాండ్ హెల్డ్ ఎక్స్‌రే' యంత్రాలను అందుబాటులోకి తెచ్చిందని, ప్రజలు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లోనే పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా సామాజిక అంశాలపై సైతం దృష్టి సారించాలని, జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టి 'బాల్య వివాహ రహిత పంచాయతీలు'గా తీర్చిదిద్దాలని సర్పంచులకు సూచించారు. అలాగే, మహిళలందరికీ సమగ్ర ఆరోగ్య పరీక్షల కోసం త్వరలోనే ప్రత్యేక హెల్త్ ప్రొఫైల్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. అనంతరం పలువురు టిబి వ్యాధిగ్రస్థులకు కళావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిక్షయ్ మిత్ర కిట్ లను, టిబి నియంత్రణకు కృషి చేసిన సర్పంచ్ లకు, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు వైద్యాధికారులు సాధన, మనోహర్, టిబి ప్రోగ్రామ్ అధికారి సుమలత, తహసిల్దార్ రమేష్, ఎంపీడీవో గోపాల కృష్ణ రెడ్డి, కళావతి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అశోక్, వైద్యులు, రోగులు, ఆయా సర్పంచ్లు రంజన, లక్ష్మీ , కోమల్, లత, గ్రామస్తులు, పాల్గొన్నారు.



## ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్

- ఎస్పీ జానకి షర్మిల


**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

వివిధ కేసులతో ఇబ్బంది పడుతున్నవారు ఈ నెల 28న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలని ఎస్పీ జానకి షర్మిల ఒక ప్రకటనలో కోరారు. తమ కేసులను త్వరితగతిన తక్కువ వ్యయంతో పరిష్కరించేందుకు భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ కక్షిదారులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. చిన్న చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ వ్యాజ్యాలకు లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కారం పొందవచ్చని తెలిపారు. ఇందువల్ల న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవచ్చన్నారు.

## విద్యార్థుల సామర్థ్యం పెంచాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**



విద్యార్థుల సామర్థ్యాల పెంపుదల లక్ష్యంగా విద్యా బోధన చేయాలని కలెక్టర్ అభిలాష అన్నారు. సారంగాపూర్ మండలం చించోలి బి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. వారితో మాట్లాడుతూ మెనూ ప్రకారం అందిస్తున్నారో లేదో తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా బడికి రావాలని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అన్ని శ్రద్ధగా వినాలన్నారు. మధ్యాహ్నం వేళల్లో ఎండ అధికంగా ఉన్నందున విద్యార్థులు బయట తిరగకుండా ఇళ్లలోనే ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. భోజనశాల లేదన్న విషయం విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన కలెక్టర్ భోజన శాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రతిరోజు విద్యార్థులందరికీ నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అన్నారు. ఆమె వెంట డీఈవో భోజన్న, తహసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ లక్ష్మీకాంత రావు, సర్పంచ్ సాయన్న, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలి

- రాజకీయ పార్టీలు సహకరించాలి
- కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**ముద్ర, కరీంనగర్:**

ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను ఎన్నికల సంఘం చేపట్టిందని, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇందుకు పూర్తిగా సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులతో పాటు రాజకీయ పార్టీలు నియమించుకునే బి.ఎల్.ఎల పాత్ర కూడా కీలకమని అన్నారు. ప్రత్యేక సమరణ ద్వారా జాబితాలో నిజమైన ఓటరు కచ్చితంగా ఉంటారని తెలిపారు. డూప్లికేట్ ఓటర్లతో పాటు మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిపోయిన, రెండు ఓట్లు ఉన్నవాళ్ల ఓట్లు మాత్రమే తొలగిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డిఓ రమేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.రమణారెడ్డి (బిజెపి), అబ్దుల్లా అసీం, సయ్యద్ బర్కత్ అలీ, సయ్యద్ (ఏఐఎంఐఎం), సాతినేని శ్రీనివాస్ (బిఆర్ఎస్), ఈ.రవీందర్ (టిడిపి), నాంపల్లి శ్రీనివాస్ (బిజెపి) ఎం.వాసుదేవ రెడ్డి (సిపిఐ(ఎం)), రామిడి తిరుపతిరెడ్డి వి.నర్సింగం(ఐ.ఎన్.సి) పాల్గొన్నారు.

# భక్తుల సౌకర్యాలే కేంద్రం కావాలి

- గోదావరి పుష్కరాలపై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్
- వీడియో కాన్ఫరెన్స్

**మహదేవపూర్, ముద్ర:**



2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలు విజయవంతంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జరిగేలా సమగ్ర చర్యలు చేపట్టాలని దేవా దాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆదేశించారు. సోమవారం గోదావరి పరివాహక జిల్లాల కలెక్టర్లతో గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన పనులపై హైదరాబాద్ నుండి దేవా దాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి గోదావరి పరివాహక జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు చేసేందుకు తరలి వచ్చే అవకాశం ఉన్నందున, ముందస్తు ప్రణాళికలతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు. ముఖ్యంగా ఘాట్‌ల అభివృద్ధి, రహదారి సదుపాయాలు, పార్కింగ్ ఏర్పాట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్నాన ఘాట్‌ల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని, జన సమ్మర్ధ నియంత్రణ కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా తాత్కాలిక వసతి గృహాలు, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు తమ పరిధిలోని ఏర్పాట్ల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పుష్కరాలను విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ పేర్కొన్నారు. ప్రతిపాదనల మేరకు ప్రాధాన్యత పనులకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గోదావరి పుష్కరాల నిర్వహణకు ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతి రాజ్, దేవాదాయ తదితర శాఖల ద్వారా చేపట్టనున్న పనులను వివరించారు. ఘాట్లు, మౌలిక సదుపాయాలు, రోడ్లు అభివృద్ధి, నూతన రోడ్లు నిర్మాణం వంటి చేపట్టనున్న పనులకు ఆయా శాఖల ద్వారా ప్రతిపాదనలు. పంపినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 25-03-2026
www.mudranews.in | @mudranews



### హుండీ ఆదాయం

తిరుమల హుండీ ప్రపంచంలోనే అత్యధిక విరాళాలు పొందే ఆలయాల్లో ఒకటి. భక్తులు డబ్బు, బంగారం, ఆభరణాలు సమర్పిస్తారు.



## ఉత్సాహంగా టీజీ ఎస్పీఎఫ్ 10 కి.మీ. పరుగు




<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి:</u> టీజీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లాక్రా ఆదేశాలు, కమాండెంట్ ఎన్. త్రినాధ్ సూచనల మేరకు యాదగిరిగుట్ట ఆలయ భద్రతా ఎస్పీఎఫ్ సిబ్బందికి సోమవారం ఉదయం 10 కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. తులసి కాటేజ్ నుండి మల్లాపురం వరకు సాగిన ఈ పరుగులో అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. సిబ్బందిలో శారీరక దృఢత్వం, క్రమ శిక్షణ పెంపొందించడం, భక్తులకు మెరు గైన భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ కె. శేషగిరి రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవి, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్షయ రహిత జిల్లాకు కృషి చేయాలి
### - మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్



<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి:</u> క్షయ రహిత జిల్లాగా మార్చడానికి కృషి చేయాలని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళ వారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా క్షయ వ్యాధి నివారణ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ జగదేకపూర్ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం 100 రోజులు టి.బి ముక్త భారత్ అభియాన్ లో భాగంగా "టి.బి ఎలిమినేషన్" మిషన్ ను వైస్ చైర్మన్ పోతం శెట్టి మంజుల వెంకటేశం, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.మనోహర్ కలిసి ప్రారంభించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వంశీకృష్ణ, డిప్యూటీ డియంహెచ్ డాక్టర్ యశోధ, డా. సుమన్ కళ్యాణ్, రోటరీ క్లబ్ అధ్యక్షులు పి. రాజేశ్వర్ రావు, మాజీ అధ్యక్షులు కే.నర్సింగ్ రావుల చేతుల మీదుగా న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు రామకృష్ణ, యశోద, వీణా, సుమన్ కళ్యాణ్, వంశీకృష్ణ, వైద్య అధికారులు డా॥ నిరోషా, డా. నితీషా, స్కిడ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, రోటరీ క్లబ్ మాజీ సెక్రటరీ సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు మంచి కంటి వెంకటేశం, మాజీ కౌన్సిలర్ బాలయ్య, కౌన్సిలర్లు, సభ్యులు ఎం.డి. చాంద్, క్షయ నివారణ ఐసీటీసీ, వైద్యశాఖ సిబ్బంది, మెడికల్ నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికలో సరైన వసతులు కల్పించాలి
### - బీఆర్ఎస్ నాయకుడు బందెల శ్రీను

<u>ముద్ర, మోత్కూరు:</u> స్మశాన వాటికలో మోత్కూర్ పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకుడు బందెల శ్రీను అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి పనులు చేపట్టడం లేదని, స్మశాన వాటికలో నీళ్లు, వీధిలైట్లు లేవనీ మధ్యలోనే పనులు ఆగిపోయాయనీ ఆవేదన వ్యక్తం చేశారు. స్మశాన వాటికలో ఒక మున్సిపాలిటీ సిబ్బందినీ నియమించాలనీ తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే రాబోయే రోజుల్లో ధర్నాలు నిరసనలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి లక్ష్మణ్, కూరెళ్ళ సందీప్ కూరెల్ల సతీష్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాలి

<u>ముద్ర, తుంగతుర్తి:</u> బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ మేడ్డుల రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తగూడెం గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహం చేయడం నేరమని ఎవరు కూడా బాల్య వివాహాలను ప్రోత్సహించ వద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాండవుల మహేష్ ,ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూప రాణి, ఆర్ లక్ష్మీ నరసయ్య బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ ఎ.శోభా రాణి, ఉమామహేశ్వరి,గ్రామ సభ్యులు వెంకన్న అంగన్వాడి టీచర్స్, లక్మి బాయి, శారద, ప్రజా ప్రతినిదులు అధికారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొనారు.

### కేసీఆర్, పీఎస్ఆర్ కృషి వల్లే
## బస్వాపురం ప్రాజెక్టుకు కాళేశ్వరం నీళ్లు



<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి:</u> యాదాద్రి భువనగిరి జిల్లా బస్వాపురం ప్రాజెక్టుకు కాలేశ్వరం నీళ్లు వస్తున్నాయంటే మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పుణ్యమే అని బీ ఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు అన్నారు. మంగళ వారం భువనగిరి మండల పరిధిలో మాజీ సర్పంచ్ ఈర్ల కృష్ణ బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి నల్లమస్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గౌస్ నగర్ గ్రామంలో కెనాల్ వద్ద నీళ్లు ప్రవహిస్తున్న సందర్భంగా గ్రామ రైతులతో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతు కోసం బస్వాపురం ప్రాజెక్టు కోసం నిరంతరం కృషి చేశారని గ్రామస్తులు అభినందనలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కంచి మల్లయ్య, గ్రామ మాజీ సర్పంచ్ ఈర్ల కృష్ణ, మాజీ సర్పంచ్ పుట్ట అరుణ వీరేష్ యాదవ్, సర్పంచ్ తోటకూరి శంకరయ్య, ఉప సర్పంచ్ ఏ. బాల మల్లేష్, మాజీ ఉప సర్పంచ్ సైరెడ్డి,పోసి రెడ్డి, ఎలిమినేటి పాపిరెడ్డి, నల్లమాస్ చంద్రయ్య, భూషబోయిన సిద్దులు యాదయ్, నలమస్ కుమార్ గౌడ్, తోటకూరి పరమేష్, గడ్డం సందుల వెంకటేష్, హరినాథ్ రెడ్డి, జనగాం మహేష్, వెంకటేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

### బస్వాపూర్ రిజర్వాయర్
# నిర్వాసితుల పునరావాస పనులు పూర్తి చేయాలి
### - కలెక్టర్ అనురాగ్ జయంతి



<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి :</u> బస్వాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల పునరావాస పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. భువనగిరి మండల పరిధిలోని బస్వాపూర్ రిజర్వాయర్కు సంబంధించి పునరావాసం, పునర్వ్యవస్థీకరణ (ఆర్ అండ్ ఆర్) ప్రాజెక్టు కింద అభివృద్ధి చేస్తున్న బి.ఎన్. తిమ్మాపురం, లప్పానాయక్ తండా లే అవుట్లను జిల్లా కలెక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి తో కలసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లే అవుట్లో కొన సాగుతున్న, పెండింగ్లో ఉన్న మౌలిక వసతుల పనులను పరిశీలించారు. ఇప్పటి వరకు చేపట్టిన పనుల పురోగతిని అడిగి తెలుసుకుని, ఇంకా ప్రారంభించాల్సిన పనులను తక్షణమే మొదలు పెట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు అవసరమైన రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలను త్వరితగతిన అందించాలన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణంపై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు, వాటి నిర్మాణం ఎప్పుడు ప్రారంభమవుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీలోకి వెళ్లే మట్టి రహదారులను చదును చేసి, రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగన్మోహన్ ప్రసాద్తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఇసుక సరఫరా ఆన్లైన్ లోనే చేపట్టాలి

జిల్లాలో ఇసుక సరఫరా పూర్తిగా ఆన్లైన్ ద్వారానే చేపట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. మంగళవాం కలెక్టరేట్, వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ జిల్లాలో ఇసుక సరఫరా, వినియోగం, నిల్వలు, రవాణా తదితర అంశాలపై ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి తో కలిసి మైన్స్ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం, ప్రభుత్వ అవసరాల కోసం అవసరమైన ఇసుకను పూర్తిగా ఆన్లైన్ విధానం లోనే చేసుకొని పొందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక రీచ్ల వద్ద నియమ నిబంధనలు కచ్చితంగా పాటించడంతో పాటు అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ మైనింగ్ రవికుమార్, ఇరిగేషన్ యస్ ఈ రవీందర్ ,జిల్లా రవాణా అధికారి హరికృష్ణా, అధికారులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా జరిగేలా చూడాలి

రబీ సీజన్ కి సంబంధించి వరి ధాన్యం కొనుగోలు నిర్వహణ ప్రక్రియను సజావుగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మినీ మీటింగ్ హాల్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై వ్యవసాయ, మార్కెట్, రవాణా, గ్రామీణాభివృద్ధి, కో-ఆపరేటివ్, మిల్లర్లు తదితర శాఖల అధికారులతో రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాలకు వచ్చే ధాన్యం కొనుగోలు పక్కాగా జరగాలన్నారు. అన్ని కేంద్రాల్లో ప్రభుత్వ నియమనిబంధనలకు అనుగుణంగా త్రాగునీరు కరెంటు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. కేంద్రాలకు ఏ రోజు వచ్చే ధాన్యం అదే రోజు కొనుగోలు జరిగి, అదేరోజు మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలన బృందాలచే ఆకస్మిక తనిఖీలు చేపట్టి కొనుగోలు ప్రక్రియ ను పర్యవేక్షణ చేయాలన్నారు

ఈ సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి,సివిల్ సప్లై మేనేజర్ హరి కృష్ణ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సివిల్ సప్లై అధికారి రోజారాణి, జిల్లా వ్యవసాయ అధికారి రమణ రెడ్డి, జిల్లా తూనిక, కొలతల అధికారి వెంకటేష్, జిల్లా కోపరేటివ్ అధికారి మురళి, మిల్లర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు
### - ఉగాది పురస్కార గ్రహీత దాయం ఝాన్సీ రాజిరెడ్డి



<u>ముద్ర, తుంగతుర్తి:</u> గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని ఉగాది పురస్కార గ్రహీత దాయం ఝాన్సీ రాజిరెడ్డి అన్నారు. మండలంలోని వెంపటి గ్రామానికి చెందిన దాయం ఝాన్సీ రాజిరెడ్డి సోమవారం హైదరాబాదు రవీంద్రభారతిలో విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుమల శ్రీనివాస్, తెలంగాణ భాష సంస్కృతి శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకున్నారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, గ్రామీణ ప్రాంతాల్లో విజ్ఞాన వెలుగులు నింపేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని అన్నారు. అవార్డు అందుకోవడం వల్ల సామాజిక బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలా చారి, ఉమ్మడి నల్లగొండ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గాదె వినో ద్ రెడ్డి, విపంచి ఫౌండేషన్ గౌరవ సల హాదారు ఆందోజు నాగభూషణం, సోషల్ డెవలప్మెంట్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుండ్ల మదన్, కల్లూరి సుజాత ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కల్లూరి రమేష్ పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

<u>ముద్ర, చిట్యాల:</u> మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న చిట్యాల మున్సిపల్ కార్మికుల ర్యాలీని ఆయన మంగళవారం జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యు లు అవిశెట్టి శంకరయ్య, మున్సిపల్ వర్క ర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐ టియు) రాష్ట్ర కమిటీ సభ్యులు పాల లక్ష్మ య్య, జిల్లా కమిటీ సభ్యులు మేడి శోభ, జనపాల జ్యోతి, యమున, అండాలు, ధనలక్ష్మి, వరమ్మ, కిషన్, శేఖర్, రమణ, నరేష్, యాదయ్య పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి



<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి:</u> తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూస శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు మెరుగు మధు డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ ఉద్యమకారుల జిల్లా స్థాయి సమావేశం భువనగిరిలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో జిల్లా అధ్యక్షుడు మెరుగు మధు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, పెన్షన్ సౌకర్యం, ప్రభుత్వం ఇస్తామన్న 250 గజాల స్థలాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు సుర్వి శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండీ ఇమ్రాన్, టీఎల్ఎఫ్ నాయకులు కోడిమాల కృష్ణ, వినోద్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పాలకూర వెంకటేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీరాములు, బీబీనగర్ జేఏసీ కన్వీనర్ ముస్కే జైపాల్ రెడ్డి, సీపీఐ నాయకులు శోభన్ బాబు, రమేష్, భాస్కర్, బద్దం వెంకట్రెడ్డి, ఆటో జాక్ నాయకులు గొర్ల లక్ష్మణ్, గోప రాజు గణేష్, పాండు రవీందర్ బాల న్, ఆత్మకూరు జేఏసీ కన్వీనర్ నిమ్మ శేఖర్ రెడ్డి, చాడా శశిధర్ రెడ్డి, ఆడెపు శ్రీను, పసునూరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ నిరసన



<u>ముద్ర ప్రతినిధి, భువనగిరి:</u> స్వయం సహాయక సంఘాల సభ్యులకు జరుగుతున్న అన్యాయాలపై మున్సిపల్ కార్యాలయం ఎదుట భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు పొందాల్సిన ఆర్థిక సాయం రుణ సౌకర్యాలు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మహిళలకు రావాల్సిన అన్ని ప్రయోజనాలను వెంటనే అందజేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పాదారాజు ఉమా శంకర్ రావు, జిల్లా కార్యదర్శులు మేడి కోటేష్, వైజయంతి, కౌన్సిలర్లు వంగెటి సుచరిత, బండారు స్వర్ణలత, తుమ్మల యాస్మిన్ నగేష్, మాజీ కౌన్సిలర్లు నల్లమాస సుమ వెంకటేష్, జనగాం కవిత, పట్టణ ప్రధాన కార్యదర్శులు రాళ్లబండి కృష్ణచారి, ఉడుత భాస్కర్, మంగు నర్సింహ,పట్టణ ఉపాధ్యక్షుడు యట వెంకటేష్, కొల్లోజు సతీష, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం



<u>ముద్ర, తుంగతుర్తి:</u> మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ తుంగతుర్తి మండలంలో ఇటీవల మృతి చెందినవారి కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు, మంగళవారం వెలుగుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కుమ్మరి వెంకన్న ఇటీవల మరణించడంతో కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజే శారు. అనంతరం గానుబండ గ్రామానికి చెందిన బీ ఆర్ఎస్ నాయకుడు బత్తుల శివ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి 5 వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, జిల్లా నాయకులు గుండగాని రాముల గౌడ్, తడకమళ్ళ రవి కుమార్, గోపగాని రమేష్, మల్లెపాక రాములు, గడ్డం సోమేష్, జలంధర్, గునిగంటి సంతోష్, గుడిపాటి వీర య్య, యాకూబ్, బొజ్జ సాయి కిరణ్ కొండగడుపుల వెంక టేష్, గోపగాని వెంకన్న, రామనర్సు పాల్గొన్నారు.

**కేశకర్ణం (ముండనం)**

భక్తులు తమ కోరిక నెరవేరినందుకు తల నీలాలు సమర్పిస్తారు. ఇది వినయం, సమర్పణకు సంకేతంగా భావిస్తారు.






## కథారచనలో కళాశాల విద్యార్థుల ప్రతిభ

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

కథారచనలో సిద్దిపేట స్వయంప్రతిపత్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో బహుమతులు సాధించడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపల్ ఆచార్య జి. సునీత తెలిపారు. రోజురోజుకూ జీవితం యాంత్రికంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో యువతరం సృజనాత్మక రంగంలో చొరవ చూపడం ఆనందంగా ఉందని, మానవీయత, సహానుభూతిని ప్రతిబింబించడంలో సాహిత్యం చేసే సేవ గొప్పదన్నారు. సాహిత్య రంగంలో రాణించడం ఆనందదాయకమని విద్యార్థులను అభినందించారు. కళాశాల తెలుగుశాఖ అధ్యక్షులు, భాషా సాంస్కృతిక విభాగం కన్వీనర్ ఆచార్య మట్టా సంపత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవకులు మణికొండ వేదకుమార్ ఆధ్వర్యంలో 'బాలచెలిమి' మాసపత్రిక, 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయస్థాయి బాలల కథారచన పోటీల్లో కళాశాల నుంచి 13 మంది యువ రచయితలు పాల్గొన్నారని తెలిపారు. వీరి రచనల స్ఫూర్తితోనే న్యాయనిర్ణేతలు 'యువతరం రాసిన బాలల కథలు' అనే కొత్త విభాగాన్ని ప్రారంభించారని, ఈ విభాగంలో 'చెట్టు ఉపకారం' కథతో కట్టోజు నీరజ జాతీయ స్థాయిలో మొదటి బహుమతి సాధించిందన్నారు. విజేత నీరజ కథతో పాటు ఇతర విద్యార్థుల కథలను ఐఎస్బీఎన్ నంబరుతో కథాసంకలనంగా ముద్రించారని తెలిపారు. ఈ సందర్భంగా 'బాలచెలిమి' సంపాదకులు వేదకుమార్, కథల పోటీ కన్వీనర్ గరిపల్లి అశోక్‌లకు కళాశాల తరపున ధన్యవాదాలు తెలిపారు. మొత్తం 28 కథలతో రూపొందిన సంకలనంలో 13 కథలు సిద్దిపేట స్వయంప్రతిపత్తి డిగ్రీ కళాశాలవే కావడం విశేషం. పిల్లిట్ల భార్గవి (వర్షాలు లేని ఊరు), నరిగె రమ్య (నిజమైన మిత్రుడు), బొమ్మెన కోమల (తొందరపాటు), కొండ జ్యోతి (చదువు), దమ్మ స్పందన (వారసత్వం), కట్టోజు నీరజ (చెట్టు ఉపకారం), బొల్లు అఖిల (అన్నీ గొప్పవే), ఉప్పు భవాని (చిన్ని), కొత్తపల్లి వైష్ణవి (స్నేహమే బహుమతి), ఎర్ర చంద్రశేఖర్ (అన్వి మారిన రోజు), కొమ్మట భార్గవి (దుర్వ్యసనాలకు దూరం), తమ్మనబోయిన రిబ్కా (కనువిప్పు), కావేరి హరికృష్ణ (సెలవుల స్నేహం) కథలు సంకలనంలో చోటు సంపాదించాయి. కార్యక్రమంలో తెలుగుశాఖ అధ్యాపకులు పిట్ల దాసు, నారోజు వెంకటరమణ, నరేశ్, రామస్వామి, శైలజ, సాయి సురేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## ఎముకల అరుగుదలకు అనేక కారణాలు

- **డాక్టర్ అభిషేక్ బార్లీ**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**




ఎముకల అరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయని డాక్టర్ అభిషేక్ బార్లీ తెలిపారు. ఎముకల అరుగుదల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, వైద్యుల సూచన మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా సిద్దిపేట, నంగునూరు, చిన్నకోడూరు, కొండపాక మండల శాఖల సహకారంతో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరాన్ని హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద హాస్పిటల్స్ సౌజన్యంతో నిర్వహించారు. ఈ శిబిరంలో జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులతో పాటు రాగుల రాజిరెడ్డి, జైన సత్యం, రామకృష్ణయ్య, అలాగే సంబంధిత మండలాల అధ్యక్షులు మహంకాళి, భూం రెడ్డి, గాల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మల్లేశం, రాం రెడ్డి, వీరయ్య, రత్నాకర్ రెడ్డి, ముత్యం రెడ్డి, జానకిరాములు, కృపాసాగర్ పాల్గొన్నారు. వైద్య శిబిరంలో మొత్తం 98 మందికి గుండె, ఆర్థోపెడిక్, బీఎండీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో సుమారు 16 మందికి మోకాళ్ల మార్పిడి చేయించుకోవాలని వైద్యులు సూచించారు.

## బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోండి

- **కలెక్టర్ హేమావతి సూచన**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు త్వరగా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కే. హేమావతి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంపై చర్చించి సూచనలు ఇచ్చారు. ఓటర్ నమోదు ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రియ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఓటర్ నమోదు వేగవంతం కావాలంటే రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు, ఎన్నికల బూత్ లెవెల్ అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి పరిశీలన చేయాల్సి ఉంటుందని తెలిపారు. అందువల్ల ఆయా రాజకీయ పార్టీలు తక్షణమే బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ప్రతినిధి మోహన్ లాల్, బిజెపి భైరీ శంకర్, కాంగ్రెస్ అనిల్ కుమార్, ఎఐఎంఐఎం మునీర్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా రంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

- **పెండింగ్ బెనిఫిట్స్ విడుదల చేయాలని టీపిటిఎఫ్ డిమాండ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని పదే పదే చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, ఈ బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 8.2శాతం మాత్రమే కేటాయించడం నిరాశ కలిగించిందని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపిటిఎఫ్) జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి కొంగోటి యాదగిరి, పి. వెంకట్రామి రెడ్డి విమర్శించారు. మంగళవారం ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనల్లో భాగంగా కలెక్టరేట్ ఎదుట టీపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నట్లుగా విద్యారంగానికి 20 శాతం గానీ, తెలంగాణ విద్యా కమిషన్ సూచించిన 18 శాతం గానీ, కనీసం కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పేర్కొన్న 15 శాతం కూడా కేటాయించకపోవడం వల్ల ప్రభుత్వ మాటలకు చేతలకు పొంతన లేదని ఆవేదన వ్యక్తం చేశారు అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ కార్యాలయ ఏఓ యూనస్‌కు అందజేశారు. ఈ ఆందోళనలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, రాష్ట్ర మాజీ కార్యదర్శి రామ్ కిషన్‌తో పాటు నీలకంఠం, గోపాల్, యాదగిరి, మొయిజుద్దీన్, శ్రీనివాస్ రెడ్డి, సాయి బాబా, రాజయ్య, దేవి సింగ్, సురేందర్, శ్రీనివాస్ జాదవ్, సంగయ్య, హీరాలాల్, రాజేంద్ర ప్రసాద్, సంగీత, నజీరోద్దీన్, అల్వాల్ రమేష్, మధుసూదన్, శశిధర్ రెడ్డి, జె. రామ్ చంద్రం, ముత్యాలు, పిండి నాగరాజు, నర్సింగం, చాంద్ పాషా, మహ్మద్ అమీరుద్దీన్, కిరణ్ కుమార్, మల్లేశం, చౌదరి మాధవ్, రాజశేఖర్, మురళి, శ్రీనివాస్ నాగభూషణం, కమ్మరి శ్రీనివాస్, రమేష్, కొమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# క్షయ రహిత తెలంగాణే లక్ష్యం

- **ఎమ్మెల్యే రోహిత్ రావు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

క్షయ రహిత మెదక్ జిల్లాగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా 'టీబీ ముక్త్ భారత్ అభియాన్ 2.0' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్షయవ్యాధి నియంత్రణలో ముందస్తు గుర్తింపు, స్క్రీనింగ్, ప్రజల్లో అవగాహన పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అధిక జనాభా గల ప్రాంతాలపై ప్రాధాన్యంగా దృష్టి పెట్టాలని సూచించారు. లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి నాట్, మైక్రోస్కోపీ, ఎక్స్‌రే పరీక్షల ద్వారా నిర్ధారణకు పంపాలని అధికారులను ఆదేశించారు. డయాబెటిస్, పోషకాహార లోపం, వృద్ధులు, ఇతర సహవ్యాధులు ఉన్నవారిని ప్రాధాన్యంగా స్క్రీనింగ్ చేయాలని, అన్ని కేసులను నిక్షయ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల మధ్య సమన్వయం పెంచి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ మాట్లాడుతూ జిల్లాలో అధిక ప్రమాదం ఉన్న 99 గ్రామాలను గుర్తించామని, జిల్లావ్యాప్తంగా 389 కేసులు నమోదయ్యాయని




తెలిపారు. డిసిహెచ్ డా. శివ దయాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ 'టీబీ ముక్త్ భారత్ అభియాన్ 2.0' లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం క్షయవ్యాధి నివారణకై కరపత్రాలను విడుదల చేసి, వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్ హరిత నర్సింగరావు, సూపరింటెండెంట్ సరిత దేవి, శైలజ, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో 60 మంది లబ్ధిదారులకు రూ.49.30 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే రోహిత్ రావు అందజేశారు

**టీబీ రహిత జిల్లానే లక్ష్యం : కలెక్టర్ ప్రావీణ్య**

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :** సంగారెడ్డిలో అవగాహన ర్యాలీతో 100 రోజుల 'టీబీ ముక్త్ భారత్ అభియాన్ 2.0' కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి టీబీ రహిత తెలంగాణ సాధనలో భాగస్వాములు కావాలని కలెక్టర్ డా. ప్రావీణ్య పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి సబ్ సెంటర్ వద్ద మంగళవారం కలెక్టర్ జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. అలాగే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 100 రోజుల 'టీబీ ముక్త్ భారత్ అభియాన్ 2.0' కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా దీనిని నిర్మూలించడం సాధ్యమని తెలిపారు.. టీబీ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని, నిర్లక్ష్యం చేయకుండా పూర్తి స్థాయి చికిత్స తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని టీబీ నివారణపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వసంత్ రావు, జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డా. అరుణకుమారి, వైద్య సిబ్బంది, కళాశాలల విద్యార్థులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## భూ భారతి దరఖాస్తులు పరిష్కరించాలి

- **కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



జిల్లాలో భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. ఈ విషయంలో తహసీల్దార్లు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి భూభారతి, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, ఓటర్ జాబితా తయారీ, ఇతర రెవెన్యూ సమస్యలపై గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పారదర్శక పాలన కోసం అధికారులు కృషి చేయాలని అన్నారు. భూభారతి, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్లను హెచ్చరించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను శాశ్వతంగా పరిష్కరించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని సూచించారు. ఓటర్ జాబితా తయారీని అన్ని శాఖల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

**సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై దృష్టి..**

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి నివారణకు జిల్లాలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ, ఇంట్రా గ్రిడ్, గ్రిడ్, ఇరిగేషన్, ఫారెస్ట్, ఆర్డబ్ల్యూఎస్, గ్రామపంచాయతీ, గ్రౌండ్ వాటర్, మున్సిపల్ కమిషనర్లు తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఎక్కడైనా నీటి ఎద్దడి తలెత్తిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. గ్రామపంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా అధికారులు శ్రీనివాసరావు, జోజి, యాదయ్య, మిషన్ సంపత్‌కుమార్, నాగభూషణం, మున్సిపల్ కమిషనర్లు, గ్రౌండ్ వాటర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా సహకార బ్యాంకర్లతో కలెక్టర్ సమీక్ష




**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**

ఉమ్మడి మెదక్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకుల లావాదేవీలు, ఆర్థిక పరిస్థితిపై జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయంలో పర్సన్‌ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్, కలెక్టర్ పి. ప్రావీణ్య బ్యాంకు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్యాంకు ఆర్థిక స్థితిగతులు, ఆదాయంఖర్చుల సమతుల్యత, రుణాల మంజూరు, వసూళ్ల పురోగతిపై చర్చించారు. పెండింగ్ రుణాల వసూళ్లను వేగవంతం చేయాలని, రైతులు, ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు.. 202627 బడ్జెట్‌పై మహాజన సభ నిర్వహించి రూ.75,24,60,000 అంచనాలను ఆమోదించారు. సమావేశంలో పిఎసిఎస్ సంఘాల ద్వారా రుణాల వసూళ్లు, దీర్ఘకాలిక రుణాల రికవరీపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో నాబార్డ్ జనరల్ మేనేజర్ కృష్ణ చైతన్య, సీఈఓ సురేష్ పాల్గొన్నారు.

## జనగణన విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

జనగణన2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన విధులు సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్లో మండల ప్రణాళిక గణాంక అధికారులు, సాంకేతిక సహాయకులకు జనగణన ప్రక్రియ, యాప్ నిర్వహణపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రభుత్వం అమలు చేయబోయే ప్రణాళికలలో భాగంగా సమర్థవంతంగా అమలు చేసేందుకు జనాభా లెక్కలు ఉప యోగపడతాయన్నారు. జనగణన విధులను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి యాప్ ద్వారా జనగణన చేయాలన్నారు. ఈ సీపీవో, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధికి నిధులు పెంచాలి : సిపిఎం

- **కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ఉద్యమాల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం. ఆడివయ్య అన్నారు. మెదక్ కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో జిల్లా అధికార యంత్రాంగం అలసత్వం వహిస్తోందని ఆయన విమర్శించారు. భూ సమస్యలు, రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు, ఉపాధి హామీ సమస్యలు వంటి అంశాలపై సంవత్సరం క్రితం వినతిపత్రం అందజేసినా ఎలాంటి నిర్దిష్ట చర్యలు తీసుకోలేదన్నారు. వెల్దుర్తి, టేక్మాల్, రేగోడ్, నిజాంపేట, రామాయంపేట, శివంపేట, చిలప్చెడ్ మండలాల్లో రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయని తెలిపారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సి.పి.ఎం జిల్లా కార్యదర్శి కే. నరసమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. పద్మ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ. మల్లేశం, కే. మల్లేశం, కే. నాగరాజు, గౌరయ్య, సంతోష్, అజయ్, నరేందర్, దేవయ్య, శౌకత్, వెంకట్, వసంత తదితరులు పాల్గొన్నారు.




## వర్షాధారిత పథకంతో రైతులకు ఆధునిక సాయం

- **నల్లవెల్లిలో కలెక్టర్ ప్రావీణ్య క్షేత్ర పర్యటన**

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

వర్షాధారిత పథకం ద్వారా రైతులు సమగ్ర వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు, ఆదాయం సాధించాలని కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. గుమ్మడిదల మండలం నల్లవెల్లి గ్రామంలో అమలవుతున్న వర్షాధారిత అభివృద్ధి పథకాన్ని మంగళవారం పరిశీలించి, రైతులకు అందిస్తున్న ఆధునిక పరికరాలు, రాయితీల వినియోగాన్ని క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా రైతు కూర్మ కొమురయ్య కూరగాయల పొలాన్ని పరిశీలించి, పథకం కింద అందించిన వ్యవసాయ పరికరాల వినియోగాన్ని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా రైతులు పొందుతున్న లాభాలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు, ఆదాయం పెంచుకోవచ్చని సూచించారు. వర్షాధారిత అభివృద్ధి పథకం కింద మొత్తం 115 మంది లబ్ధిదారులకు సుమారు రూ.32.10 లక్షల విలువైన రాయితీలు, వ్యవసాయ పరికరాలు అందజేసినట్లు తెలిపారు. ఇందులో ప్లాస్టిక్ క్రేట్లు, వర్మీ బెడ్స్, తేనెటీగల పెంపక బాక్సులు వంటి పరికరాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సమీకృతంగా వినియోగించుకుంటే రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఉషారాణి, మండల రెవెన్యూ అధికారి పరమేశ్వర్, ఉద్యాన అధికారులు మౌనిక, అనూష, హెచ్ఈఓలు విట్టల్, స్వామి, ఏఈ (హౌసింగ్), సర్పంచ్ రాణి సురేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

**గుమ్మడిదలలో కలెక్టర్ ప్రావీణ్య విస్తృత పర్యటన**

గుమ్మడిదల మండలంలో కలెక్టర్ పి. ప్రావీణ్య మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిజిటల్



హెల్త్ ప్రొఫైల్ నమోదు ప్రక్రియను పరిశీలించడంతో పాటు నల్లవల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన గృహాన్ని సందర్శించి లబ్ధిదారుతో మాట్లాడారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ముందుగా గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడి వివిధ విభాగాలు, ల్యాబ్, ఫార్మసీని పరిశీలించి సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ నమోదు ప్రక్రియపై ప్రత్యేకంగా దృష్టి సారించి, డేటా ఎంట్రీ, రోగుల వివరాల సేకరణ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం నల్లవల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన గృహాన్ని సందర్శించి, లబ్ధిదారుతో మాట్లాడి ఇంటి నిర్మాణ నాణ్యత, అందుబాటులో ఉన్న సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. పిమ్మట గుమ్మడిదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి, సిఎస్ఆర్ నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులపై తహసీల్దార్‌తో చర్చించి వివరాలు తెలుసుకున్నారు.. ఈ పర్యటనలో తహసీల్దార్ పరమేశ్వర్, నల్లవల్లి సర్పంచ్ రాణి సురేష్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
25.03.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**సుప్రభాతం సేవ**

ప్రతి రోజు ఉదయం స్వామివారిని మేల్కొలిపే "సుప్రభాతం" ప్రత్యేక సేవ. ఇది వినడానికి భక్తులకు అత్యంత ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుంది.



## 2028 నాటికి ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీరు

- **జేజేఎం 2.0కు కేంద్ర-రాష్ట్ర ఒప్పందం**

**ముద్ర, అమరావతి :**




రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా జల్ జీవన్ మిషన్ (జేజేఎం) 2.0ను వేగవంతం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. 2028 నాటికి 'హర్ ఘర్ జల్' లక్ష్యాన్ని పూర్తిచేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఢిల్లీలో జరిగిన జేజేఎం 2.0 ఒప్పంద కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న సీఎం, గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఇప్పటికే తాగునీటి వ్యవస్థల నిర్వహణ బాధ్యతలను పంచాయతీలకు అప్పగించినట్లు వివరించారు.ఈ మిషన్ అమలులో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ప్రాజెక్టును 2028 వరకు పొడిగించిన కేంద్ర నిర్ణయానికి ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాలనే లక్ష్యాన్ని వెల్లడించారు.కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్ మాట్లాడుతూ, జేజేఎం తొలి దశలో దేశవ్యాప్తంగా కోట్లాది ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పించామని, మిగిలిన ఇళ్లకు కూడా త్వరలో అందిస్తామని చెప్పారు. ఏపీలో నీటి నాణ్యత పరీక్షల కోసం మహిళలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ ఒప్పందంతో గ్రామీణ మౌలిక వసతులు బలోపేతం కావడంతో పాటు, పంచాయతీల ఆధ్వర్యంలో తాగునీటి నిర్వహణ మరింత సమర్థవంతంగా మారనుంది. 2028 డిసెంబర్ నాటికి రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.

## మతం మారితే ఎస్సీ హోదా రద్దు

- **మత మార్పిడిలపై సుప్రీం కోర్టు సంచలన తీర్పు**

**ముద్ర, న్యూఢిల్లీ :**



ఎస్సీ కులానికి చెందిన వారు మతం మారితే ఎస్సీ హోదా రద్దు అవుతుందని దేశ అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోకి కాకుండా ఇతర ఏ మతంలోకి మారిన వారి ఎస్సీ హోదా రద్దు అవుతుందని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. గతంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది.గతంలో ఏపీ హైకోర్టు జరిగిన విచారణలో.. క్రైస్తవ మతంలోకి మారిన పాస్టర్ ఎస్సీ ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని సుప్రీం న్యాయస్థానం స్పష్టం చేసింది. దీనిని సవాల్ చేస్తూ వారు సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పుకు సుప్రీంకోర్టు మద్దతుగా నిలిచింది.

**అసలు కేసు ఇది**

గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెంలో ఒక పాస్టర్‌పై జరిగిన దాడికి సంబంధించిన కేసు విచారణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. దశాబ్ద కాలంగా పాస్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తి క్రైస్తవ మతాన్ని స్వీకరించినట్లు కోర్టు గుర్తించింది. క్రైస్తవ మతంలో కుల వ్యవస్థకు తావులేదని, కాబట్టి ఒక వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన తర్వాత అట్రాసిటీ చట్టం కింద ఫిర్యాదు చేసే హక్కు ఉండదని కోర్టు స్పష్టం చేసింది. దాడి జరిగిన సమయంలోనూ సదరు వ్యక్తి ప్రార్థనలు చేస్తున్నట్లు గుర్తించిన కోర్టు, ఈ వ్యాఖ్యలు చేసింది. తహశీల్దార్ ఇచ్చిన ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం ఉన్నప్పటికీ, మత మార్పిడి తర్వాత ఆ చట్టపరమైన రక్షణ పొందేందుకు సదరు వ్యక్తికి అర్హత ఉండదని కోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని 341 అధికరణ ప్రకారం, ఎస్సీ హోదా కేవలం హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను అనుసరించే వారికి మాత్రమే పరిమితం చేయబడింది. మత మార్పిడి ద్వారా క్రైస్తవం, ఇస్లాం మతాన్ని స్వీకరించినప్పుడు సహజంగానే ఎస్సీ హోదా రద్దవుతుందని, తద్వారా అట్రాసిటీ చట్టం వర్తించదని హైకోర్టు ఈ కేసులో వ్యాఖ్యానించింది. ఈ తీర్పును సవాల్ చేసి సుప్రీంకి వెళ్లిన ఫాస్టర్ కు అక్కడ కూడా చేదు అనుభవం ఎదురైంది.

## కాంగ్రెస్ కు జీవన్ రెడ్డి గుడ్ బై

- **ఫలించని ఏఐసీసీ బుజ్జగింపులు**
- **నేడో రేపో పార్టీ సభ్యత్వానికి రాజీనామా**

**ముద్ర. జగిత్యాల :**



జగిత్యాల మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధమైనట్లు సంకేతాలు వెలువడ్డాయి. కొంతకాలంగా పార్టీపై అసంతృప్తిగా ఉన్న ఆయనను బుజ్జగించేందుకు హైకమాండ్‌తో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మంగళవారం జగిత్యాలలో జరిగిన భేటీలో కూడా కాంగ్రెస్‌లోనే కొనసాగాలని కోరినా జీవన్ రెడ్డి వెనక్కి తగ్గలేదు. ఇక వీరి భేటీ తర్వాత జీవన్ రెడ్డి ఇంటిపై ఉన్న కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీని ఆయన అభిమానులు తొలగించారు. ఇందిరా భవన్ పేరుతో ఉన్న ఫ్లెక్సీని తీసేశారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన జీవన్‌రెడ్డి.. ఇది పరిష్కారం లేని సమస్యగా మారిందని.. ఆ సమస్యకు పరిష్కారం కూడా తన వద్ద లేదని తెలిపారు. దీనికి పరిష్కారం వారి దగ్గర కూడా లేదని పేర్కొన్నారు. ఈ సమస్యకు పరిష్కారం లేదని పేర్కొన్న జీవన్ రెడ్డి, స్వపక్షంతో పోరాడలేనని స్పష్టం చేశారు. బుధవారం కార్యకర్తలతో సమావేశం అనంతరం తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని తెలిపారు. దీంతో ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేయడం ఖాయమనే చర్చ జరుగుతోంది. అయితే ప్రస్తుతం ఏ పార్టీలో చేరే ఆలోచన లేదని ఆయన వెల్లడించారు.

## కౌన్సెలింగ్ గడువును పెంచలేం

- **పీజీ మెడికల్ సీట్ల భర్తీపై సుప్రీం కోర్టు స్పష్టీకరణ**

**ముద్ర, న్యూఢిల్లీ :**

పీజీ మెడికల్ సీట్ల భర్తీకి సంబంధించిన కౌన్సెలింగ్ గడువును ఇకపై పెంచబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పిటిషన్లను కొట్టివేసిన కోర్టు, ఇప్పటికే అనేక విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపింది. విద్యా క్యాలెండర్ దృష్ట్యా గడువు పెంపు సాధ్యం కాదని పేర్కొంది. జాతీయ మెడికల్ కమిషన్ సమర్పించిన వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ప్రతి ఏడాది కొంతమంది సీట్లు మిగలడం సహజమని తెలిపింది. అయితే, ప్రైవేట్ మెడికల్ కళాశాలలకు తమ సమస్యలను ఎన్ఎంసీ కమిటీ ముందు వినిపించుకునే అవకాశం కల్పించింది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో పీజీ మెడికల్ కౌన్సెలింగ్ ప్రక్రియ దాదాపు ముగిసినట్లైంది.

# అక్కడ పెట్రోల్ ఉందా..?

- **బంకుల దగ్గర భయం భయం**
- **పెట్రోల్ కు క్యూ కడుతోన్న ప్రజలు**
- **నో స్టాక్ బోర్డులు..**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఇరాన్, ఇజ్రాయెల్‌ల ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన సరఫరాపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ ప్రభావం తెలంగాణలో కూడా కనిపిస్తోంది. హైదరాబాద్‌తో పాటు పలు పట్టణాల్లో పెట్రోల్ బంక్‌ల వద్ద ప్రజలు భారీగా క్యూ కడుతున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు కనిపించాయి. సోమాజిగూడ, ఎస్ఆర్ నగర్, ఉప్పల్, నాగోల్, బోడుప్పల్ వంటి ప్రాంతాల్లో కొన్ని బంకులు తాత్కాలికంగా మూతపడిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. దీంతో వాహనదారులు ఇంధనం కోసం ఒక బంక్ నుంచి మరో బంక్ వరకు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంకా కొన్ని బంకుల్లో పరిమితంగా మాత్రమే ఇంధనం విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ కారణంగా తెరిచి ఉన్న బంకుల వద్ద పెద్ద ఎత్తున వాహనాలు క్యూ కట్టిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

**క్రెడిట్ వ్యవస్థ మారడంతో ఏర్పడిన ఇబ్బందులు**

పెట్రోల్ బంకుల యజమానుల ప్రకారం ప్రస్తుతం ఏర్పడిన సమస్యకు ప్రధాన కారణం ఆర్థిక లావాదేవీల్లో వచ్చిన మార్పులే. గతంలో ఆయిల్ కంపెనీలు డీలర్లకు క్రెడిట్‌పై ఇంధనం అందించేవి. కానీ ఇప్పుడు 'నో క్రెడిట్' విధానాన్ని అమలు చేస్తున్నాయి. అంటే ముందుగా మొత్తం డబ్బులు చెల్లించిన తర్వాతే కొత్త స్టాక్‌ను సరఫరా చేస్తున్నారు. పెద్ద మొత్తంలో నగదు చెల్లించలేని కొంతమంది డీలర్లు కొనుగోళ్లు తగ్గించడంతో కొన్నిచోట్ల తాత్కాలిక కొరత కనిపిస్తోంది.

**రాష్ట్రవ్యాప్తంగా కొనుగోళ్లు తగ్గిన పరిస్థితి**

తెలంగాణలో సుమారు 4,200 పెట్రోల్ బంకులు ఉండగా, అందులో హైదరాబాద్‌లోనే 1,200కి పైగా ఉన్నాయి. సాధారణంగా రోజుకు 40 లక్షల నుంచి 70 లక్షల లీటర్ల వరకు పెట్రోల్, డీజిల్ సరఫరా జరుగుతుంది. అయితే ఇటీవల పరిస్థితుల కారణంగా డీలర్లు సుమారు 25 శాతం వరకు కొనుగోళ్లు తగ్గించినట్లు సమాచారం. మొదట జిల్లాల్లో ప్రారంభమైన ఈ సమస్య క్రమంగా నగరానికి కూడా చేరింది. దీంతో కొన్నిచోట్ల ఇంధనం కోసం వాహనదారులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.


**ఎల్పీజీ కోసం ఆటో డ్రైవర్ల ఇబ్బందులు**

పెట్రోల్ మాత్రమే కాకుండా ఎల్పీజీ గ్యాస్ విషయంలో కూడా కొన్ని ప్రాంతాల్లో సమస్యలు కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌లోని లక్డీకాపూల్ ప్రాంతంలో గ్యాస్ నింపించుకునేందుకు ఆటోలు పెద్ద ఎత్తున క్యూ కట్టాయి. ఏజీ ఆఫీస్ నుంచి భారత్ పెట్రోల్ బంక్ వరకు వందలాది ఆటోలు వరుసలో నిలబడిన దృశ్యాలు కనిపించాయి. ఒక్కో డ్రైవర్ దాదాపు రెండు గంటల వరకు వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో ఆటో డ్రైవర్లు ఆర్థికంగా కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు.

**అధికారుల స్పందన.. పుకార్లను నమ్మొద్దని సూచన**

హైదరాబాద్‌లో ఇంధన కొరతపై వచ్చిన వార్తల నేపథ్యంలో హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్పందించారు. నగరంలో పెట్రోల్ లేదా ఎల్పీజీ కొరత లేదని, అవసరమైన నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సరఫరా సజావుగా కొనసాగుతోందని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. ఒకేసారి బంకుల వద్దకు వెళ్లడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. పుకార్లను నమ్మకుండా సాధారణంగా ఇంధనం వినియోగించాలని ఎక్స్ లో రాసుకొచ్చారు. కాగా బుధవారం (రేపటి) నుంచి పెట్రోల్ దొరకదు అనే ప్రచారం కూడా జరుగుతోంది. దీంతో ప్రజలు పెద్ద ఎత్తున బంకులకు క్యూ కడుతున్నారు. అయితే ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని అధికారులు చెబుతున్నారు.

# పెరుగుతున్న సీట్లతో ఎవరికి లాభం..?




దేశమంతా లోక్ సభ అసెంబ్లీలకు సీట్లు పెరగనున్నాయి. ఇవి అప్పటికి ఉన్న సంఖ్యలో సగం అన్న మాట. ఈ లెక్క తీసుకుంటే ఏపీలో దాదాపుగా అసెంబ్లీ సీట్ల సంఖ్య 269కి, ఎంపీ సీట్ల సంఖ్య 38 కి పెరగనున్నాయి. అయితే ఈ పెరుగుతున్న సీట్లతో ఎవరికి రాజకీయ లాభం అన్న చర్చకు తెర లేస్తోంది. అధికమవుతున్న సీట్లతో చాలా మందికి ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా పోటీ చేసే చాన్స్ వస్తుంది. ఆ విధంగా అనేక మంది ఆశలు తీరుతాయి. ఈ విధంగా చూస్తే ఏపీలో ఒక విధంగా రాజకీయ కోలాటం మొదలవుతుందని చెప్పక తప్పదు. అధికంగా సీట్లు పెరగడం కూటమికి ప్లస్ పాయింట్లు అని అంటున్నారు. ఎలాగంటే కూటమిలో మూడు పార్టీలు ఉన్నాయి. టీడీపీ జనసేన బీజేపీ మొత్తం 175 సీట్లను ఎంతో జాగ్రత్తగా 2024 ఎన్నికల్లో సర్దుకుని పోటీ చేశాయి. ఆ విధంగా చూస్తే ఆశావహులు మూడు పార్టీలలో ఎంతో మంది మిగిలిపోయారు. టీడీపీలో అయితే త్యాగరాజులకు కొదవ లేదు, జనసేనలో అనేక మంది తమ పార్టీ గెలిస్తే చాలు అని తగ్గారు, బీజేపీలో అదే పరిస్థితి. ఇపుడు. ఏకంగా కొత్తగా మరో 87 దాకా సీట్లు అసెంబ్లీకి పెరగబోతున్నాయి అంటే కచ్చితంగా అది కూటమికి ప్లస్ పాయింట్ అని అంటున్నారు. కొత్తగా సీట్ల పెరుగుదలతో కూటమిలోని పార్టీలు మరింత బలంగా ఐక్యంగా ముందుకు వస్తాయి. ఒకరికి ఒకరితో పోటీ లేకుండా అంతా సహకరించుకునే చాన్స్ ఉంటుంది. అలాగే జనసేన కోరుకున్న యాభై సీట్లు దక్కవచ్చు, బీజేపీకి 20 దాకా సీట్లు లభించవచ్చు. ఇక 200 దాకా సీట్లలో టీడీపీ పోటీ చేసేందుకు వెసులుబాటు ఉంటుంది. 175 సీట్లలోనే 164 సీట్లు సాధించిన కూటమి 269లో మ్యాజిక్ ఫిగర్ 135 సీట్లను ఈజీగా సాధించేందుకు ఎంతో వీలు అవుతుంది అని అంటున్నారు. రెట్టించిన ఉత్సాహంతో కూటమి దూసుకుని వచ్చేందుకు ఈ పరిణామాలు దోహదపడతాయని విశ్లేషిస్తున్నారు.

ఇక కూటమి అధికారంలో ఉండడంతో పునర్ విభజన సైతం తమకు అనుకూలంగా ఉండేలా చేసుకునే వీలు ఉంటుంది. అదే సమయంలో ప్రత్యర్థి బలాలు ఉన్న చోట వ్యూహాత్మకంగా సీట్లను తగ్గించేందుకు చాన్స్ ఉంటుంది. ఇవన్నీ రాజకీయ వ్యూహాలుగానే చూడాలి. దాంతో వైసీపీకి ఈ పరిణామాలు కొంత ఇబ్బందికరంగా ఉండొచ్చు అని అంటున్నారు. అలాగే మహిలా సీట్లు, రిజర్వుడు సీట్ల విషయంలో అధికార పార్టీ చెప్పినట్లుగానే జరుగుతుంది కాబట్టి విపక్ష వైసీపీకి ఇది ఒక సవాల్ గా మారుతుందని అంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే వైసీపీకి అసలైన సమస్యలు పెరిగిన సీట్లతోనే అని అంటున్నారు. ఒంటరిగా పోటీ చేసే వైసీపీకి మొత్తం 269 ఎమ్మెల్యే 38 ఎంపీ అభ్యర్థులను నిలబెట్టడం ఒక సవాల్ అవుతుందని అంటున్నారు. ఎవరో ఒకరికి టికెట్ ఇవ్వడం కాదు గెలుపు గుర్రాల కోసం వేట అన్నదే పెద్ద ఇష్యూ అవుతుందని చెబుతున్నారు. ఇప్పటికి అయితే చాలా మంది పార్టీని వీడిపోయారు. దాంతో ఉన్న సీట్లలోనే సమర్ధ నేతల కరవు ఉందని అంటున్నారు. దానికి తోడు మహిళా రిజర్వేషన్ల పేరుతో 86 మంది దాకా ఎంపిక చేసి ఇవ్వడం అంటే అది కూడా చాలా ఆలోచించాల్సిన విషయంగా ఉంటుంది అంటున్నారు. ఏది ఏమైనా ఇప్పటి నుంచే వైసీపీ అలెర్ట్ అయితేనే తప్ప ఈ పెరిగిన సీట్లలో కూటమితో బలంగా ఢీ కొట్టడానికి అవకాశం ఉండదని అంటున్నారు.

**కనపర్తి రవి**

## నాకు మంత్రి పదవి ఇస్తే పార్టీ, ప్రభుత్వానికే లాభం

- **మీడియాతో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**


**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి అంశంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను పదవుల కోసం ఆశపడే వ్యక్తిని కాదని స్పష్టం చేస్తూనే, తనకు మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్ పార్టీతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికే మంచి జరుగుతుందని అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడిన ఆయన గతంలో అధిష్టానం మంత్రి పదవి హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావాలంటే తనలాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు అవసరమని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డితో ఎలాంటి విభేదాలు లేవని చెప్పిన ఆయన, ఇటీవల ప్రత్యేక భేటీ జరగలేదని స్పష్టం చేశారు. అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా మాత్రమే కలిసినట్లు తెలిపారు.ఇక అసెంబ్లీ డైనింగ్ హాల్‌లో కేటీఆర్‌తో జరిగిన సమావేశంపై స్పందిస్తూ అది సాధారణ చర్చ మాత్రమేనని చెప్పారు. గత రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ 2018లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడం పెద్ద తప్పు అని కేటీఆర్‌కు చెప్పినట్లు తెలిపారు.అసెంబ్లీ డైనింగ్ హాల్‌లో కేటీఆర్, రాజగోపాల్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కలిసి భోజనం చేయడం, అనంతరం దీర్ఘకాలం చర్చలు జరపడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# గద్దర్ అవార్డుల్లో గోల్‌మాల్

- **ఫంక్షన్ పేరుతో మాయ**
- **రెండు కోట్లు నొక్కేశారా?**
- **బీఆర్ఎస్ నేత దాసోజు సంచలన ట్వీట్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




గద్దర్ అవార్డుల నిర్వహణ మరోసారి వివాదానికి దారి తీసేలా ఉంది. బీఆర్ఎస్ నేత దాసోజు ప్రవీణ్ ఈవెంట్ నిర్వహణ, లెక్కలపై సంచలన ట్వీట్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'గద్దర్' పురస్కార వేడుక రాజకీయ విమర్శలకు దారి తీసింది. ఈవెంట్ రోజు ప్రముఖ రచయిత దర్శకుడు విజయేంద్ర ప్రసాద్, అగ్ర నిర్మాత డి సురేష్ బాబులను నిర్వాహకులు అవమానించారని వార్తలు వచ్చాయి. మీరెవరు? అని వాళ్ళిద్దర్నీ ప్రశ్నించడం, ముఖ్యంగా 'మీరు ఆర్ నారాయణ మూర్తి కదా?' అని విజయేంద్ర ప్రసాద్ దగ్గర మాట్లాడటంతో వాళ్లిద్దరూ ఈవెంట్ లోపలకు వెళ్లకుండా వచ్చేశారు. ఇప్పుడు మరో వివాదంలో చిక్కుకుందీ ఈవెంట్. నిర్వహణలో గోల్ మాల్ చేశారని, ఈవెంట్ పేరుతో సుమారు రెండు కోట్లు నొక్కేశారని విమర్శలు వస్తున్నాయి.

**రెండు కోట్లకు నాలుగు కోట్ల బిల్!?**

డబ్బులు లేవని తెలంగాణ ప్రజలకు సంక్షేమ పథకాలు ఆపేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, సాదాసీదాగా బతికిన గద్దర్ పేరుతో అవార్డులు ఇస్తూ ప్రజల సొమ్మును లూటీ చేశారని దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఆయన పేరు మీద డబ్బులు దోపిడీ చేశారని ఆయన పేర్కొన్నారు. 'గద్దర్ ఈవెంట్స్' కోసం రెండు కోట్లు ఖర్చు అయితే... నాలుగు కోట్లు డ్రా చేశారని ఆరోపించారు.

**శ్రేయా ఘోషల్ కోసం కోటీ 65 లక్షలా?**

గద్దర్ అవార్డ్స్ ఈవెంట్ ను బాలీవుడ్ మేనేజ్మెంట్ సంస్థకు అప్పగించింది తెలంగాణ ప్రభుత్వం. ఈవెంట్‌లో పెర్ఫార్మన్స్ చేసిన వాళ్ళు ఎవరెవరికి ఎంత ఇచ్చారనేది ఒక షీట్ బయట పడింది. అందులో ప్రముఖ గాయని శ్రేయా ఘోషల్ (Shreya Ghoshal)కు ఒక కోటి 65 లక్షల రూపాయలు ఇచ్చినట్టు పేర్కొన్నారు. నిధి అగర్వాల్ 20 లక్షలు, దేవి శ్రీ ప్రసాద్ 60 లక్షలు ఇచ్చినట్టు తెలిపారు. యాంకర్లు సుమ కనకాల, ప్రదీప్ మాచిరాజులకు ఏడు లక్షలు ఇచ్చినట్టు తెలిసింది. ఈవెంట్ కోసం చేసిన ఖర్చు పట్ల విమర్శలు చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు.

**అదనపు ఖర్చు ఎవరు చేశారు?**

గద్దర్ అవార్డుల కోసం రెండు కోట్ల 13 లక్షల ఖర్చు అయితే... నాలుగు కోట్ల 11 లక్షల బిల్ వేశారని, అదనపు ఖర్చును ఎవరు ఓకే చేశారు? అనేది తెలియాల్సి ఉందని దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. అది సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఓకే చేశారా? లేదంటే ఫిల్మ్ డెవలెప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ 'దిల్' రాజు ఓకే చేశారా? అనేది ప్రశ్నించారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందో చూడాలి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
25.03.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**బ్రహ్మోత్సవాలు**

తిరుమల బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ వేడుకల్లో లక్షలాది భక్తులు పాల్గొంటారు.



# ఆత్మనిర్భర్ ఇన్వెస్టర్లకు అవగాహన

**ముద్ర, బిజినెస్:**

'ఇంట్రొడక్షన్ టు సెక్యూరిటీస్ మార్కెట్' పేరిట సీడీఎస్ఎల్ ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫండ్ ఇన్వెస్టర్ల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. సికింద్రాబాద్‌లోని టాటా స్ట్రైవ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఉద్యోగుల కోసం ఈ ప్రోగ్రాంలు నిర్వహించబడ్డాయి. ఇన్వెస్ట్‌మెంట్, సెక్యూరిటీస్ మార్కెట్‌కి సంబంధించిన ప్రాథమికాంశాల గురించి తెలియజేసేలా, అలాగే బాధ్యతాయుతమైన ఇన్వెస్టింగ్, డిపాజిటరీల పాత్ర మరియు పని తీరు, ఇన్వెస్టర్ల హక్కుల పరిరక్షణకు సంబంధించి అందుబాటులో ఉన్న సాధనాలు మొదలైన వాటి గురించి అవగాహనను పెంపొందించేలా ఈ సెషన్లు రూపొందించబడ్డాయి. పూర్తి సమాచారంతో, సురక్షితంగా, నిర్మాణాత్మకమైన విధంగా ఆర్థిక మార్కెట్లలో పాలు పంచుకునేలా ఇన్వెస్టర్లలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు చేపట్టారు. సమగ్రమైన ఉదాహరణలు, ఇంటరాక్టివ్ చర్చల ద్వారా కీలకమైన ఇన్వెస్టింగ్ కాన్సెప్టుల సంబంధించిన కీలకాంశాలను ఈ ప్రోగ్రాంలు సవివరంగా తెలియజేశాయి. ప్రజలు అత్మనిర్భర్ పెట్టుబడిదారు గా మారేలా సాధికారత కల్పించే దిశగా, ఆర్థిక అక్షరాస్యతను విస్తరించడంతో పాటు దేశవ్యాప్తంగా ఇన్వెస్టర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు సీడీఎస్ఎల్ ఐపీఎఫ్ కట్టుబడి ఉంది.





# టీబీ నియంత్రణలో నాగర్‌కర్నూల్ జిల్లా నంబర్ 1

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:**

టీబీ నియంత్రణలో నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానాన్ని సాధించి విశిష్ట గుర్తింపు పొందింది. ప్రపంచ టీబీ నియంత్రణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ గుర్తింపు లభించింది. గాంధీ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీంద్ర నాయక్ హాజరయ్యారు. టీబీ నిర్మూలనలో విశేష కృషి చేసినందుకు జిల్లా వైద్యాధికారి డా. రవి కుమార్ నాయక్‌కు ప్రత్యేక అవార్డు ప్రదానం చేశారు. ప్రోగ్రామ్ అధికారి రఫీక్‌ను సత్కరించారు. టీబీ నియంత్రణలో జిల్లాకు రాష్ట్రంలో మొదటి స్థానం లభించడం పట్ల అధికారుల్లో ఆనందం వ్యక్తమైంది. గ్రామ స్థాయి వరకు వైద్య సేవలను విస్తరించడం, టీబీ రోగులను త్వరగా గుర్తించి సమయానికి చికిత్స అందించడం ఈ విజయానికి ప్రధాన కారణమని అధికారులు తెలిపారు. పూర్తి స్థాయి చికిత్స అందించడంలో జిల్లా ముందంజలో నిలవడం, వైద్య సిబ్బంది అంకితభావానికి ఇది నిదర్శనమని తెలిపారు. టీబీ రహిత సమాజం దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగు అని జిల్లా వైద్యాధికారి డా. రవి కుమార్ నాయక్ పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంపు ద్వారా మరింత విజయాలు సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

# మీషో తొలి రికార్డు




- **"వాణి యువర్ మీషో దోస్త్" ప్రారంభం**
- **ఇది సరికొత్త జెన్-ఏఐ ఆధారిత సంభాషణాత్మక వాయిస్ షాపింగ్ అసిస్టెంట్**

**ముద్ర బిజినెస్ :**

భారత ఈకామర్స్ రంగంలో మరో ముందడుగు పడింది. ప్రముఖ ఆన్‌లైన్ వాణిజ్య సంస్థ మీషో, జెన్‌ఏఐ ఆధారిత సంభాషణాత్మక వాయిస్ షాపింగ్ అసిస్టెంట్ "వాణి యువర్ మీషో దోస్త్"ను ప్రారంభించింది. టైర్ 2, టైర్ 3 నగరాల వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ ఫీచర్, షాపింగ్‌ను మరింత సులభంగా, సహజంగా మార్చేందుకు ఉద్దేశించింది. వినియోగదారులు ఇకపై టైప్ చేయకుండా తమ మాటలతోనే ఉత్పత్తులను వెతకగలరు, ప్రశ్నలు అడగగలరు, ఎంపికలను పోల్చుకుని కొనుగోలు నిర్ణయం తీసుకోగలరు. ఆఫ్‌లైన్‌లో ఉండే సంభాషణాత్మక షాపింగ్ అనుభవాన్ని డిజిటల్‌లోకి తీసుకురావడమే ఈ టెక్నాలజీ లక్ష్యంగా ఉంది. మీషో సహ వ్యవస్థాపకుడు సంజీవ్ కుమార్ మాట్లాడుతూ ఏఐ ఆధారిత పరిష్కారాల ద్వారా వినియోగదారుల అవసరాలను ముందుగానే అర్థం చేసుకుని మెరుగైన అనుభవాన్ని అందించడమే తమ లక్ష్యమన్నారు. "వాణి"తో వినియోగదారుల షాపింగ్ అనుభవం కొత్త దశలోకి ప్రవేశిస్తుందని కంపెనీ విశ్వసిస్తోంది.

# కూలింగ్ ఉత్పత్తుల్లో సరికొత్త శ్రేణి

- **బ్లూస్టార్ కొత్త ఆవిష్కరణ**
- **తదుపరి దశ వృద్ధికి దోహదపడేలా సమగ్రమైన యూనిటరీ కూలింగ్**
- **2026 కోసం సరికొత్త రూమ్ ఎయిర్ కండీషనర్ల శ్రేణి**

**ముద్ర, బిజినెస్ :**




భారత్‌లో రెసిడెన్షియల్ మరియు కమర్షియల్ కూలింగ్ సెగ్మెంట్లలో తమ కార్యకలాపాలను మరింత పటిష్టం చేసుకునే దిశగా బ్లూస్టార్ లిమిటెడ్ 2026 వేసవి కోసం సరికొత్త రూమ్ ఎయిర్ కండీషనర్ల శ్రేణిని ప్రవేశపెట్టింది. ఈ సమగ్రమైన పోర్ట్‌ఫోలియోలో వివిధ రకాల కస్టమర్ల అవసరాలు, వినియోగ వాతావరణాలకు అనుగుణంగా ఫ్లాగ్‌షిప్ ప్రీమియం రేంజి ఉత్పత్తులతో పాటు రూమ్ ఎయిర్ కండీషనర్లకు సంబంధించి 125 మోడల్స్ ఉన్నాయి. ఇవన్నీ కూడా 2026 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చిన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) ప్రమాణాలకు తగ్గట్లుగా ఉంటాయి. వివిధ అవసరాలకు అనుగుణంగా, విద్యుత్తును ఆదా చేసే, అత్యంత సమర్ధవంతమైన కూలింగ్ సొల్యూషన్స్‌కి నెలకొన్న డిమాండును తీర్చే విధంగా ఈ మోడల్స్ వ్యూహాత్మకంగా తీర్చిదిద్దబడ్డాయి. దేశంలో రూమ్ ఎయిర్ కండిషనర్ల మార్కెట్ స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తోంది. పెరుగుతున్న ఆదాయ స్థాయులు, వేగవంతమైన పట్టణీకరణ, అలాగే ఉష్ణోగ్రతల తీవ్రత పెరగడం ఇందుకు కారణాలుగా నిలుస్తున్నాయి. వినియోగం తక్కువగా ఉన్న మార్కెట్లలో తొలిసారిగా వినియోగించే వారు అలాగే మరింత మెరుగైన పట్టణ ప్రాంతాల్లో రిప్లేస్‌మెంట్ డిమాండ్‌తో ప్రస్తుతం సుమారు 1.4 కోట్ల యూనిట్లుగా ఉన్న మార్కెట్ పరిమాణం 2030 నాటికి 3 కోట్ల యూనిట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా టియర్3, టియర్4, టియర్5 నగరాలు కీలక వృద్ధి కేంద్రాలుగా మారుతున్నాయి. ప్రస్తుతం చిన్న స్థాయిలోనే ఉన్నప్పటికీ, ఈ మార్కెట్లు టియర్1 మరియు టియర్2 శ్రేణి నగరాల కంటే వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ పోర్ట్‌ఫోలియోలో ఇన్వర్టర్, ఫిక్స్‌డ్ స్పీడ్, విండో ఏసీలు ఉన్నాయి. వివిధ ధరల శ్రేణుల్లో వినియోగదారులకు అనువైన ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. విశిష్టమైన వినియోగదారులను ఆకట్టుకునేలా 'మిడ్‌నైట్ సిల్వర్' ఫినిష్‌తో 'ఐకానియా' అనే ప్రీమియం మోడల్‌ను ఆవిష్కరించడం ఇందులో ప్రధాన ఆకర్షణ. 'సూపర్ ఎనర్జీ ఎఫిషియెంట్ ఏసీలు', 'హెవీ డ్యూటీ ఏసీలు', 'హాట్ అండ్ కోల్డ్ ఏసీలు', 'యాంటీ వైరస్ టెక్నాలజీ ఏసీ'లను కూడా సంస్థ ఫ్లాగ్‌షిప్ మోడళ్లుగా విడుదల చేసింది. సూపర్ ఎనర్జీ ఎఫిషియెంట్ ఏసీల్లో డైనమిక్ డ్రైవ్ టెక్నాలజీ ఉంది. ఇది విద్యుత్తును ఆదా చేసే విధంగా, అధిక గాలి ప్రవాహంతో సమర్థవంతమైన కూలింగ్ అందిస్తుంది. ఈ టెక్నాలజీతో ఒక టన్ను ఇన్వర్టర్ స్ప్లిట్ ఏసీ ఐసీర్ 6.25ని సాధించగలదు. ఇది సాధారణ 3 స్టార్ ఇన్వర్టర్ ఏసీతో పోలిస్తే సుమారు 45% ఎక్కువ ఎనర్జీ సామర్థ్యం కలిగి ఉంటుంది.

**తయారీ సామర్థ్యాల విస్తరణ**

బ్లూస్టార్ కంపెనీ ఉత్పత్తి సామర్థ్యం సుమారు 14 లక్షల యూనిట్లుగా ఉండగా, డిమాండ్‌ని బట్టి 18 లక్షల యూనిట్లకు పెంచుకునే అవకాశం ఉంది. ప్రత్యేకంగా రూమ్ ఏసీల ఉత్పత్తి కోసం హిమాచల్ ప్రదేశ్‌లో రెండు ప్లాంట్లతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో అధునాతన ప్లాంటు ఉంది. సమర్ధతను, నాణ్యతను, విస్తృతిని మెరుగుపర్చుకునే విధంగా వీటిలో అత్యాధునిక అసెంబ్లీ లైన్‌లు, ఆటోమేటెడ్ మెటీరియల్ హ్యాండ్లింగ్ సిస్టమ్‌లు సహా ఐవోటీ ఇంటిగ్రేషన్ మరియు డిజిటలైజేషన్ గల అధునాతన ఆటోమేషన్ టెక్నాలజీలు ఉన్నాయి.

ఈ సందర్భంగా బ్లూ స్టార్ మేనేజింగ్ డైరెక్టర్ త్యాగరాజన్ మాట్లాడుతూ భారతదేశంలో కూలింగ్ డిమాండ్ కీలక మలుపు దశలో ఉంది. సానుకూల డెమోగ్రాఫిక్స్, వినియోగ ధోరణుల్లో మార్పులు దీనికి కారణం. భవిష్యత్తులో సుమారు 15 కోట్ల కుటుంబాలు ఏసీలు కొనుగోలు చేసే సామర్థ్యాన్ని పొందే అవకాశం ఉందని అన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

- **జిల్లా అధ్యక్షుడు పి. విజయ్‌కుమార్**
- **టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా 4వ కార్యవర్గ సమావేశం**

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:**




జిల్లాలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యూనియన్ కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు పి. విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని వంగూరు మండలంలోని కోనేటిపూర్ శివారులో టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా నాలుగవ కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల సమస్యలపై జిల్లా కార్యవర్గ సభ్యులు విస్తృతంగా చర్చించారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ వివరించగా, వాటి అమలుపై సమీక్ష నిర్వహించారు. జర్నలిస్టుల సామూహిక ఇన్సూరెన్స్, సంక్షేమ నిధి ఏర్పాటు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటుకు తీర్మానం ఆమోదించారు. అలాగే రాబోయే రోజుల్లో నియోజకవర్గాల వారీగా చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చించారు. కల్వకుర్తి డివిజన్ అధ్యక్షుని ఎన్నిక ఇంకా జరగనందున, డివిజన్ కార్యదర్శిగా ఎన్నికైన కస్తూరి శ్రీనివాస్‌ను తాత్కాలిక డివిజన్ అధ్యక్షుడిగా జిల్లా కమిటీ నియమిస్తూ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పి. విజయ్‌కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యూనియన్ సభ్యులంతా ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ సభ్యుడు సుదర్శన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జువ్వ కృష్ణయ్య, సీనియర్ రిపోర్టర్ సురేష్, ప్రచార కార్యదర్శి పట్టాభి, జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.



# రూ.60 వేల కోట్ల ఆదాయం ఇస్తున్నా.. తెలంగాణాపై కేంద్రం చిన్నచూపు

- **మంత్రి శ్రీధర్ బాబు**

**ముద్ర, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రం దేశ జీడీపీలో సుమారు 5 శాతం వాటా కలిగి ఉండి, రూ.60 వేల కోట్లకు పైగా ఆదాయం సమకూర్చుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయడం లేదని ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్రంలో ఫ్లై ఓవర్లు, రోడ్ ఓవర్ బ్రిడ్జిల పనులు ఎక్కడా రద్దు చేయలేదని స్పష్టం చేసిన మంత్రి, కొన్ని మార్పులు చేసినా పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రూ.2,250 కోట్లతో ఈ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు. కూకట్‌పల్లి, బాచుపల్లి ప్రాంతాల్లో పనులు త్వరలో ప్రారంభం లేదా పూర్తి కానున్నాయని వివరించారు. మూసీ ప్రక్షాళనతో పాటు భారీ రహదారి ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. శుద్ధి చేసిన నీటిని పారిశ్రామిక అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అమృత్ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేస్తున్న నిధుల మాదిరిగానే తెలంగాణకు కూడా సమానంగా నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నామని మంత్రి స్పష్టం చేశారు.

# ఎల్బీ నగర్ ఎలివేటెడ్ కారిడార్‌ను కేంద్ర ప్రణాళికలో చేర్చాలి

- **ఆ తర్వాతే డీపీఆర్**
- **అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఎల్బీ నగర్ హయత్ నగర్ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును ను కేంద్రప్రభుత్వం ప్రణాళికలో చేర్చిన తర్వాత డీపీఆర్ తయారు చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఈ ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మంగళవారం అసెంబ్లీలో అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు సాఫీగా ప్రయాణం చేసేందుకు ఎల్బీ నగర్ నుంచి హయత్ నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేయనున్నట్లు వివరించారు. ఎల్బీ నగర్ హయత్‌నగర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం వార్షిక ప్రణాళికలో చేర్చాలని పేర్కొన్నారు. ఆ తర్వాత ఈ ఎల్బీనగర్ హయత్‌నగర్ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) తయారు చేస్తారని మంత్రి స్పష్టం చేశారు. ఇక తాండూరు నియోజకవర్గంలో రోడ్లు చాలా దారుణ పరిస్థితిలో ఉన్నాయని స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అసెంబ్లీలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్బీ నగర్ దాటిన తర్వాత పనామా వద్ద ఫ్లై ఓవర్ మంజూరు చేసినందుకు మంత్రికి ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ క్రమంలోనే స్పందించిన మంత్రి హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్‌ను తగ్గించేందుకు పక్కా ప్రణాళికతో చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 2, 3 గంటల్లో చేరుకునే విధంగా.. డబుల్ డెక్కర్ రోడ్డును మంజూరు చేయించుకున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.




# సూపర్ స్కోడా.. మార్కెట్‌లోకి "ఈజీ టు లవ్" కుశాక్

**ముద్ర, బిజినెస్:**

స్కోడా ఇండియా తమ ప్రముఖ ఎస్‌యూవీ కుశాక్‌ను రిఫ్రెష్ చేసి కొత్త అవతారంలో మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. అప్‌గ్రేడెడ్ ఫీచర్లతో వచ్చిన ఈ కొత్త కుశక్ ధరలను ప్రకటించడంతో పాటు కస్టమర్ డెలివరీలను కూడా ప్రారంభించింది. యూరోపియన్ టెక్నాలజీ, మెరుగైన భద్రతా ప్రమాణాలు, డ్రైవింగ్ పనితీరుతో ఈ మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కొత్త కుశాక్‌లో సెగ్మెంట్ ఫస్ట్ 8 స్పీడ్ ఆటోమెటిక్ గేర్‌బాక్స్, రియర్ సీట్ మసాజర్ వంటి ఆధునిక ఫీచర్లు ఉన్నాయి. 1.0 టీఎస్‌ఐ మరియు 1.5 టీఎస్ ఐ ఇంజన్ ఆప్షన్లతో, మాన్యువల్ మరియు ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్లలో అందుబాటులో ఉంది. క్లాసిక్+, సిగ్నేచర్, స్పోర్ట్‌లైన్, ప్రెస్టీజ్, మోంటే కార్లో అనే ఐదు వేరియంట్లలో ఈ ఎస్‌యూవీ అందుబాటులో ఉంది. ఎనిమిది ఆకర్షణీయ రంగుల్లో అందుబాటులో ఉన్న ఈ కారు, సేఫ్టీ మరియు వాల్యూ పరంగా సెగ్మెంట్‌లో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతుందని కంపెనీ ఆఫర్ చేస్తుంది. స్కోడా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా మాట్లాడుతూ ప్రతి వేరియంట్‌లో ఉత్తమ విలువను అందించడమే తమ లక్ష్యమన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
25.03.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



నిత్య అన్నదానం
తిరుమలలో రోజూ వేలాది భక్తులకు ఉచిత భోజనం అందిస్తారు. ఇది సేవా భావానికి గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది.


## ఐపీఎల్ 2026కు కఠిన నిబంధనలు..




**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

జట్లకు కొత్త సవాళ్లు

ప్రపంచంలో అత్యంత సంపన్న క్రికెట్ లీగ్ అయిన ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు బీసీసీఐ పలు కఠిన నిబంధనలు అమలు చేసింది. మార్చి 28న బెంగళూరు వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో ఈ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ నిర్ణయాలు జట్ల వ్యూహాలు, ఆటగాళ్ల అలవాట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈసారి ఐపీఎల్ షెడ్యూల్‌ను విడతల వారీగా విడుదల చేయడం ప్రత్యేకంగా నిలిచింది. మొదటి దశలో మార్చి 28 నుంచి ఏప్రిల్ 12 వరకు జరిగే 20 మ్యాచ్‌ల వివరాలనే ప్రకటించారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికల భద్రత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అలాగే టీ20 వరల్డ్ కప్ అనంతరం పిచ్‌ల సంరక్షణ కోసం కూడా ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రాక్టీస్ సెషన్లపై కూడా బీసీసీఐ పలు ఆంక్షలు విధించింది. మ్యాచ్ రోజున పూర్తి స్థాయి ప్రాక్టీస్‌కు అనుమతి ఉండదు. ప్రతి జట్టుకు రెండు నెట్లను మాత్రమే కేటాయించనున్నారు. ప్రధాన పిచ్‌పై పరిమిత ప్రాంతాల్లో మాత్రమే హిట్టింగ్ ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది. ఒక జట్టు ఉపయోగించిన ప్రాక్టీస్ పిచ్‌ను మరో జట్టు వాడటానికి అనుమతి ఉండదు. క్రమశిక్షణ విషయంలోనూ కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ఆటగాళ్లు వ్యక్తిగత వాహనాల బదులుగా జట్టు బస్సుల్లోనే ప్రయాణించాల్సి ఉంటుంది. కుటుంబ సభ్యులకు ప్రయాణ సమయంలో అనుమతి ఉండదు. అలాగే పోస్ట్ మ్యాచ్ కార్యక్రమాల్లో ఆటగాళ్లు స్లీవ్‌లెస్ జెర్సీలు లేదా స్లిప్పర్లు ధరించి రావద్దని స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే హెచ్చరికలతో పాటు జరిమానాలు విధించనున్నట్లు తెలిపింది. టెక్నికల్ అంశాల్లో కూడా మార్పులు చేశారు. ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్ దారులు మ్యాచ్ ప్రారంభ రెండు ఓవర్ల వరకు ఆ క్యాప్‌లను ధరించాల్సి ఉంటుంది. మైదానంలోని ఎల్ఈడి బోర్డులు దెబ్బతినకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ నిబంధనలతో ఐపీఎల్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలనే లక్ష్యంతో బీసీసీఐ ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

## రీజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్ గా రింకూ సింగ్




**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

భారత క్రికెట్ జట్టు స్టార్ ఫినిషర్ రింకూ సింగ్‌కు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం గౌరవప్రదమైన బాధ్యతలను అప్పగించింది. అంతర్జాతీయ స్థాయిలో ఆయన కనబరుస్తున్న ప్రతిభకు గుర్తింపుగా రింకూను రీజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్ (RSO)గా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. టీ20 ప్రపంచకప్ 2026 గెలిచిన భారత జట్టులో రింకూ కీలక సభ్యుడిగా నిలిచాడు. వరల్డ్ కప్ సమయంలో రింకూ సింగ్ వ్యక్తిగతంగా తీవ్ర విషాదాన్ని ఎదుర్కొన్నప్పటికీ, జట్టుకు అండగా నిలిచాడు. ఆయన తండ్రి క్యాన్సర్‌తో చికిత్స పొందుతూ మరణించిన సమయంలోనూ దేశం కోసం ఆడాల్సిన బాధ్యతను నిర్వర్తించాడు. ఈ అంకితభావాన్ని గుర్తించి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రింకూ సింగ్‌తో పాటు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన మరికొంతమంది క్రీడాకారులకు కూడా ఉద్యోగాలను ప్రకటించారు. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన హాకీ ఆటగాడు రాజ్‌కుమార్ పాల్, పారాలింపిక్ హైజంప్‌లో స్వర్ణ పతకం గెలిచిన ప్రవీణ్ కుమార్‌కు DSP పదవులు కేటాయించారు. అలాగే జావలిన్ త్రోలో రజత పతకం సాధించిన అజిత్ సింగ్, 200 మీటర్ల పరుగులో కాంస్య పతకం గెలిచిన సిమ్రాన్‌కు DPRO పదవులు ఇవ్వనున్నారు. 100, 200 మీటర్ల విభాగాల్లో కాంస్య పతకాలు గెలిచిన ప్రీతి పాల్‌ను BDOగా నియమించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.




## నిరంతర యజ్ఞంలా సీఎం కప్

- **తెలంగాణ మట్టిలో మాణిక్యాలను గుర్తిస్తాం**
- **సీఎం కప్ రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకల్లో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

**ముద్ర, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో క్రీడా ప్రతిభను వెలికితీయడం లక్ష్యంగా నిర్వహిస్తున్న "సీఎం కప్" పోటీలు రాష్ట్ర స్థాయిలో ఘనంగా ముగిశాయి. హైదరాబాద్‌లోని ఎల్‌బీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ ముగింపు వేడుకలకు రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు .ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ మట్టిలో దాగి ఉన్న మాణిక్యాలైన క్రీడాకారులను గుర్తించేందుకు సీఎం కప్‌ను నిరంతర కార్యక్రమంగా కొనసాగిస్తామని తెలిపారు. క్రీడల్లో విజయం సాధించాలంటే ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు క్రీడాకారుల కృషి, పట్టుదల కూడా అవసరమని ఆయన పేర్కొన్నారు. యువతకు ఒలింపియన్ సైనా నెహ్వాల్ వంటి క్రీడాకారులు స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, సీఎం కప్ ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి వెల్లడించిన ప్రకారం, ఈ పోటీలకు సుమారు 5.40 లక్షల మంది క్రీడాకారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం విశేషం.ఈ పోటీల్లో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. రంగారెడ్డి జిల్లా రెండో స్థానం, కరీంనగర్ జిల్లా మూడో స్థానాలను దక్కించుకున్నాయి. విజేతలకు మంత్రి వాకిటి శ్రీహరి, సైనా నెహ్వాల్ తదితరులు ట్రోఫీలు అందజేశారు. అదేవిధంగా, సీఎం కప్ విజయవంతానికి కృషి చేసిన స్పోర్ట్స్ అథారిటీ పిఆర్ఓ కాలేరు సురేష్‌ను సన్మానించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, క్రీడా సంఘాల సహకారంతో ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు. మొత్తంగా సీఎం కప్ పోటీలు తెలంగాణలో క్రీడా అభివృద్ధికి ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తూ, భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దే దిశగా ముందుకు సాగుతున్నాయి.




## రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం మార్పు.. రూ.15,300 కోట్ల భారీ డీల్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి రంగం సిద్ధమవుతున్న వేళ రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ యాజమాన్యం మార్పు చర్చనీయాంశంగా మారింది. అమెరికా వ్యాపారవేత్త కల్ సోమానీ నేతృత్వంలోని కన్సార్టియం ఈ జట్టులోని 100 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ ఒప్పందం విలువ దాదాపు రూ.15,300 కోట్లుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ డీల్ ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత భారీగా జరిగిన ఒప్పందంగా వ్యాపార నిపుణులు పేర్కొంటున్నారు. కల్ సోమానీతో పాటు వాల్‌మార్ట్ కుటుంబానికి చెందిన అమెరికన్ వ్యాపారవేత్త రాబ్ వాల్టన్, హాంప్ కుటుంబం కూడా ఈ కన్సార్టియంలో భాగస్వాములుగా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుత ఐపీఎల్ సీజన్ ముగిసిన అనంతరం రాజస్థాన్ రాయల్స్ జట్టు యాజమాన్యం అధికారికంగా కొత్త యాజమాన్యం చేతుల్లోకి వెళ్లనుంది. ఈ పరిణామం ఐపీఎల్ వ్యాపార విలువలు మరింత పెరుగుతున్నాయని సూచిస్తున్నట్లు క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఐపీఎల్ 2026 సీజన్ మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య చిన్నస్వామి స్టేడియం వేదికగా శనివారం తొలి మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే అన్ని జట్లు సన్నాహకాల్లో నిమగ్నమై ముమ్మరంగా సాధన కొనసాగిస్తున్నాయి.

## ఎస్ఆర్‌హెచ్‌కు శుభవార్త.. జట్టుతో చేరనున్న కెప్టెన్ కమిన్స్




**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఊరటనిచ్చే వార్త వచ్చింది. వెన్నునొప్పి గాయం కారణంగా గత కొంతకాలంగా ఆటకు దూరంగా ఉన్న కెప్టెన్ పాట్ కమిన్స్ పూర్తిగా కోలుకోవడంతో ఐపీఎల్‌లో ఆడేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా అనుమతి ఇచ్చింది. దీంతో కమిన్స్ మార్చి 24న బెంగళూరు చేరుకుని జట్టుతో కలవనున్నారు. అయితే గాయం నుంచి తాజాగా కోలుకున్న నేపథ్యంలో మార్చి 28న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగే తొలి మ్యాచ్‌లో కమిన్స్ ఆడుతారా లేదా అన్నది ఇంకా స్పష్టత రాలేదు. కమిన్స్ గైర్హాజరీలో ఇషాన్ కిషన్ తాత్కాలిక కెప్టెన్‌గా జట్టును నడిపించనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా శ్రీలంక యువ బౌలర్ ఎషాన్ మలింగా కూడా ఎస్ఆర్‌హెచ్ జట్టుతో చేరడం బౌలింగ్ విభాగానికి బలం చేకూర్చింది. శ్రీలంక క్రికెట్ బోర్డు నుంచి అనుమతి లభించడంతో అతను కూడా జట్టులో చేరనున్నారు. కమిన్స్ తిరిగి జట్టుతో కలవడం ఆటగాళ్లలో నూతనోత్సాహం నింపింది. ఒకవేళ ప్రారంభ మ్యాచ్‌లకు కమిన్స్ దూరమైనా, ఇతర బౌలర్లు అందుబాటులో ఉండటం జట్టుకు కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారు. తొలి మ్యాచ్‌లో ఆర్‌సీబీతో తలపడేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ సన్నద్ధమవుతోంది.

## ఫ్యాన్స్ కోసం కావ్య సంచలన నిర్ణయం

- **ఉప్పల్ స్టేడియంలో సౌకర్యాల కోసం రూ.10 కోట్లు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు అభిమానులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. తమ హోమ్ గ్రౌండ్ అయిన ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం అభివృద్ధికి సుమారు రూ.10 కోట్లు సొంత నిధులతో ఖర్చు చేసింది. స్టేడియంలోని టాయిలెట్స్, కార్పొరేట్ బాక్స్‌లు, లాంజ్‌లను పూర్తిగా పునరుద్ధరించారు. మొత్తం 42 టాయిలెట్స్, 42 బాక్స్‌లను ఆధునీకరించడంతో పాటు రెండు ఎలివేటర్లు, 43 ఎయిర్ కండిషనర్లను కూడా ఏర్పాటు చేశారు. ఈ వివరాలను సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. గతేడాది కూడా స్టేడియం అభివృద్ధి కోసం సుమారు రూ.5 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. అప్పట్లో ఈ పనులపై వివాదం తలెత్తి, టికెట్ల అంశం వరకు వెళ్లిన విషయం తెలిసిందే. అనంతరం ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో సంబంధిత పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం స్టేడియంలో అభిమానుల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని మరిన్ని మార్పులు చేపట్టడంతో ఫ్యాన్స్




సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ తొలి మ్యాచ్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆడనుంది.

## ఆర్‌సీబీ కీలక నిర్ణయం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**


11 నెంబర్ జెర్సీతో మృతులకు నివాళి

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆటగాళ్లు 11 నెంబర్ జెర్సీలు ధరించనున్నారు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ సీఈఓ రాజేశ్ మేనన్ వెల్లడించారు. గత ఏడాది విజయోత్సవ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన 11 మందికి నివాళిగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. స్టేడియంలో 11 సీట్లను మృతుల జ్ఞాపకార్థం ప్రత్యేకంగా రిజర్వ్ చేయనున్నట్లు సమాచారం. ఈ వేదికపై జరిగే మ్యాచ్‌లు, ఇతర కార్యక్రమాల సమయంలో కూడా ఆ సీట్లు ఖాళీగా ఉంచనున్నారు. అలాగే మ్యాచ్‌కు ముందు స్టేడియం ప్రవేశ ద్వారం వద్ద స్మారక ఫలకాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు గ్రూప్ దశలో చిన్నస్వామి స్టేడియంలో అయిదు మ్యాచ్‌లు, రాయ్‌పూర్ వేదికగా రెండు మ్యాచ్‌లు ఆడనుంది.



క్రమశిక్షణ, నిర్వహణ

తిరుమలలో భక్తుల నిర్వహణ ఎంతో శ్రద్ధగా జరుగుతుంది. సిస్టమేటిక్ దర్శనం, సేవలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తాయి.





# తెలుగు విడుదలకు కౌంట్‌డౌన్

ముద్ర, సినిమా డెస్క్:

యువతను లక్ష్యంగా తీసుకుని రూపొందిన "యూత్" చిత్రం ఇప్పటికే మంచి విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో ప్రముఖ నటుడు శిలంబరసన్ టీఆర్ (శింబు) చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా కలుసుకుని అభినందించారు. చిత్ర బృందంతో కలిసి గడిపిన ఆయన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. యువత జీవనశైలి, వారి స్వేచ్ఛ, సరదా క్షణాలను ప్రతిబింబించేలా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఎలాంటి నియంత్రణలు లేకుండా సాగిపోయే యువత జీవన విధానాన్ని ఆకర్షణీయంగా చూపించడంతో ఈ సినిమా యూత్‌లో మంచి ఆదరణ పొందింది. ఇక ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు మార్చి 26న విడుదల చేయడానికి సిద్ధం చేశారు. ప్రముఖ సంస్థ ఈ2సీ టాకీస్ ద్వారా ఈ సినిమా తెలుగు రాష్ట్రాల్లో విడుదల కానుంది. విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో చిత్ర ప్రమోషన్లను వేగవంతం చేశారు. యువతకు నచ్చే అంశాలతో రూపొందిన ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల్లో కూడా మంచి స్పందన సాధిస్తుందని చిత్ర బృందం ఆశాభావం వ్యక్తం చేసింది.

# ఫాంటసీ, అడ్వెంచర్, కామెడీ మేళవింపు 'రాకాస': డైరెక్టర్ మానస శర్మ

ముద్ర, సినిమా డెస్క్:

జీ స్టూడియోస్ సమర్పణలో నిహారిక కొణిదెల తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి 'రాకాస' చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించగా, సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దర్శకురాలు మానస శర్మ మాట్లాడుతూ 'రాకాస'ను ఫాంటసీ, అడ్వెంచర్, కామెడీ జానర్ల మేళవింపుతో రూపొందించినట్లు తెలిపారు. ఈ కథను మొదట వెబ్ సిరీస్‌గా రూపొందించాలని భావించినప్పటికీ, తరువాత సినిమాగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. కథ విన్న సంగీత్ శోభన్ ఆసక్తి చూపడంతో ఈ ప్రాజెక్ట్ ముందుకు వెళ్లిందని వివరించారు. సంగీత్ శోభన్ కామెడీ టైమింగ్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని, నయన్ సారిక తన పాత్రలో సహజంగా నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని తెలిపారు. కథను వినిపించగానే నిర్మాత నిహారిక కొణిదెల ఈ ప్రాజెక్ట్‌పై విశ్వాసంతో ముందుకు వచ్చారని చెప్పారు. బడ్జెట్ పరంగా ముందుగానే ప్రణాళిక రూపొందించుకోవడంతో చిత్ర నిర్మాణంలో పెద్ద ఇబ్బందులు ఎదురుకాలేదని మానస శర్మ తెలిపారు. చిత్రంలోని ప్రతి అంశం ముందే నిర్ణయించుకోవడం వల్ల నిర్మాణం సజావుగా సాగిందని వివరించారు. 'రాకాస' పూర్తిగా కల్పిత కథతో రూపొందిన చిత్రం అని, థియేటర్లలో ప్రత్యేక అనుభూతి అందించే విధంగా తెరకెక్కించినట్లు చెప్పారు. ముఖ్యంగా రెండో భాగంలో ఎక్కువ వీఎఫ్ఎక్స్ సన్నివేశాలు ఉండటంతో ముందుగా ఆ భాగం చిత్రీకరించి, సమాంతరంగా వీఎఫ్ఎక్స్ పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. విజువల్, సౌండ్ పరంగా ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు.





# ఫిట్‌నెస్ కోచ్ నుంచి నటుడిగా..

## 'ధురంధర్2'లో మెరిసిన ముస్తఫా

ముద్ర, సినిమా డెస్క్:

'ధురంధర్2' చిత్రంలో రిజ్వాన్ పాత్రతో గుర్తింపు తెచ్చుకున్న ముస్తఫా అహ్మద్ తన యూనిక్ ఫిజిక్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. సినిమాలో పాకిస్థాన్‌లో ఇండియన్ స్పైగా నటించి కథలో కీలక పాత్ర పోషించాడు. సినిమాల్లోకి రాకముందు ముస్తఫా ప్రముఖ ఫిట్‌నెస్ కోచ్‌గా బాలీవుడ్‌లో మంచి పేరు సంపాదించాడు. రణ్‌వీర్ సింగ్, విక్కీ కౌశల్, యామి గౌతమ్, హృతిక్ రోషన్ వంటి పలువురు నటీనటులకు ఫిట్‌నెస్ శిక్షణ ఇచ్చి గుర్తింపు పొందాడు. చిన్నప్పటి నుంచి డెస్లెక్సియా సమస్యతో చదువు మధ్యలోనే ఆపేసినా, ఫిట్‌నెస్‌పై ఆసక్తితో జిమ్ ట్రైనర్‌గా కెరీర్ ప్రారంభించాడు. తక్కువ జీతంతో మొదలైన ఈ ప్రయాణం కొద్ది కాలంలోనే టాప్ ట్రైనర్ స్థాయికి తీసుకెళ్లింది. ఈ క్రమంలో దర్శకుడు ఆదిత్య ధర్ పరిచయం కావడంతో నటన వైపు అడుగుపెట్టాడు. 'ధురంధర్' చిత్రంతో నటుడిగా మంచి గుర్తింపు పొందిన ముస్తఫా, ఫిట్‌నెస్ కోచ్ నుంచి నటుడిగా ఎదిగిన తన ప్రయాణంతో ప్రత్యేక గుర్తింపు సాధించాడు.



# బడే సాబ్ పాత్రకు 8 గంటల మేకప్

ముద్ర, సినిమా డెస్క్:

'ధురంధర్2' చిత్రం విజయంతో ఇందులోని 'బడే సాబ్' పాత్రకు మంచి గుర్తింపు వచ్చింది. అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం స్ఫూర్తితో రూపొందించిన ఈ పాత్రను నటుడు డానిష్ ఇక్బాల్ పోషించాడు. ఈ పాత్రకు మొదట పలువురు స్టార్ హీరోల పేర్లు వినిపించినప్పటికీ, చివరకు డానిష్ ఇక్బాల్ ఎంపికయ్యాడు. తన గత నటనను చూసి ఆడిషన్ లేకుండానే ఈ పాత్రకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఈ పాత్ర కోసం ప్రత్యేక ప్రోస్థటిక్ మేకప్ వాడినట్లు డానిష్ ఇక్బాల్ వెల్లడించాడు. దావూద్ వృద్ధాప్యంలో ఎలా ఉంటాడో ఊహిస్తూ రోజుకు ఏడు నుంచి ఎనిమిది గంటల పాటు మేకప్ చేసేవారని, షూటింగ్ పూర్తైన తర్వాత మేకప్ తొలగించడానికి మరో రెండు గంటలు పట్టేదని తెలిపారు. మొత్తం స్క్రిప్ట్‌ను రహస్యంగా ఉంచి, తన పాత్రకు సంబంధించిన సన్నివేశాలు మాత్రమే అందించినట్లు చెప్పారు.



# సినిమాల కన్నా ఇన్‌స్టాలోనే లక్షల ఆదాయం

ముద్ర, సినిమా డెస్క్:

బాలీవుడ్ హీరోయిన్ నేహా శర్మ సినిమాల్లో పెద్దగా విజయాలు సాధించకపోయినా, సోషల్ మీడియా ద్వారా ఆదాయం సంపాదిస్తూ చర్చనీయాంశంగా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రత్యేక కంటెంట్ కోసం నెలకు రూ.290 సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను అందుబాటులో ఉంచింది. ప్రస్తుతం ఆమెకు సుమారు 2,454 మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నట్లు సమాచారం. దీంతో కేవలం ఇన్‌స్టాగ్రామ్ ద్వారానే నెలకు దాదాపు రూ.7 లక్షలకు పైగా ఆదాయం పొందుతున్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్‌లో కొన్ని చిత్రాలు, ఓటీటీ వేదికగా 'ఇల్లీగల్' వెబ్ సిరీస్‌లో నటించినా పెద్దగా గుర్తింపు రాలేదు. అయితే సోషల్ మీడియాలో ఫొటోషూట్లు, జిమ్ వీడియోలతో మంచి ఫాలోయింగ్ సంపాదించి, అదే క్రేజ్‌ను ఇప్పుడు ఆదాయంగా మార్చుకుంటోంది.



# బ్లాక్ లుక్‌తో ఆకట్టుకుంటున్న కేతిక శర్మ

ముద్ర, సినిమా డెస్క్:

యువ నటి కేతిక శర్మ తన కొత్త ప్రాజెక్ట్‌లతో పాటు సోషల్ మీడియాలో కూడా అభిమానులను ఆకట్టుకుంటోంది. 'మీసాయ మురుక్కు 2', దర్శకుడు రాజేష్ ఎం సెల్వాతో రూపొందుతున్న మరో చిత్రంతో పాటు ఇటీవల వచ్చిన 'ఆరా 10/10' ప్రాజెక్ట్ పాటలతో మంచి గుర్తింపు తెచ్చుకుంటోంది. ఈ క్రమంలో ఆమె తాజాగా షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోలలో కేతిక శర్మ బ్లాక్ స్లీవ్‌లెస్ టాప్‌లో స్టైలిష్‌గా కనిపించింది. సరళమైన డిజైన్‌తో పాటు ఆకర్షణీయమైన లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంది. సహజమైన హెయిర్ స్టైల్, తక్కువ మేకప్‌తో ఆమె ప్రత్యేకంగా మెరిసింది. వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్న కేతిక శర్మ తదుపరి చిత్రాలు ప్రేక్షకులను ఎంతగా ఆకట్టుకుంటాయో అన్న ఆసక్తి నెలకొంది.



# గోల్డ్ చీరలో మెరిసిన సోనాల్ చౌహన్..

ముద్ర, సినిమా డెస్క్:

బాలీవుడ్ చిత్రం 'జన్నత్'తో సినీ రంగంలోకి వచ్చిన సోనాల్ చౌహన్, 'రెయిన్‌బో' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. తరువాత నందమూరి బాలకృష్ణ నటించిన 'లెజెండ్' చిత్రంతో మళ్లీ తెలుగు ప్రేక్షకులకు చేరువైంది. ఆ చిత్రం విజయంతో తెలుగులో పలు సినిమాల్లో నటించి గుర్తింపు సంపాదించింది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలో కూడా ఈ బ్యూటీ మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. తాజాగా సోనాల్ చౌహన్ గోల్డ్ కలర్ హెవీ వర్క్ చీరలో ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. పింక్ స్టోన్ వర్క్ ఉన్న స్ట్రాప్‌లెస్ బ్లౌజ్, భారీ నెక్లెస్, మ్యాచింగ్ ఇయర్ రింగ్స్‌తో స్టైలిష్ లుక్‌లో మెరిసింది. ప్రత్యేక హెయిర్ స్టైల్‌తో ఇచ్చిన ఆమె స్టిల్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com